హైదరాబాద్‌లో యువభారత్ రన్




2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 30 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 83 | పేజీలు:12 | వెల రూ.5

అదరగొట్టిన అమాత్యులు



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# యుద్ధం వద్దు

## అమెరికావ్యాప్తంగా ఆందోళనలు

50 రాష్ట్రాల్లో 3,200 నిరసన ప్రదర్శనలు

ట్రంప్ వ్యతిరేక ప్లకార్డులు చేబూని లక్షలాది మంది చేసిన నినాదాలతో ప్రతిధ్వనించిన దేశం




మిన్నెసోటా, మార్చి 29: ట్రంప్ వ్యవహారశైలిపై అమెరికా, ఐరోపా దేశాల్లో తీవ్ర నిరసనలు మొదలయ్యాయి. అగ్ర రాజ్య వ్యాప్తంగా 50 రాష్ట్రాల్లో 3,200 నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వాషింగ్టన్, లాస్ ఏంజెలెస్, డల్లాస్, ఫిలడెల్ఫియా, న్యూయార్క్ వంటి నగరాల్లో భారీ

...మిగతా 2లో

# అమెరికా నిఘా విమానంపై దాడి

## యుద్ధంపై అగ్రరాజ్యంలో భయాలు పుట్టిస్తున్న ఇరాన్

టెహ్రాన్, మార్చి 29: అమెరికా నిఘా విమానం ఈ3-సెంట్రీపై ఇరాన్ దాడి చేసి ధ్వంసం చేసింది. ఇది సాధారణ విమానం కాదు. బోయింగ్-707 మోడల్లో మార్పులు చేసి గగనతలంలో ఓ కమాండ్ సెంటర్లా దీనిని రూపొందించారు. ఇది శత్రుదేశాల



...మిగతా 2లో

## అగ్రరాజ్య దళాలను బూడిద చేస్తం

2

ఇక్కడున్నది రేవంత్ రెడ్డి.. భట్టి విక్రమార్క

# బీఆర్‌ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవ్

అసెంబ్లీకి రాని కేసీఆర్‌తో రాజీనామా చేయించండి

అక్రమ మైనింగ్‌పై ఆధారాలుంటే సీఐడీకి ఇవ్వండని హరీష్, కేటీఆర్‌లకు సూచన

దళితుడైన భట్టిని సీఎల్పీ నేతను చేస్తే ఆ పార్టీ ఓర్వలేదు

కేసీఆర్‌తో సమానమైన నేత కడియం శ్రీహరిని అవమానిస్తారా?

అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 29 (మనం బ్యూరో): బీఆర్ ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు. ఇక్కడ ఉన్నది రేవంత్ రెడ్డి, భట్టి విక్కమార్క. రేవంత్ ముందు మీ బెదిరింపులు నడవవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మైనింగ్ శాఖలో జరిగిన అక్ర మాలను వెలికి తీసేందుకు చిత్తశుద్ధితో ఉన్నామనీ, హరీష్ రావు కారణంగా తాను ఇరుకున్న పడ్డానని కేటీఆర్ ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆది వారం శాసనసభలో మైనింగ్ అంశంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికా రంలోకి రాగానే దళితుడిని సీఎంను చేస్తానన్న హామీని కేసీఆర్ తుంగలో తొక్కారనీ గుర్తు చేశారు. సీనియర్లను కాదని దళిత నేత భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేతను చేస్తే ఆయన ఉండకూడదని బీఆర్ఎస్ కుట్ర చేసిందనీ, ఎమ్మెల్యేలను లాక్కుని ఆ హోదా రాకుండా చేశారని ఆరోపించారు. వ్యక్తిగతంగా భట్టి విక్రమార్కను హరీష్ రావు టార్గెట్ చేసి అవమానిస్తున్నారనీ, దళితుడి ముందు కేసీఆర్ చేతులు కట్టుకుని నిలబడాలని గడ్డం ప్రసాద్ కుమార్‌కు స్పీకర్‌గా అవకాశం కల్పించామన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నాడని అసెంబ్లీకి కేసీఆర్ రావడం లేదని ఆరోపించారు. బంధువుల కంపెనీని అడ్డు పెట్టుకుని మంత్రి పొంగులేటిని బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత 12 ఏళ్ల మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ చేపడతామనీ, అక్రమాలపై ఆధారాలుంటే సీఐడీకి ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు హరీష్ రావు, కేటీఆర్‌కు సూచించారు. ఇతర పార్టీల సభ్యులు కూడా రాష్ట్ర ఖనిజ సంపదను దోచుకుంటే ఆ ఆధారాలు కూడా ఇవ్వాలని సూచించారు. అక్రమ మైనింగ్‌పై హౌస్ కమిటీ వేసినా నివేదికను మళ్లీ ఏదో ఒక ప్రభుత్వ విచారణ

...మిగతా 2లో

## రేవంత్‌తో మేనకా గాంధీ భేటీ

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జంతు సంరక్షణ చర్యలపై హర్షం



2

# బాసర నుండి భద్రాచలం వరకు

## ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధి

వచ్చే ఏడాది జూన్‌లోగా పనులన్నీ పూర్తి కావాలి

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష




హైదరాబాద్, మార్చి 29 (మనం బ్యూరో): బాసర నుండి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ పనులన్నీ వచ్చే ఏడాది జూన్‌లోగా పనులన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఆదివారం 2027 జూన్‌లో గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజినీర్ల కమిటీని నియమించాలని అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటించి 15 లేదా 20 రోజుల్లోగా నివేదికను అధికారులకు అందజేయాలన్నారు. ఇంజినీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి పూర్తి అంచనాలతో

...మిగతా 2లో

# 15 శాతం జీతం కట్

కన్నవారిని చూసుకోని ఉద్యోగి వేతనంలో కోత

తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

అమ్మానాన్నలను పట్టించుకోని కొడుకులకు సమాజంలో బతికే హక్కు లేదు

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 29 (మనం బ్యూరో): తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం అసెంబ్లీ వేదికగా అధికారికంగా ప్రకటించారు. తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగి జీతంలో 15 శాతం కోత విధించి ఆ మొత్తాన్ని నేరుగా ఉద్యోగి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేలా చట్టాన్ని రూపొందించామని తెలిపారు. పిల్లల్ని కనగలం కానీ, వారి బుద్ధుల్ని కనలేం అన్నట్లుగా కొందరి వ్యవహారం ఉంది. సామాజిక బాధ్యతగా మా ప్రభుత్వం తల్లిదండ్రుల కోసం ఈ చట్టం తెచ్చింది. భక్తితో లేదా భయంతో తల్లిదండ్రులను చూసుకోవాలన్నదే మా ఆలోచన. ప్రేమలు పంచాల్సిన

...మిగతా 2లో

# గోవా టు మొయినాబాద్

## పైలట్ బ్రదర్స్ కేసులో మరో ట్విస్ట్

వీకెండ్‌లలో ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు

రోహిత్ రెడ్డి వ్యాపారాలపై సిట్ నజర్



హైదరాబాద్,మార్చి 29(మనం,ప్రత్యేక ప్రతినిధి): మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తవ్వేకొద్ది సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గోవాకు చెందిన డీజే క్లింటన్ మొయినాబాద్ డ్రగ్స్ పార్టీకి కొకైన్ సరఫరా చేసినట్లు నిర్ధారణ అయింది. సిట్ విచారణలో క్లింటన్ గోవా నుంచి తెచ్చిన కొకైన్‌ను వాచ్ మెన్ భార్యకు ఇచ్చాడని,

వాచ్ మెన్ భార్య ఈ డ్రగ్స్‌ను మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి అందించినట్లు తేలింది. డీజే క్లింటన్ పలు మార్లు పలురకాల మత్తు పదార్థాలను తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఇచ్చాడని, రోహిత్‌రెడ్డి డ్రగ్స్‌కు బానిసైనట్లు సిట్ విచారణలో వెల్లడైంది. గోవా, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించిన పైలెట్ బ్రదర్స్ తరచూ వారి ఫామ్ హౌస్, పబ్బుల్లో వీకెండ్ లిక్కర్, డ్రగ్స్ పార్టీలు నిర్వహించినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ క్రమంలోనే డ్రగ్స్ సప్లయర్లతో రోహిత్ రెడ్డికి డైరెక్ట్ లింకులు ఉన్నట్లు గుర్తించింది.

**వీకెండ్‌లో పార్టీలు:**

మొయినాబాద్ ఫామ్ హౌస వీకెండ్‌లో డ్రగ్స్ పార్టీలు జరిగేవని, ఈ పార్టీలలో పొలిటికల్,

...మిగతా 2లో

# శిరస్సు వంచి సారీ చెబుతున్న..

బీఆర్‌ఎస్ పాపంలో నాకూ భాగం ఉంది

తనను క్షమించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కోరిన కవిత

హైదరాబాద్,మార్చి 29(మనం, ప్రత్యేక ప్రతినిధి): బీఆర్ఎస్ హయాంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయానని, తనను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు క్షమించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఇందిరా పార్క్ వద్ద ఆదివారం జరిగిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాలో



...మిగతా 2లో


## పునర్విభజన అంటే రేవంత్ భయపడుతున్నడు

బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్ ఆరోపణలు

2

రేమండ్ గ్రూపు స్థాపకుడు, విమానయాన నిపుణుడు

## విజయ్‌పత్ సింఘానియా మృతి



2

కొడుకు నిర్లక్ష్యానికి గురైన తండ్రిగా ఆవేదన చెంది.. తన జీవితాన్ని ఒక గుణపాఠంగా తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించిన ప్రముఖుడు


జాతీయ లోక్ అదాలత్‌లో 1,44,251 కేసులు

## పరిష్కారం

సీఐడీ అదనపు డీజీపీ చారు సిన్హా వెల్లడి



2



రష్యా చమురు ఎగుమతికి అత్యంత కీలక

## పోర్టును దెబ్బతీసిన ఉక్రెయిన్

మాస్కో, మార్చి 29: రష్యా చమురు ఎగుమతుల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఉస్త్ లుగా నౌకాశ్రయాన్ని ఉక్రెయిన్ డ్రోన్లు తీవ్రంగా దెబ్బతీశాయి. వారం క్రితం జరిగిన దాడిలో ఈ పోర్టు కొంత మేర ధ్వంసం కావడంతో.. ఇప్పటికే ఎగుమతులను నిలిపివేశారు. తాజాగా ఈ పోర్టుపై ఆదివారం మరోసారి ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ విషయాన్ని లెనిన్ గ్రాడ్ ప్రాంత గవర్నర్ కూడా ధ్రువీకరించారు. అప్పటికీ తాము 31 డ్రోన్లను కూల్చినట్లు పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ కు ఇంధనం సరఫరా చేసే పోర్టుల్లో ఉస్త్ లుగా పోర్టు కూడా కీలకమైంది. బాల్టిక్ సముద్ర ప్రాంతంలో రష్యా ఎగుమతులకు ఈ పోర్టు చాలా కీలకం. ఇదే ప్రాంతంలోని ప్రిమోరస్క్ పోర్టు కూడా

...మిగతా 2లో

# తప్పుడు ప్రచారాలు నమ్మకండి

## పశ్చిమాసియా యుద్ధంపై దేశ ప్రజలకు మోదీ సూచన



ఢిల్లీ, మార్చి 29: పశ్చిమాసియాలో గత నెల రోజులుగా కొనసాగుతోన్న యుద్ధం.. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లను సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 132వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కీలక ఘటనలు జరిగాయని ప్రధాని పేర్కొన్నారు. గతంలో కోవిడ్ కారణంగా ప్రపంచమంతా అనేక సమస్యలు ఎదుర్కొందన్నారు. దాని నుంచి బయటపడిన తర్వాత.. దేశాల మధ్య కొనసాగుతోన్న యుద్ధాలు పరిస్థితులను మార్చేశాయన్నారు. ప్రస్తుతం అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం గురించి మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులకు సాయం అందిస్తున్న ఆయా ప్రభుత్వాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన సరఫరాకు కీలకమైన ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున.. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సంక్షోభం తలెత్తిందన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలందరూ ఐక్యతతో ఉండాలని మోడీ పిలుపునిచ్చారు. తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. సంక్షోభాన్ని రాజకీయం

...మిగతా 2లో

# ఆస్ట్రేలియా పార్లమెంటు ఎన్నికల బరిలో తెలుగు వ్యక్తి!

ప్రైమరీ ఎలక్షన్స్‌లో విజయం



మెల్బోర్న్, మార్చి 29: ఆస్ట్రేలియాలో ఈ ఏడాది నవంబరులో జరగబోయే పెద్దల సభ ఎన్నికల్లో తెలుగు మూలాలు కలిగిన వ్యక్తి బరిలో నిలవనున్నారు. మెల్బోర్న్‌కు చెందిన వ్యాపారవేత్త దినేశ్ గౌరిశెట్టి లిబరల్ పార్టీ తరపున పోటీ చేయనున్నారు. విక్టోరియా రాష్ట్రంలోని వెస్టన్ మెట్రోపాలిటన్ రీజియన్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు అర్హత సాధించారు. ఈ స్థానం నుంచి పోటీ విషయంలో ఆ పార్టీ అంతర్గతంగా నిర్వహించిన ఎన్నికల్లో ప్రస్తుత ఎంపీ మోయిరా డీమింగ్ పై దినేశ్ పైచేయి సాధించారు. తద్వారా 2026 నవంబర్లో విక్టోరియా రాష్ట్ర ఎన్నికల్లో లిబరల్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం దక్కించుకున్నారు. మోయిరా డీమింగుకు మాజీ ప్రధాని టోనీ అబాట్ వంటి పెద్దల మద్దతు ఉన్నప్పటికీ దినేశ్ గౌరిశెట్టి చేతిలో

...మిగతా 2లో

# యువభారత్ రన్ ఉత్సాహంగా పాల్గొన్న యువత

**హైదరాబాద్, మార్చి 29:** హెదరాబాద్ లో యువభారత్ రన్ 2026 ఉత్సాహంగా కొనసాగింది. నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద 2కె, 4కె విభాగాలలో ఈ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు శర్వానంద్ పాల్గొని సందడి చేశారు. యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో రన్ లో పాల్గొనడం విశేషం.

# విజయ్‌పత్ సింఘానియా మృతి

**ముంబై, మార్చి 29:** ప్రముఖ పారిశ్రామికవేత్త, విమానయాన నిపుణుడు రేమండ్ గ్రూపును ప్రపంచ స్థాయి వస్త్ర పరిశ్రమగా అభివృద్ధి పరిచిన రేమండ్ గ్రూప్ చైర్మన్ విజయ్ పత్ సింఘానియా(87) మృతి చెందారు. ఆయన 2006లో ఆయన పద్మభూషణ్, 2003లో టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం అందుకున్నారు. గతంలో తన కుమారుడు గౌతమ్ సింఘానియాతో ఆస్తుల విషయంలో తీవ్రమైన న్యాయ వివాదంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఈయన తన సొంత పరిస్థితిని ఒక గుణపాఠంగా ఉదహరిస్తూ.. తల్లిదండ్రులు తమ జీవితకాలంలో తమ ఆస్తి మొత్తాన్ని పిల్లలకు బదిలీ చేయవద్దని బహిరంగంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆయన మృతిపై పలువురు నివాళులర్పించారు.

# బాసర నుండి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి పంపాలని తెలిపారు. సబ్ కమిటీ ఆమోదం తరువాత ప్రణాళికలకు సంబంధించిన నివేదికపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలనీ, వివిధ విభాగాల మధ్య సమన్వయం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్ల వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన సీఎం బాసన శ్రీజ్ఞాన సరస్వతి దేశస్థానం అభివృద్ధి ఆలయ నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరించారు.

# బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవ్

(మొదటి పేజీ తరువాయి)

సంస్థకు ఇవ్వాల్సిందేననీ, అందుకే నేరుగా సీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు. సీఐడీ విచారణపై నమ్మకం లేకుంటే సీబీఐకి అప్పగించాలా ? బ్లాక్ మెయిల్ చేయడానికి వారు హౌస్ కమిటీ కోరుతున్నరు. ఇక్కడ మీ పప్పులు ఉడకవని గుర్తు పెట్టుకోండని సూచించారు.

దళితులకు పరిపాలన చేతకాదనీ, తానే సమస్యలను పరిష్కరిస్తానన్న కేసీఆర్ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని గుర్తు చేశారు. దళితుడైన భట్టి విక్కమార్కను ప్రతిపక్ష నేతను చేస్తే ఓర్వలేకపోయారన్నారు.

ఇప్పుడాయన మా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. దళితుడిని మైక్ అడగాల్సి వస్తుందని కేసీఆర్ సభ ముందుకు రావడం లేదనీ స్పీకర్‌గా దళితుడు ఉండొద్దనే బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దకు వచ్చి నిరసన చేస్తున్నారని విమర్శించారు. అక్రమ మైనింగ్ విషయంలో పొంగులేటి అయినా రేవంత్ రెడ్డి కుటుంబమైనా ఆధారాలుంటే బయటపెట్టండనీ, చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రేవంత్‌తో మేనకా గాంధీ భేటీ

## తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జంతు సంరక్షణ చర్యలపై హర్షం

**హైదరాబాద్, మార్చి 29 (మనం బ్యూరో):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జంతు సంరక్షణ ఉద్యమకారిణి మేనకాగాంధీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించడంతో పాటు జంతువుల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతను కొనియాడారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వీధి కుక్కల నిర్వహణ, గో సంరక్షణ చర్యలపై అధికారులు వివరించారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో గో సంరక్షణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో విశాల ప్రదేశంలో ఎన్కపల్లిలో గోశాల నిర్మాణం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు ఆలయాల సమీప ప్రాంతాల్లో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మేనకా గాంధీకి వివరించారు.

# యుద్ధం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శనలు జరిగాయి. వీటిలో చాలా చోట్ల లక్షలాది మంది పాల్గొని ట్రంప్ వ్యతిరేక ప్లకార్డులు ప్రదర్శించారు.పౌరహక్కులు, ఇమిగ్రేషన్, ఇరాన్ పై యుద్ధంలో అమెరికా సైన్యం పాత్రపై ఆందోళకారులు గళమెత్తారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత చోటు చేసుకొన్న అతిపెద్ద ఆందోళనలుగా అమెరికా మీడియా అభివర్ణించింది. ఈ ఆందోళనలకు కేంద్రంగా మిన్నెసోటా నిలిచింది. దాని రాజధాని సెయింట్ పాల్లో భారీ ర్యాలీ జరిగింది. ఆ రాష్ట్ర గవర్నర్ టిమ్ వాల్జ్ ఈ ఆందోళనలపై స్పందిస్తూ.. ఇవి ప్రజాస్వామ్య విలువలకు అద్దంపట్టాయని పేర్కొన్నారు. లాస్ ఏంజెలెస్లోని ఫెడరల్ డిటెన్షన్ సెంటర్ వద్ద ఆందోళనకారులు ఏవో వస్తువులను విసిరివేయడంతో.. భద్రతా దళాలు టియర్ గ్యాసును వాడాల్సి వచ్చింది. డాల్లస్ లో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో కొంత మందిని అరెస్టు చేశారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీ నేతలు ఈ ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమైనవని విమర్శించారు. ఇక ఐరోపాలోని లండన్, ప్యారిస్, రోమ్ వంటి పెద్ద నగరాల్లో కూడా ట్రంప్ విధానాలపై ఆందోళనలు చేపట్టారు.

# అమెరికా నిఘా విమానంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలు, ట్యాంకర్ విమానాల కదలికలను పసిగడుతుంది. 250 మైళ్ల పరిధిలో గగనతలంలో ఏం జరిగినా ఈ ఒక్క విమానమే గుర్తించగలదు. అమెరికా ఎయిర్ ఫోర్స్ కర్నల్ జాన్ వెనబల్ మీడియాతో మాట్లాడుతూ.. యుద్ధ రంగంలో అమెరికా సామర్థ్యంపై ఈ ఘటన ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంపై నిఘా ఉంచడం.. పరిస్థితిపై అవగాహన తెచ్చుకోవడంలో తమ దళాలు సమస్యలను ఎదుర్కోవచ్చని వెల్లడించారు. అమెరికా గగనతల ఆపరేషన్లకు ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ అత్యంత కీలకం. ఇరాన్ వైపు వెళ్లే విమానాలకు గాల్లో ఇంధనం నింపడం, ఇంటెలిజెన్స్ సేకరణ, దాడుల సమన్వయం వంటివి ఇక్కడి నుంచే జరుగుతున్నాయి. వీటిల్లో ఈ3 విమానం చాలా కీలక పాత్ర పోషిస్తోంది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 303 మంది సైనికులు గాయపడినట్లు సెంట్రల్ కమాండ్ నిన్న వెల్లడించింది. వీరిలో 273 మంది కోలుకొని తిరిగి విధుల్లోకి చేరినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడులను తీవ్రం చేసిన నేపథ్యంలో అమెరికా 3,500 మంది మెరైన్లను పశ్చిమాసియా వైపు తరలించింది. యూఎస్ఎస్ ట్రిపోలీ నేడు సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చి చేరింది. దీంతో ఇక్కడి నుంచి భూతల యుద్ధం మొదలు కానుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అగ్రరాజ్య దళాలను బూడిద చేస్తం

## ట్రంప్ భూతల దాడులపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్

**టెహ్రాన్, మార్చి 29:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పైకి మాత్రం చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు నటిస్తూనే.. రహస్యంగా భూతల దాడులకు సన్నాహాలు చేస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ ఆరోపించారు. అయితే.. తమ దళాలు వారి రాకకోసం ఎదురు చూస్తున్నాయని.. అమెరికా దళాలు అడుగుపెట్టగానే వారిని బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. అమెరికా.. దాని ప్రాంతీయ మిత్ర దేశాలను దండిస్తామని హెచ్చరించారు. అమెరికాకు చెందిన 3,500 మంది మెరైన్లు నేడు సెంట్రల్ కమాండ్ పరిధిలోకి చేరుకొన్నారు. దీంతో ఇరాన్ కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకొంటుందన్న ప్రచారం జోరందుకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ స్పందించారు.

**పరిహారం.. హర్మూజ్ పై అధికారం ఇవ్వాల్సిందే...**

మరోవైపు ఇరాన్ప్రభుత్వ ప్రతినిధి ఫాతేమ్ మొహజిరానీ కూడా చర్చలపై స్పందంచారు. తాము యుద్ధం మొదలుపెట్టలేదని.. ఇప్పుడు తీవ్రంగా నష్టపోతున్న దేశం కూడా తమదే అని వెల్లడించారు. ఏ చర్చల్లో అయినా నష్టపరిహారం అంశం కచ్చితంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇక హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ, ఆంక్షల తొలగింపు వంటివి కూడా చర్చల్లో కీలక విషయాలని వెల్లడించారు. సుస్థిర శాంతి కోసం అడుగులు వేస్తామన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 1,44,251 కేసులు పరిష్కారం

## సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా వెల్లడి

**హైదరాబాద్:** మార్చి 29(మనం,ప్రత్యేక ప్రతినిధి): సివిల్ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో రికార్డు స్థాయిలో 1,44,251 కేసులు పరిష్కారం కావడం విశేషమని ఆమె వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు తొలుత మార్చి 14న జరగాల్సిన ఈ అదాలత్, మార్చి 28వ తేదీకి రీషెడ్యూల్ జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన లోక్ అదాలత్ కంటే ఈసారి 37.14 శాతం అధికంగా కేసులు పరిష్కారమయ్యాయని, అంటే దాదాపు 39,069 కేసులు అదనంగా పరిష్కారం అయ్యాయని ఆమె వివరించారు.

ఈసారి లోక్ అదాలత్‌లో కేవలం సాధారణ కేసులే కాకుండా, సైబర్ నేరాల బాధితులకు సైతం పెద్దపీట వేశామని చారు సిన్హా తెలిపారు. మొత్తం 4,635 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, బాధితులకు సుమారు రూ. 24.95 కోట్ల నగదును తిరిగి అందజేయగలిగామని ఆమె హర్షం వ్యక్తం చేశారు. వీటితో పాటు 21,388 రాజీ పడదగ్గ ఎఫ్.ఐ.ఆర్ కేసులు, 57,343 ఈ-పెట్టీ కేసులు, 60,094 మోటార్ వాహన చట్టం ఉల్లంఘన కేసులు మరియు 791 విపత్తు నిర్వహణ సంబంధిత కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

**హైదరాబాద్ టాప్:**

జాతీయ లోక్ అదాలత్‌లో హైదరాబాద్ యూనిట్ 15,719 కేసుల పరిష్కారంతో అగ్రస్థానంలో నిలిచిందని సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా తెలిపారు. ఆ తర్వాతి స్థానాల్లో మల్కాజిగిరి, సిద్దిపేట, రామగుండం మరియు నల్గొండ జిల్లాలు నిలిచాయని ఆమె వెల్లడించారు. లోక్ అదాలత్ విజయవంతం కోసం పోలీస్ యంత్రాంగం మార్చి 19 నుంచే కసరత్తు ప్రారంభించి, అర్హత ఉన్న కేసులను గుర్తించి ఇరు పక్షాలకు నోటీసులు అందజేసిందని అదనపు డిజిపి వివరించారు.

న్యాయ వ్యవస్థ, పోలీస్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని, దీనివల్ల కక్షిదారులకు కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా సమయం, ధనం ఆదా అవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ప్రజలు ఇలాంటి వేదికలను ఉపయోగించుకుని వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సిఐడి అడిషనల్ డిజిపి చారుసిన్హా సూచించారు.

# అదరగొట్టిన అమాత్యులు

## సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల కళా ప్రదర్శనలు

**హైదరాబాద్, మార్చి 29:** తెలంగాణ శాసనసభ సభ్యుల కోసం హైదరాబాద్లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన 'స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్' అట్టహాసంగా జరిగింది. నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే నాయకులు.. ఈ వేదికపై తమలోని అసలైన కళాకారులను బయటకు తీశారు. పౌరాణిక పాత్రల నుండి జానపద నృత్యాల వరకు ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో అదరగొట్టారు.ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మంత్రి వాకిటి శ్రీహరి ప్రదర్శన. దుర్యోధనుడి వేషధారణలో ఆయన పలికిన డైలాగులు, గంభీరమైన నటన చూసి సభికులు మంత్రముగ్ధులయ్యారు. మంత్రిలోని పౌరాణిక నటుడిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మరోవైపు.. 'బాహుబలి' సినిమాలో అత్యంత ప్రజాదరణ పొందిన కట్టప్ప పాత్రలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఒదిగిపోయారు. ఆయన వేషధారణ, నడక తీరు కట్టప్పను గుర్తుచేస్తూ అలరించాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తనదైన శైలిలో గిరిజన సాంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఆయన వేసిన అడుగులు అందరినీ ఆకట్టుకున్నాయి. సీనియర్ నటుడు శోభన్ బాబు నటించిన సూపర్ హిట్ పాటకు రామచంద్ర నాయక్ చేసిన డాన్స్ హైలైట్ గా నిలిచింది. తనదైన గ్రేస్తో ఆయన చేసిన స్టెప్పులకు కేకలు వినిపించాయి. వైరా ఎమ్మెల్యే రామ్దాస్ నాయక్ గిరిజన పాటకు హుషారుగా డాన్స్ చేశారు. ఆయన ఉత్సాహాన్ని చూసి తోటి ఎమ్మెల్యేలు కూడా తలలూ ప్రజాప్రతినిధులందరూ ఒకే వేదికపై చేరి తమ కళలను ప్రదర్శించడం చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'మా నాయకులు కేవలం ప్రసంగాల్లోనే కాదు.. నటనలో, నాట్యంలో కూడా దిట్టలే' అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ కల్చరల్ మీట్ తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఒక చిరస్మరణీయమైన వేడుకగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

# రష్యా చమురు ఎగుమతికి అత్యంత కీలక పోర్టును దెబ్బతీసిన ఉక్రెయిన్

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల ఉక్రెయిన్ దాడుల్లో బాగా దెబ్బతింది. సముద్ర మార్గంలో రష్యా చేసే చమురు ఎగుమతుల్లో 45% వరకు ఇక్కడి నుంచే ఉంటుంది. ఇక్కడి నుంచి రోజుకు సుమారు 1.72 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనడంతో.. ధరలు భారీగా పెరిగాయి. ఈ సమయంలో రష్యా లోటు బడ్జెట్ను పూరించుకొనేందుకు అవకాశం దొరికింది. కానీ, తాజా దాడితో రష్యా చమురు ఆదాయానికి భారీగా గండి పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్ రష్యా ఇంధన పరిశ్రమపైనే గురిపెట్టింది. ఈ నెలలో పలు ఇంధన సంస్థలపై 10 భారీ దాడులు చేసింది. గత వారం సర్ట్సోవ్ ప్రాంతంలోని భారీ చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్లు దాడి చేశాయి.



# 15 శాతం జీతం కట్

(మొదటి పేజీ తరువాయి)

చోట చట్టం తేవడం బాధగా ఉంది. తల్లి దండ్రులను పట్టించుకోని ప్రతి కుమారునికి బుద్ధి చెప్పే చట్టం ఇది. ఉద్యోగులే కాదు, ప్రజా ప్రతినిధులు సైతం ఈ చట్టం కిందికి వస్తారు. తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులను సామాజిక బహిష్కరణ చేయాలని పేర్కొన్నారు. వృద్ధుల కోసం కేంద్రం 2007 ఒక చట్టం తెచ్చింది. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు ఇచ్చే అవకాశం లేదు. సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులను చూసుకోలేని వాడు సమాజంలో బతకడానికి వీల్లేదు. సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తూ వృద్ధుల ఆలనాపాలనా పట్టించుకుకోని కుమారులకు ఈ చట్టం సరైన బుద్ధి చెబుతుందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# పునర్విభజన అంటే రేవంత్ భయపడుతున్నడు

**హైదరాబాద్, మార్చి 29:** నియోజకవర్గాల పునర్విభజన అంటే సీఎం రేవంత్ రెడ్డి జంకుతున్నారని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. చట్టసభల్లో 50 శాతం సీట్లు పెంచుతున్నామంటే.. ఉత్తరాది, దక్షిణాది అని వక్రీకరించి మాట్లాడుతున్నారని విమర్శించారు. మహిళల సాధికారత కోసం చట్టసభల్లోనూ 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చేలా మోడీ ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పునర్విభజన చేస్తే ఉత్తరాదిలో లాభం.. దక్షిణాదిలో అన్యాయం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారు. జనాభాకు అనుగుణంగా సీట్ల పెంపు జరిగితే.. ప్రజలకి లాభం చేకూరుతుందని ప్రతిపాదన తెస్తే ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు? రాజకీయ అంశాల ఆధారంగా నియోజకవర్గాల పెంపు ఉండదు.. ప్రజావసరాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డీలిమిటేషన్ ఉంటుంది. గత ప్రభుత్వం ఉమ్మడి ఏపీలో రైల్వేకి రూ.11 వందల కోట్లు ఇస్తే.. బీజేపీ ప్రభుత్వం ఏపీకి 9 వేల కోట్లు, తెలంగాణకు రూ.7 వేల కోట్లు కేటాయించింది. మూడు హైస్పీడ్ రైళ్లను కూడా హైదరాబాదుకు ఇచ్చింది.

డీలిమిటేషన్ వల్ల ఏ రకంగా అన్యాయం జరుగుతుందో రేవంత్ చెప్పాలి. పసలేని వితండ వాదనలు చేయొద్దు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు అదే మాట చెబితే ఎందుకు జడుస్తున్నారో తెలియడం లేదు. రాజకీయ అవసరాల కోసం కేంద్రం నిర్ణయాన్ని తప్పుబడితే తెలంగాణ ప్రజలు క్షమించరు' అని లక్ష్మణ్ అన్నారు.

# ఆస్ట్రేలియా పార్లమెంటు ఎన్నికల బరిలో తెలుగు వ్యక్తి!

(మొదటి పేజీ తరువాయి)

ఓటమి పాలవ్వడం గమనార్హం. తెలుగు మూలాలు కలిగిన దినేశ్.. కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. మెల్ బోర్న్ లోని భారతీయ కమ్యూనిటీలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. తెలుగు పండగలు, ఇతర ముఖ్యమైన రోజుల్లో స్థానికంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

# తప్పుడు ప్రచారాలు నమ్మకండి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నవారికి మోదీ హెచ్చరికలు చేశారు. తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని.. ఇది 140 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన విషయమన్నారు. ఇక్కడ స్వార్థపూరిత రాజకీయాలకు తావు లేదన్నారు. తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం చేసే ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ప్రధానమంత్రి సూచించారు.

# గోవా టు మొయినాబాద్

(మొదటి పేజీ తరువాయి)

బిజినెస్ సెటిల్‌మెంట్‌లు జరిగినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ మేరకు రోహిత్ రెడ్డి పీఏ శ్రవణ్ కుమార్, డ్రైవర్ శరత్ కుమార్‌ల నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. ఈ కేసులో కీలక నిందితులు నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి వ్యాపారాలపై సిట్ ఫోకస్ పెట్టింది.

నమిత్ శర్మ చేస్తున్న వ్యాపారాలు, రోహిత్ రెడ్డితో కలిసి చేస్తున్న దందాలేంటి అన్న సమాచారం సేకరించే పనిలో సిట్ నిమగ్నమైంది. మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై, వీకెండ్ పార్టీలకు హాజరయ్యే హై ప్రొఫైల్ వ్యక్తులను గుర్తించేందుకు సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది.

**15మంది నిందితులు:**

పైలెట్ బ్రదర్స్ కాల్పుల, డ్రగ్స్ కేసు దర్యాప్తులో కోణాలు, కీలక వ్యక్తుల పాత్రలు బయటపడుతున్నాయి. ఈ కేసులో సిట్ విచారణలో ఓ పెద్ద డ్రగ్స్ రాకెట్ నడుస్తున్నట్లు గుర్తించారు. నిందితులు వారాంతాల్లో ప్రముఖుల కోసం ప్రత్యేకంగా డ్రగ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు తేలడంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 15కి చేరింది. ఈ కేసులో ఇప్పటికే డ్రగ్స్ సరఫరాదారులు అభిషేక్ సింగ్, రాకేష్ వర్మతో పాటు మరికొందరి పేర్లు బయటకు వచ్చాయి.

# గుర్తింపులేని పార్టీలకు ఉమ్మడి గుర్తు కేటాయింపు నిబంధనల్లో సవరణ

**ఢిల్లీ, మార్చి 29:** గతంలో పోటీచేసిన ఎన్నికల్లో 1% కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీలకూ తాజా ఎన్నికల్లో కామన్ సింబల్ కేటాయించే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈమేరకు ఎన్నికల గుర్తుల (రిజర్వేషన్లు, కేటాయింపు) ఉత్తర్వులు 1968లోని పేరాగ్రాఫ్ 10(బి)కి సవరణలు చేస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. ఇప్పటివరకూ గుర్తింపులేని రాజకీయ పార్టీల అభ్యర్థులకు కామన్ సింబల్ కేటాయించాలంటే ఆ పార్టీ క్రితం ఎన్నికల్లో కనీసం 1% ఓట్లు సంపాదించాలన్న నిబంధన ఉండేది. ఇప్పుడు దాన్ని సవరించి క్రితంసారి జరిగిన రెండు ఎన్నికల్లో ఏదో ఒకదాంట్లో 1%లోపు పొందితే చాలు, ఉమ్మడి సింబల్ కేటాయించొచ్చని పేర్కొంది. అంటే గత ఎన్నికల్లో 1%ఓట్లు రాకపోయినా దానికంటే ముందు జరిగిన ఎన్నికలో వచ్చి ఉంటే ఉమ్మడి గుర్తు కేటాయించడానికి తాజా సవరణ వీలు కల్పిస్తోంది.




# ఉచిత ల్యాప్ టాప్‌లు.. మహిళలకు రూ.8 వేల కూపన్లు



● డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో ప్రకటన

**చెన్నై, మార్చి 29:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీలు ఎన్నికల హామీలను విడుదల చేసే పనిలో నిమగ్నమయ్యాయి. తాజా డీఎంకే కూడా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు అల్పాహార పథకాన్ని కొనసాగించడంతోపాటు మహిళలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.2వేలకు పెంచుతామని ప్రకటించింది. రైతులకు ఉచితంగా మీటరులేని అధునాతన పంపుసెట్లు, యువతకు ఉచిత ల్యాప్టాప్లు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల వరకు పెంపు, ఐదేళ్లలో 10 లక్షల ఇళ్లు నిర్మాణం, తదితర హామీలను మేనిఫెస్టోలో పేర్కొంది.

- కుటుంబంలో మహిళా పెద్దకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు పెంపు
- వృద్ధాప్య పింఛను రూ.2వేలకు పెంపు
- పాఠశాలల్లో బ్రేక్ఫాస్ట్ పథకం కొనసాగింపు (ప్రస్తుతం ఐదో తరగతి వరకు ఉండగా.. ఎనిమిదో తరగతి వరకు అమలు)
- యువతకు ఉచిత ల్యాప్ టాప్ లు(దాదాపు 35 లక్షల మందికి ప్రయోజనం)
- రైతులకు ఉచితంగా మీటరు లేని మోటార్లు
- వచ్చే ఐదేళ్లలో 10లక్షల కొత్త ఇళ్ల నిర్మాణం
- ఆరోగ్య బీమా పథకం వార్షికాదాయ పరిమితి రూ.5లక్షలకు పెంపు, రూ.10లక్షల ఆరోగ్య బీమా
- ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థినులకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.1500లకు పెంపు
- మహిళలకు రూ.8000 విలువైన కూపన్ (టీవీ వంటి గృహోపకరణాలు కొనుక్కోవడం లేదా మార్చుకోవడానికి) వంటి హామీలను ప్రకటించారు.

# శిరస్సు వంచి సారీ చెబుతున్న..

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలలో తనకూ భాగం ఉందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తీర్చే అవకాశం ఉన్నా పట్టించుకోవటం లేదన్నారు.

గతంలో కోదండరాం, హరగోపాల్ లాంటి మేధావుల మౌనం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. జాగృతి అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో:**

ప్రత్యేక తెలంగాణ వస్తే అసలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదని భావించామని కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్మినెంట్ ఉద్యోగాలనే ఔట్ సోర్సింగ్ గా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు విద్యుత్ ఆర్టిజన్‌లకు భరోసా కల్పించగలిగానని, మరికొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేశానని తెలిపారు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ నాటి పాపంలో తనకు భాగం ఉన్నందుకు సోదరిగా క్షమాపణ చెప్తున్నానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదనే కాంగ్రెస్ ను గెలిపిస్తే వాళ్లు కూడా పట్టించుకోవడం లేదన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఏ విధంగా చేశామో.. అలాగే హాఫ్ మిలియన్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్ వీధుల్లో మార్చ్ చేపట్టాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వం ధర్నా చౌక్ ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్ని రోజులైనా ధర్నా చేసుకొని మీ చావు మీరు చావండన్నట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. త్వరలోనే తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా అవతరించబోతున్నామని కవిత తెలిపారు. ఈ లోపే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.




# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

- ఎథిక్స్ కమిటీకి కౌశిక్ రెడ్డి వ్యవహారం

**హైదరాబాద్, మార్చి 29 (మనం బ్యూరో)** : రాష్ట్ర శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని వారిని సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారన్న కారణంగా బీఆర్ఎస్ఎల్పీ ఉప నేతలు హరీష్ రావు, కేటీఆర్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలందరినీ సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

ఇదిలా ఉండగా, మైనింగ్ శాఖలో జరిగిన అక్రమాలపై చర్చ సమయంలో సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతున్న సమయంలో గన్‌తో కాల్చి పడేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేయితో సైగలు చేశారనే ఆరోపణలు రావడం కలకలం రేపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కడియం పట్ల అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరును కేటీఆర్, హరీష్ సమర్తిస్తారా ? అని ప్రశ్నించారు. ఇవాళ కడియంకు జరిగిందే రేపు కేసీఆర్‌కు జరిగితే మీరు సమర్థిస్తారా ? మావైపు కూడా కండలు తిరిగిన తిరగేసి కొట్టడానికి మక్కన్‌సింగ్ ఠాకూర్ వంటి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆకారం ఉంది కదాని కడియం వంటి పెద్ద మనిషిని అవమానించిన కౌశిక్ వ్యవహార శైలిని సమర్థిస్తే అసెంబ్లీలో కత్తిపోట్లు జరుగుతాయన్నారు. అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనను సుమోటోగా స్వీకరించి ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని సీఎం డిమాండ్ చేశారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని స్పీకర్‌కు ప్రతిపాదించగా ఆమేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించారు.




## ప్రభుత్వానివి డైవర్షన్ పాలిటిక్స్

- కౌశిక్ రెడ్డిపై సర్కార్ కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోంది
- కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న కాంగ్రెస్
- ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తున్నట్లు ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- సభలో తీర్మానం.. మూజువాణి ఓటుతో ఆమోదం
- రేవంత్ సర్కార్ చర్యను తీవ్రంగా ఖండించిన తలసాని
- కడియం ఏ పార్టీకి చెందినవారో చెప్పాలనే అన్నరు?
- మంత్రిపై అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం నాటకం : తలసాని

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : అసెంబ్లీలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న తీరు కక్ష్య పూరితంగా చేస్తున్న కుట్రలు అభ్యంతరకరంగా ఉందని బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. అసెంబ్లీలో ఆదివారంనాడు జరిగిన తీరుపై తీవ్ర దుమారం రేపింది. అయితే, కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదివారం ప్రకటించారు. అంతకుముందు, శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు ఈ మేరకు సభలో ఒక తీర్మానం ప్రవేశపెట్టగా మూజువాణి ఓటుతో అది ఆమోదం పొందింది. కొందరు నేతలు బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, సిగ్గు లేకుండా.. పార్టీ మారి కూడా.. నేను ఇదే పార్టీలో ఉన్నానని చెప్పడంపై కౌశిక్ రెడ్డి స్పందించారు. దీంతో కాంగ్రెస్ నేతలు నేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం అత్యంత సిగ్గుచేటని బీఆర్ఎస్ మండిపడుతోంది.

అయితే, కాంగ్రెస్ నేతలు అనుసరించిన తీరు, రేవంత్ సర్కార్ చర్యను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వ డైవర్షన్ పాలిటిక్స్ అని ఆయన ఆరోపించారు. కడియం శ్రీహరి ఏ పార్టీకి చెందినవారో చెప్పాలని మాత్రమే కౌశిక్ రెడ్డి అడిగారని, రెవెన్యూ మంత్రిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం ఇలా చేస్తోందని తలసాని అన్నారు. కాగా, 2024లో బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌కు దగ్గరైన 10 మంది ఎమ్మెల్యేలలో కడియం శ్రీహరి ఒకరు కావడం గమనార్హం.



## హరీశ్‌రావు తోసివేత

**స్పీకర్ వెల్‌లోకి వెళ్తుండగా నెలకొన్న ఘర్షణ వాతావణం**

**సభలో మాపై మార్షల్స్ ఓవరాక్షన్ చేశారంటున్న బీఆర్ఎస్ సభ్యులు**

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : తెలంగాణ అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావును ఆదివారం మార్షల్స్ తోసివేశారు. స్పీకర్ వెల్‌లోకి వెళ్తున్న హరీష్ రావును తోసి వేయడంతో ఘర్షణ వాతావణం నెలకొంది. మార్షల్స్ తీరుపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. హౌస్ వైపు వెళ్లే ద్వారం వద్ద, అసెంబ్లీ ఇన్నర్ లాబీలో మార్షల్స్ భారీగా మోహరించారు. మరోవైపు శాసన సభలో బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన కొనసాగుతుండగానే ఎలాంటి చర్చ జరగకుండానే పంచాయతీ రాజ్ బిల్లును ఆమోదించారు.

## హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలె

- బినామి కంపెనీల పేరుతో పొంగులేటి అక్రమాలకు పాల్పడ్డరు?
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమాలను సభలో ప్రస్తావించిన బీఆర్ఎస్
- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన
- మంత్రి అక్రమాలపై సభా సంఘాన్ని ఏర్పాటుచేయాలి?
- డిమాండ్ చేసిన కేటీఆర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి** : తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణల నేపథ్యంలో మంత్రివర్గం నుంచి ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నాడు అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అనంతరం ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఈ నిరసనలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ, దీనిపై సభా సంఘం లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆధారాలతోనే హరీశ్ రావు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారని అన్నారు. ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, మంత్రి కుటుంబ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కంపెనీతో మంత్రి భార్య, కుమారుడు, సోదరుడికి ప్రత్యక్ష సంబంధాలున్నాయని, 2020-22 మధ్య పొంగులేటి ఛైర్మన్‌గా ఉన్నారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి పొంగులేటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రికి సైతం ఇందులో ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని కేటీఆర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

## మోసం వెన్నుపోట్లు కడియంకు అలవాటే

- ఆయన ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలె
- పొంగులేటిపై చర్యలు లేకుండా అనని మాటలను ఆపాదిస్తూ దుమారం రేపిండ్రు? : ఎమ్మెల్యే పల్లా



**హైదరాబాద్, మనం ప్రతినిధి** : మోసం, వెన్నుపోట్లు పొడవడం పార్టీలు మారే ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బాగా అలవాటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో పల్లా మాట్లాడుతూ... కడియం ఏ కులానికి చెందినవాడు.? ఏ సామజికవర్గానికి చెందినవాడంటూ గతంలో ఇదే రేవంత్ రెడ్డి మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం కడియంను ముఖ్యమంత్రి పొగడ్తలతో ముంచెత్తుతున్నాడని ఆయన విమర్శించారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలని, బీఆర్ఎస్ సభ్యుడివైతే, సిగ్గు ఉంటే బీఆర్ఎస్ సీట్‌లో వచ్చి కూర్చోవాలని హితవు పలికారు. ఇక, ముఖ్యమంత్రికి రెండు నాలుకలు కాదు? నాలుగు నాలుకలతో ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారని పల్లా తీవ్రంగా విమర్శించారు. కడియం శ్రీహరి గురించి మాట్లాడడం దండగ అని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన తప్పులను గమనించిన సీఎం ఆయన మంత్రి పదవి తొలగింపు తప్పదనే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అనని మాటలను ఆపాదిస్తూ అసెంబ్లీలో అధికార పార్టీ సభ్యులు దుమారం రేపారని పేర్కొన్నారు. డబ్బులు, పదవుల కోసం కడియం ఎంతటి దిగజారుడుతనానికైనా దిగుతారని విమర్శించారు.

## మమ్మల్ని తొక్కుతామన్నడు?

- ముఖ్యమంత్రి వ్యాఖ్యల్ని కూడా ఎథిక్స్ కమిటీకి పంపండి..
- అటెన్షన్ డైవర్షన్‌లో భాగంగా కులాలకు అంటగట్టిండ్రు?
- మీ దుర్మార చర్యలను ప్రజలు గమనిస్తున్నరు? : తలసాని

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : అసెంబ్లీని కాంగ్రెస్ ఇష్టానుసారంగా నడిపిస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌పై హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని.. దానిపై హౌస్ కమిటీ వేయాలని కోరామని తెలిపారు. మేం హౌస్ కమిటీకి డిమాండ్ చేస్తే సీబీ సీఐడీ విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారని తెలిపారు. మా డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం యత్నించిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. సభాసంఘం అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకొచ్చారని పేర్కొన్నారు. స్పీకర్‌ను దళితుడు అని మేం ఎప్పుడూ భావించలేదని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని పేర్కొన్నారు. మా డిమాండ్‌పై నిరసన తెలియజేస్తుంటే, అటెన్షన్ డైవర్షన్‌లో భాగంగా కులాలకు అంటగట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేశాడని తెలిపారు. నా వెంట్రుక పీకలేరని కడియం శ్రీహరి వ్యవహారశైలి ఉందన్నారు. సభ ఆర్డర్ లేనప్పుడు అనేక అంశాలు జరుగుతుంటాయని చెప్పారు. భట్టి విక్రమార్క అంటే బీఆర్ఎస్‌కు గౌరవమని తెలిపారు. ఆనాడు భట్టి విక్రమార్క పాదయాత్ర చేశాడని ముఖ్యమంత్రి గుర్తుచేశాడని.. భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. సభలో అధికార పార్టీ సభ్యుల చేత బీఆర్ఎస్ ను తిట్టించారని తెలిపారు. వెనుకబడి తరగతుల పద్దుల విషయంలో చర్చపై వాస్తవాలు బయటకొస్తాయనే డైవర్షన్ పాలిటిక్స్ ఏస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి వేల కోట్లు పెడుతున్నామని చెప్పి, వంద రూపాయల ఖర్చు చేయలేదని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని పండబెట్టి తొక్కుతామని అన్నాడని.. ఆ వ్యాఖ్యలను కూడా ఎథిక్స్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. ఒక మంత్రి ఏమో హౌస్ కమిటీకి అంగీకారం చెబుతాడు.. ముఖ్యమంత్రి ఏమో సీబీ సీఐడీ విచారణ చేయిస్తానని అంటున్నాడు తెలిపారు. మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్యనే సఖ్యత లేదని అన్నారు. సభలో మాట్లాడటానికి బీఆర్ఎస్ సభ్యులకు మైక్ ఇవ్వడం లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ప్రశ్నిస్తున్నామనే భయంతోనే బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారని తెలిపారు. కాంగ్రెస్ దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్నారని.. మరి ఆయనకు తెలంగాణలో అరాచకాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు క్యూలైన్లు కడుతున్నదని కనబడటం లేదా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తలసాని విమర్శించారు. ఇచ్చిన హామీలు కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలే కాంగ్రెస్కు కర్రుకాల్చి వాతపెడతారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ సర్కార్‌కు తలసాని సూచించారు.



## కడియం శ్రీహరి అంటే ఖల్‌నాయక్

**రేవంత్, కడియం ఇద్దరు దొంగలే : తాటికొండ రాజయ్య ఫైర్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. కడియం శ్రీహరి అసెంబ్లీలో భూకబ్జాలపై మాట్లాడటం సిగ్గుచేటు అని విమర్శించారు. అనుచరుడు గోరంత బలరాం ఆధ్వర్యంలో కడియం అంతులేని అవినీతి చేశారని ఆరోపించారు. బినామీ పేర్లతో సింగపూర్, మలేసియాలో కడియం శ్రీహరి అక్రమ ఆస్తులు సంపాదించారని తాటికొండ రాజయ్య మండిపడ్డారు. కడియం శ్రీహరి అంటే ఖల్ నాయక్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరి ఇద్దరు దొంగలు అని అన్నారు. వాళ్లిద్దరూ కూడా ఒకరిని మరొకరు సమర్థించుకుంటున్నారని మండిపడ్డారు.

## ప్రశ్నిస్తే మాపై కేసులు పెడతారా? : కృష్ణారావు

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌పై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మైకులు ఇవ్వడంలేదని తెలిపారు. కాంగ్రెస్ స్కామ్‌ల గురించి మాట్లాడితే సీబీఐ అంటున్నారని తెలిపారు. అబద్ధపు హామీలిచ్చిన రేవంత్ రెడ్డిపై కేసులు పెట్టాలని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పాలించిన నాటి నుంచి జరిగిన అవినీతిని బయటపెట్టాలని మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలోని 119 మంది ఎమ్మెల్యేలపై విచారణ జరిపించాలని అన్నారు. పేద ప్రజలకు రూ.4వేల పింఛన్ డబుల్ బెడ్రూం, కల్యాణలక్ష్మీ అడిగామని తెలిపారు. హామీలు అమలు చేయనుందుకు సీబీసీఐడీ కేసులు పెట్టాలని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాపై కేసులు పెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చిమాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై హౌస్ కమిటీ వేయాలని మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చింది కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ కేసీఆర్ రావాల్సిందేనని స్పష్టం చేశారు.

## ప్రతిపక్షం గొంతు నొక్కుతుండ్రు? : సునీతా లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : తెలంగాణలో రేవంత్ సర్కార్ అసెంబ్లీ నడిచిన తీరు అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సునీతా లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హౌస్ కమిటీ వేయమంటే ఎందుకు భయమని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మైనింగ్‌పై మాట్లాడితే మైక్ ఇవ్వమని అంటున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై మాట్లాడితే సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ ఇష్యూను డైవర్షన్ చేసేలా సభను నడిపారన్నారు. రెండున్నరేళ్లుగా ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలు వేయలేదని తెలిపారు. ప్రతిపక్షం గొంతు నొక్కాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని పేర్కొన్నారు.

## దమ్ముంటే హౌస్ కమిటీ వేయండి?

**ఎన్ని విచారణలు వేసినా ప్రజల పక్షాన పోరాడుతాం**

**అవినీతి, కుంభకోణాలు బయటపెడితే బీఆర్ఎస్‌ను బద్నాం చెస్తుండ్రు?**

**ప్రతిపక్షం ప్రశ్నిస్తేనే అసెంబ్లీ నుంచి పారిపోతుండ్రు?**

**ప్రభుత్వం ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ నాటకాలు : సబితా ఇంద్రారెడ్డి**



**హైదరాబాద్, మనం ప్రతినిధి** : తెలంగాణ వచ్చాక తమ రాష్ట్ర అసెంబ్లీలో సైతం ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తమకు మైక్ ఇవ్వడంలేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైక్ ఇచ్చినా కూడా ప్రభుత్వ తప్పిదాలను లేవనెత్తగానే కట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. జీరో అవర్‌ను గంటలు గంటలుగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా సూటిగా సమాధానం ఇవ్వడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. చాలా కుంభకోణాలు బయటపెడితే సమాధానం ఉండదని అన్నారు. అక్రమ మైనింగ్‌ను హరీశ్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మైనింగ్ను సీజ్ చేయకుండా నోటీసులు ఇవ్వమేంటని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు కాంగ్రెస్‌కు భయమెందుకు అని అడిగారు. ప్రభుత్వ అవినీతిని సభలో ప్రస్తావిస్తున్నామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రతిపక్షంగా ప్రజల సమస్యలు ఎత్తి చూపిస్తామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కులాన్ని తీసుకొచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సీతక్కను ఏమని అవమానించామని ప్రశ్నించారు. రైతుబంధు, యూరియా, నీళ్లు వస్తలేవని అడగొద్దా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలే కదా? మాట్లాడేదని అని అడిగారు. మూసీ పేరుతో పేదల ఇండ్లను కూల్చొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములను లాక్కోవద్దంటున్నామని అన్నారు. సీఎం వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఉన్నతమైన వ్యక్తిగానే స్పీకర్‌ను గౌరవించామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్ని విచారణలు వేసినా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని వేల ఎకరాలు తీసుకున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమాధానం చెప్పకుండా వెళ్లిపోతున్నారని మండిపడ్డారు.

# జీవితంలోని వ్యంగ్యమే పతంజలి రచనలు

సమాజం పట్ల, సాహిత్యం పట్ల, జీవితం పట్ల నిబద్ధత కలిగిన రచయిత పతంజలి. ఆయుర్వేద వైద్యుడిగా, కథా రచయితగా, నవలా రచయితగా, జర్నలిస్టుగా బహుముఖ ప్రతిభాశాలి ఆయన. పతనమవుతున్న మానవ విలువలను, క్షీణిస్తున్న సమాజాన్ని తన సాహిత్యమనే ఔషధం ద్వారా నయం చేయాలని భావించిన సారస్వత వైద్యుడు.

పతంజలి పూర్తి పేరు కాకర్లపూడి నరసింహయోగ పతంజలి. విజయనగరం జిల్లా అలమండలో 29-03-1952లో జన్మించిన పతంజలికి ఆధునిక సమాజం పట్ల అంత అవగాహన కలగడానికి బీజం తన ఇంట్లోనే పడింది. పతంజలి తండ్రి శ్రీ కె.వి.వి గోపాలరాజు ఆధునిక భావాలు కలిగిన వాడు. అంతేగాక ఖగోళం, జ్యోతిషం, పాశ్చాత్య సాహిత్యం పట్ల అభిరుచి కలిగియుండడమే గాకుండా, వీటికి సంబంధించిన అనేక పుస్తకాలను సేకరించి, ఇంట్లో ఒక పెద్ద గ్రంథాలయంను ఏర్పాటు చేసుకొన్నారు. చివర్లో తన పిల్లలకి పుస్తకాలను కూడా వాటాలేసి పంచిన అభ్యుదయ దార్శనికుడు పతంజలి తండ్రి. అతను ఆంగ్లం, సంస్కృతం, తెలుగు భాషలలో నిష్ణాతుడు. తొలినాళ్ళలో డిటెక్టివ్ నవలలపై ఆసక్తి కలిగిన పతంజలి దృష్టిని మరలించి, అభ్యుదయం వైపు నడిపించిన ఆధునిక భావ జాలకుడు పతంజలి తండ్రి.

క్షత్రియ కుటుంబంలో పుట్టడం వలన, జమీందారు, రాజు కుటుంబాలలో ఉండే మర్యాదలు, సంప్రదాయాలు వాళ్ళని ఆశ్రయించి జీవించే సామాన్యుల జీవితాలు ఇవన్నీ దగ్గరుండి చూసినవాడు కావడం వలన కథా రచనలో పతంజలి ఆలోచనా వైవిధ్యానికి దారి తీసింది. తను పుట్టిన ఊరు, అలమండ చుట్టూ వున్న కొండలు, అందమైన ప్రకృతి, ఇంట్లో అడవి జంతువుల పెంపకం, తనని ప్రకృతి ఆరాధకునిగా మార్చాయి. పేదలు వైద్యం కోసం ఇంటికి రావడం, తన బంధు వర్గపు మాటలు, బుచ్చి మావయ్య చెప్పిన కథలు పతంజలి కథల పుట్టుకకు ప్రాణం పోశాయి.

ఉత్తరాంధ్ర సాహిత్య నేపథ్యం పతంజలిని ఎంతగానో ప్రభావితం చేసింది. 11 సంవత్సరాల వయస్సులో 1963లో తొలి రచనగా 'అస్థి పంజరం' రచించాడు. 1960-70 ల మధ్య అరసం, విరసం, శ్రీశ్రీ , దిగంబర సాహిత్యం పతంజలి అభ్యుదయ దృష్టికి మరింత బలాన్ని చేకూర్చాయి. మహాకవి గురజాడ అప్పారావు అంటే పతంజలికి ఆరాధనా భావం. కళింగాంధ్ర కథా దిగ్గజాలైన చాసో, శ్రీశ్రీ, రావిశాస్త్రిలను పతంజలికి గురువులుగా భావించవచ్చు.

చాసో కథలలో వున్న సంక్షిప్తత, వాస్తవికత, మార్క్సిస్టు భావజాలాన్ని పుణికిపుచ్చుకొన్నవాడు పతంజలి. శ్రీశ్రీ భావావేశాన్ని, అభ్యుదయ దృక్పథాన్ని నెత్తికెక్కించుకున్న రచయిత పతంజలి. అంతేగాక ఉత్తరాంధ్ర మాండలికం, వృత్తి పరమైన అనుభావాలు ప్రకటించడంలోను, నవలా రచనా విధానంలోను రావిశాస్త్రి పతంజలికి మార్గదర్శకంగా నిలిచారనడంలో యిసుమంతైనా సందేహం లేదు. అయినా పతంజలి తనదైన సొంతబాణీలోనే రచనలు చేశాడు.

పతంజలి సాహిత్యాన్ని కథలు, నవలలు, వ్యాసాలుగా విభజించవచ్చు. కథలను పరిశీలిస్తే మళ్ళీ అభ్యుదయ కథలు, వేట కథలు, జ్ఞాపక కథలుగా వర్గీకరించవచ్చు. అలాగే పతంజలి ఖాకీవనం, పెంపుడు జంతువులు వంటి 10 నవలలను రాశారు. ఇక వ్యాసాల విషయానికొస్తే సంపాదకీయ వ్యాసాలు, సమీక్షా వ్యాసాలు, ప్రేరణాత్మక వ్యాసాలు (గెలుపు సరే బతకడం ఎలా?), సమకాలీన సామాజిక విశ్లేషణ వ్యాసాలు (పతంజలి భాష్యం)గా విభజించి పరిశీలించవచ్చు. పతంజలి రచించిన తొలి కథ 'చివరి రాత్రి' 1968లో వెలువడింది. ఆ తరువాత రాసిన కొన్ని కథలన్నీ కలిపి 'దిక్కుమాలిన కాలేజీ' పేరుతో ఒక కథా సంకలనాన్ని 1976లో ప్రచురించారు.

అభ్యుదయ దృక్పథంతో పతంజలి రాసిన కథలలో గాండీరం, మోటు మనిషి, దిక్కుమాలిన కాలేజీ, స్థంభాలు, చూపున్న పాట, రాక్షస వృద్ధుని అసహజ మరణం, పోయేకాలం వంటి కథలను ప్రసిద్ధమైనవిగా పేర్కొనవచ్చు. ఊరిలో ఉండే రాజకీయాలు, మూగజీవాలను బలిస్తే వ్యాధులు నయం అవుతా యన్న గ్రామస్థుల మూఢ నమ్మకాలు కథాంశంగా తీసుకొని రచించిన కథ 'గాండేరం'. ఉత్తరాంధ్ర మాండలికంతో రాసిన ఈ కథలో రేపటి దేశ భవిష్యత్తుకి ప్రతీకగా నిలిచే ఒక పదేళ్ళ కుర్రాడి ఆలోచనా విధానం ఎలా వుందో చూపించారు. సంస్కారం అంటే ఏమిటో, అసలైన నాగరికత అంటే ఏమిటో, మానవత్వం అంటే ఏమిటో తెలిపిన కథ 'మోటు మనిషి'. 1973లో ఆంధ్ర ప్రభ వారపత్రికలో అచ్చయిన ఈకథ ఉత్తమ పురుష కథనంలో సాగుతూ, సంస్కారం అంటే వేష,భాషల్లో ఉండదని, అది చేతల్లో ఉంటుందని తెలియ జేస్తుంది. సందర్భాన్ని బట్టి వ్యక్తుల స్వభావాలు, వ్యక్తిత్వాలు తెలిపిన కథ ఇది.

అన్యాయాన్ని ఎదిరించే యువశక్తిని కొంతమంది స్వార్థపరులు ఎలా నిర్వీర్యం చేస్తున్నారో తెలిపిన మరో కథ 'దిక్కుమాలిన కాలేజీ'. విద్యార్థుల అడ్మిషన్ ఫీజు డబ్బులతో, స్కాలర్ షిప్‌లతో తమ ఆడంబరాలని తీర్చుకొనే కొంతమంది అవినీతి అధికారుల గురించి, విద్యాసంస్థల్లో జరిగే అవినీతి గురించి ఈ కథలో తెలిపారు. విద్యాసంస్థల్లో కుల,మత,రాజకీయాల ప్రాబల్యంతో లంచం ఇచ్చి ఉద్యోగాలు పొందే లెక్చరర్లు ఉంటే యువత భవిష్యత్తు అంధకారమే అన్న హెచ్చరికను పాఠకునికి ఈ కథ కలిగిస్తుంది.

విద్యతో వ్యాపారం చేసే ఇంటర్మీడియట్ విద్యాసంస్థల డొల్లతనాన్ని తెలిపిన కథ 'స్థంభాలు'. 'ఈనాడు' దిన పత్రికలో ప్రచురింపబడిన ఈ కథ వ్యంగ్య శైలిలో సాగుతూ కాలేజీలో చదువు చెప్పకుండా, ట్యూషన్ల పేరుతో విద్యార్థులను దోచుకొంటున్న అధ్యాపకుల తీరును తేటతెల్లం చేశారు. విద్యా సంస్థలు వస్త్ర దుకాణాల్లా మారాయన్న భావన ఈ కథ కలిగిస్తుంది.

కమ్యూనిస్టు భావజాలంతో పతంజలి రాసిన గొప్ప కథ 'చూపున్న పాట'. విప్లవాన్ని నువ్వు ఎంత అణగద్రొక్కాలని ప్రయత్నిస్తే, అది ఇంతింతై, వటుడింతై అన్నట్టుగా మరింతగా విజృంభించి నిన్ను భయపెడుతుందని చెప్పడానికి ఈ కథ ఒక మచ్చుతునక. వ్యక్తి ఆలోచనలకు కూడా స్వేచ్ఛలేని సమాజాన్ని చిత్రించిన కథ 'రాక్షస వృద్ధుని అసహజ మరణం'. మనిషికి మనిషి భయపడతాడు. కానీ కాలం భయపడదు. మనిషి ఆలోచించడమే నేరంగా భావిస్తూ, ఆ ఆలోచనలకు కేంద్రమైన శిరస్సును ఖండించడమే శిక్షగా వేసే జమిందారీ వ్యవస్థలోని వారసత్వంగా సాగుతున్న అధికార దౌర్జన్యాన్ని కళ్ళముందు చూపిస్తుందీ కథ. మనుషుల్లో ఉండే అవకాశవాద తనాన్ని అచ్చు గుద్దినట్టు తెలిపిన కథ 'పోయేకాలం'. వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యం అంటూ, ఆ స్వేచ్ఛను హరించే పెద్ద మనుషుల డొల్లతనాన్ని ఈ కథలో రచయిత చూపించారు.

తన బుచ్చి మావయ్య అప్పుడప్పుడు తనకు ఆశువుగా చెప్పిన కథలన్నింటిని వేట కథలుగా సాహిత్యరూపాన్ని కల్పించారు పతంజలి. కొండల్లో కనీస సదుపాయాలు లేక దీనావస్థలో జీవిస్తూ, కష్టానికి తగిన ఫలితం లేక అడుగడుగున మోసానికి గురవుతున్న గిరిజనుల జీవనగాథల్ని కథలుగా మలిచారు పతంజలి. గిరిజనులు బొగ్గు, కర్రలు, చింతపండు మొదలైన అటవీ ఉత్పత్తులను కొండమీద నుండి కిందకి తెచ్చేటప్పుడు వాళ్ళు పడే కష్టాలు ఏ విధంగా ఉంటాయో ఈ వేట కథలలో దర్శనమిస్తాయి. మనుషుల్ని, వన్య ప్రాణుల్ని సమానంగా చూసే గిరిజనుల సమదృష్టి ఈ వేట కథలలో గోచరిస్తుంది. ఊరందరు ఒక్కటిగా కలిసి పోరాడితేనే ఎటువంటి సమస్యనైనా అధిగమించవచ్చుననే సందేశాన్ని కూడా కొన్ని కథలలో అందించారు. ఊరు దగా చేసింది, ఆశన్న దొర, వీరఘట్టం, తోటి వేటగాళ్ళు వంటి కథలను పతంజలి వేట కథలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. పతంజలి ఇంగ్లీషులో చదివిన కథలను, ఆ తరువాత గుర్తు చేసుకొని కథాంశం మాత్రమే తీసుకొని, తనదైన శైలిలో రాశారు. వీటిని పతంజలి జ్ఞాపక కథలుగా పేర్కొన వచ్చు.

పతంజలి నవలలో అతనికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన నవల 'ఖాకీవనం'. 1980లో చతుర మాసపత్రికలో ప్రచురింపబడిన ఈ నవలలో పోలీసులు, అందులోను క్రింది స్థాయి ఉద్యోగుల జీవితాల్లో ఉండే వెట్టి చాకిరీ, కష్టాలూ, ఇబ్బందులూ, ఉన్నతోద్యోగులు, వారి కుటుంబాలూ కూడా క్రింది స్థాయి ఉద్యోగులను చులకనగా చూడడం, అణిచివేత ధోరణి ఈ నవలలో కన్పిస్తుంది. పోలీసుల ఆత్మ గౌరవం ప్రధానంగా సాగిన ఈ నవల పోలీసు వ్యవస్థలోని అమానుషత్వాన్ని ఎత్తి చూపిస్తుంది. పై అధికారుల వద్ద బానిసగా బతకవలసిన దయనీయ స్థితి పోలీసు వ్యవస్థలో ఉందన్న సత్యాన్ని ప్రపంచానికి నిర్భయంగా ఈ నవల ద్వారా తెలియజేశారు పతంజలి.

పత్రికా వ్యవస్థ పాడయిన తీరును కూలంకషంగా విశదీకరించిన నవల 'పెంపుడు జంతువులు'. పతంజలి వృత్తిరీత్యా జర్నలిస్టు కావడం వలన విలేఖరి స్థాయి నుంచి పత్రికా సంపాదకుడి వరకు అన్ని స్థాయిల్లోనూ పాత్రికేయులు అనుభవించే పరిస్థితులను పాఠకుల కళ్ళ ముందుంచారు ఈ నవలలో. 1982లో 'వారం వారం' అన్న వార పత్రికలో సీరియలుగా ప్రచురితమైన ఈ నవలను పతంజలి తన అన్నదమ్ములు, చెల్లెలికి అంకితమిచ్చారు.

వ్యంగ్య రచనలకు పతంజలి పెట్టింది పేరు. రాజ్యంపై, సమాజంపై తన కోపాన్ని వ్యక్తం చేయడానికి ఆయన వ్యంగ్యాన్ని ఓ ఆయుధంగా వాడుకున్నాడు. వ్యంగ్యం గురించి పతంజలి మాటల్లో చెడును, దుర్మార్గాన్ని వెక్కిరిస్తే నాకు సంతోషం. అన్యాయాన్ని బజారుకీడిస్తే ఆనందం. నన్ను నేను సంతోష పరుచుకోవడానికే రచనలు చేశాను. నావ్యంగ్యంలో బాధ, క్రోధం ఉన్నాయి. అందులో స్వచ్ఛమైన ప్రతిస్పందన కన్పిస్తుంది. నాకు తెలిసింది నేను రాశాను. పేరు కోసం రాయలేదు. జీవితంలో ఉన్న వ్యంగ్యమే రచనలలో చూపించాను.

తనకు బాగా తెలిసిన జీవితానికి నవలా రూపం కల్పిస్తే బాగుంటుందనే ఆలోచనతో రాసిన నవలలో వ్యంగ్యం స్పష్టంగా కనబడుతుంది. రాచ కుటుంబాలలో ఉండే మర్యాదలు, తిండితిప్పలు, వారి వెటకారాలు, వారి చుట్టూ ఉండే ఇతర జనమూ, అన్నింటినీ చిత్రీకరిస్తూ పతంజలి రాసిన నవల 'రాజుగోరు'. 1983 ఏప్రిల్‌లో చతుర మాసపత్రికలో ప్రచురితమైన ఈ నవలలో ఒకనాటి వైభవాలు పోయినా, ఆ వాసనలు పోని రాచ కుటుంబాలను వ్యంగ్యంగా చూపించారు.

అలాగే హాస్యం, వ్యంగ్యం కలగలిపి ఉన్న మరో నవల 'వీరబొబ్బిలి'. 1984లో ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి సంచికలో ప్రచురితమైన ఈ నవలలో మనుషుల్లో ఉండే అభిజాత్యాన్ని, తాను అందరికంటే అధికమనే తత్వాన్ని స్పష్టంగా తెలియజేశారు రచయిత. గోపాత్రుడు, పిలక తిరుగుడు పువ్వు, అప్పన్నసర్దార్, ఒక దెయ్యం అత్మకథ, రాజుల లోగిళ్ళు వంటి నవలల్లో కూడా పతంజలి తన పదునైన వాక్యాలతో, అద్భుతమైన కథాకథనంతో పాఠకుల హృదయాన్ని దోచుకొనేటట్లు తన సాహిత్య శైలిని చూపించారు.

1986 నుండి 2008 వరకు దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సంపాదకునిగా ఉదయం, ఆంధ్రజ్యోతి, మహానగర, ఆంధ్రప్రభ, సాక్షి వంటి పత్రికలలో వివిధ సంపాదకీయాలు రాశారు. వీరి సంపాదకీయాలు రాష్ట్ర, దేశ, ప్రపంచ రాజకీయాల మీద చురకత్తుల లాంటివి. రాజ్యాంగంలో సమానత్వపు హక్కు ఉన్నప్పటికీ, అది పేరుకే గానీ, ఆచరణలో లేదని చాలా చోట్ల వాపోయారు. పతనమవుతున్న మానవ విలువల గురించి తెలియజేయడమే గాకుండా, పార్టీలకతీతంగా అనేకమంది రాజకీయ నాయకులను, వారి పాలనను తనదైన వ్యంగ్య ధోరణిలో దుయ్యబట్టారు. తప్పుడు కుట్ర కేసుల గురించి, బాబ్రీ మసీదు కూల్చివేత గురించి, బోన్సాయి మొక్కల్లా పెరుగుతున్న పిల్లల గురించి, మద్యం అమ్మకాల గురించి ఇలా సమకాలీన సామాజిక అంశాలపై తన కలంతో కొరడా ఝుళిపించారు.



పతంజలి సాహిత్యంలో వ్యక్తి తన అస్తిత్వం కోసం జరుగుతున్న ఆరాటం, పోరాటం కనబడుతుంది. సమాజం ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరాలనే ఆకాంక్ష ప్రస్ఫుటమవుతుంది. దోపిడీ చేస్తున్నవారు, ఆ దోపిడీకి గురవుతున్న వారు, పీడిస్తున్నవారు, ఆ పీడనకు గురవుతున్నవారు పతంజలి సాహిత్యంలో దర్శనమిస్తారు. సమస్య వచ్చినపుడు పిరికితనంలా పారిపోకుండా, ధైర్యంగా నిలబడి పోరాడాలన్న ప్రేరణను పతంజలి కథలు కలిగిస్తాయి. కమ్యూనిజం అంటే ఇష్టమే కానీ, తాను కమ్యూనిస్టుని కాదని చాలా సందర్భాల్లో పతంజలి ప్రకటించుకొన్నాడు.

దీనికి కారణం సాహిత్యానికి ఎటువంటి చట్రాలు ఉండకూడదని కోరుకునే వ్యక్తి ఆయన. అన్యాయాన్ని ఎత్తి చూపడమే తన సాహిత్య లక్ష్యంగా కథలు రాసిన గొప్ప కథకుడు పతంజలి. రచయిత ఎప్పుడూ సమాజం నుండి పారిపోకూడదు. సమాజంలో తానుండి, ఆ సమాజాన్ని దగ్గరగా పరిశీలించి రచన చేయాలి. ఆ పని గురజాడ, చాసోల తరువాత పతంజలి చేశాడు. కృష్ణవంశీ 'సింధూరం' సినిమాకు మాటల రచయితగా బంగారు నంది అవార్డు అందుకున్నారు పతంజలి.

అలాగే అతని సాహిత్య కృషికి గుర్తింపుగా రావిశాస్త్రి పురస్కారం, చాసో పురస్కారం లభించాయి. అనునిత్యం సమాజం కోసం పరితపించే పతంజలి తేదీ 11-03-2009న విశాఖపట్నంలో తుది శ్వాస విడిచారు. పల్లకీని మోసేవాడు రాసే రచనకు, పల్లకీలో కూర్చున్నవాడు రాసే రచనకు తేడా తెలియాలి అంటే పతంజలి సాహిత్యాన్ని చదవాల్సిందే.

**- డా. బొద్దూరు విజయేశ్వర రావు**
9490544551

## త్రీ-లైన్ పొయెట్రి



ఎంత తోడినా
తరగని నీళ్లు -
అమ్మ ఓ కన్నీటి బావి



ఎప్పుడూ వానే
అమ్మానాన్నల కళ్లల్లో
పిల్లల్ని తడవనిచ్చేవాళ్లుకాదు



తుపాకీ శబ్దం
చిలుకలు వాలిన చెట్టు
తిరిగి మోడైంది



తెరిచి చూడాలేగానీ
అనంతమైన ఆకాశం
హైకూ కిటికీ
మూడు ముక్కలేనా
నాలుగు దిక్కులు
హైకూ

**- చిత్తలూరి**
9133832246

# జ్ఞానపీఠ సినీ కవిత్రయం



వృత్తి... ప్రవృత్తులు, సామాజిక నేపథ్యం, ఆలోచనలో ప్రకృతి మనిషి కేంద్రంగా సాహిత్యం పచ్చగా ఎదిగింది. అత్యుత్తమ రచనలకు జ్ఞానపీఠ పురస్కారం అందించడం 1964 నుంచి మొదలైంది. దేశంలోని అన్ని భాషలలోని రచనలకు ఈ పురస్కారం అందజేస్తారు. సాహిత్యంలోనూ సినీ గీత రచనలోను కృషిచేసి జ్ఞానపీఠం అందుకొన్న కవులు డా.సినారె, గుల్జార్, వైరముత్తులు.



ఒక మాటల మాంత్రికుడు, ఓ పాటల సంగీత ఝరి,కవిత్వమే ప్రపంచమైన జీవి, వ్యాసోపన్యాసాల దిట్ట ఆచార్య డా.సి.నారాయణ రెడ్డి తెలుగు, ఉర్దూ, హిందీ ఇంగ్లీషులోనూ రచనలు చేశారు. ఆయన కరీంనగర్ జిల్లా లోని హన్మాజిపేటలో జూలై 29, 1931న పుట్టినారు. తన 86యేండ్ల తన జీవితకాలంలో దాదాపు ఎనభైయారుకు(86) పైగా సాహిత్య రచనలు ముద్రించారు. 1960 నుండి దాదాపు 25 యేండ్లు భావకవిత్వం, శృంగార యుగళ గీతాలు, శబ్దప్రధాన సినీపాటలు వెల్లువలా వచ్చిన కాలంలో సినారె తెలుగు సినిమాకు కావ్యభాషను పరిచయం చేశాడు. ఆయన కవిత్వం పండితులను మెప్పిస్తే అదే కవిత్వాన్ని సినీపాటలో చూపి పల్లీయులకూ కావ్యాంత రంగాన్ని పరిచయం చేసిన గొప్ప కవి. ఆయన జలపాతం, నాగార్జున సాగరం, కర్పూర వసంత రాయలు, నది నా నడక, ఋతుచక్రం, అజంతా సుందరి, రామప్ప,మంటలు మానవుడు, విశ్వంభర వంటి కావ్యాలు రాశారు. తెలుగు సాహిత్యానికి చేసిన ఎనలేని సేవలకుగాను 1988లో విశ్వంభర కావ్యానికి ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ అవార్డ్ అందుకున్నారు. జూన్ 12, 1962లో 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని' సినీ పాటతో సినీ వెలుగు జిలుగులకు సాహిత్య పరిమళం అద్ది సాహిత్య సినీ ప్రియుల మనసులను ఉర్రూతలూగించారు. ఆ కలమే 'పగలే వెన్నెల జగమే ఊయల కదిలే ఊహలకే కన్నులుంటే'అనే భావోద్వేగ గీతంతో పాటు దాదాపు 3500పాటలు రాసి తెలుగు నేలలో చెరగని స్థానం సంపాదించుకుంది. 1988లో జ్ఞానపీఠ్ అవార్డుతోపాటు సాహిత్య అకాడమీ అవార్డు, కళాప్రపూర్ణ బిరుదు, పద్మశ్రీ,పద్మ భూషణ్ వంటి పురస్కారాలు అందుకున్న సినారె ఒక గొప్ప మానవీయ సాహిత్య శిఖరం, ఉత్తుంగ అక్షర తరంగం. 2017న అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో కన్నుమూశాడు.

ఇక గుల్జార్ సాబ్... కవిత్వంలోనూ, వచనంలోనూ అందెవేసిన చెయ్యి. ఆయన బహు భాషా సాహితీ సముద్రుడు. గుల్జార్ సంభాషణలను విశ్లేషిస్తే అవి చాలా లోతుగా కనిపిస్తాయి. 'బాబూ మోషాయ్, జీవితం ఉన్నతమైంది కావాలి, దీర్ఘ కావ్యరూపం కాదు, బతికి ఉన్నంత దాకా చావలేదు, చచ్చినాక నేనే లేను, మరణం ఒక క్షణ



కాలం మాత్రమే' ఇది గుల్జార్ లోని గొప్ప పరిణత భావోద్వేగాల తాత్వికత సాహిత్య కెరటాలకు నిలువుటద్దం.

ఇక ఆయన కవితాశైలి ఎదురుగా ఒక మనిషితో మాట్లాడుతున్న తీరుగా ఉంటది. అతి సున్నితమైన భావాలను ప్రతీకలతో, ఇన్నైనియాలతో విప్పారిందిగా ఉంటది. అతి తక్కువ పదాలు చాలా సింపుల్ శబ్దాల ఎంపికతో అందమైన కవిత్వం రాయడం గుల్జార్ కే సొంతం అనిపిస్తుంది. ఆయన కవిత్వం మళ్లీ మళ్లీ చదివించేదిగా ఉండి అనేక పార్శ్వాలు,ఎన్నో కోణాల్లో వ్యక్తీకరించబడి పాఠకున్ని కట్టిపడేస్తుంది. ఆగష్టు18,1936న ప్రస్తుత పాకిస్తాన్ భూభాగంలోని దినాలో ఓ సిక్కు కుటుంబంలో జన్మించిన గుల్జార్ కవిగా, ఒక సినీ పాటల రచయితగా పేరు పొందిన ఆయన అసలు పేరు సంపూర్ణ సింగ్ కల్ర. దేశ విభజన తరువాత కుటుంబమంతా ఢిల్లీకి వలస వచ్చి 1943 నుంచి ముంబయిలో స్థిరపడ్డ గుల్జార్‌కు ప్రగతిశీల రచయితల సంఘంతో ఏర్పడిన పరిచయం ఆయనకు యాదృచ్ఛికమే అయినా అది లైఫ్‌లో గొప్ప విలువైన టర్నింగ్ పాయింట్. అది ఆయన సాహిత్య వ్యాసంగాన్ని లోతుగా, సాంద్రంగా విస్తృతంగా దిద్దింది. స్నేహానికీ సన్నిహితత్వానికి పెద్ద పీట వేసే ఆయన 'మొఘలే ఆజమ్' కథానాయిక, అలనాటి ప్రసిద్ధ నటి మీనా కుమారి రాసిన షాయరీలను,గీతాలను ఆమె మరణానంతరం గుల్జార్ వాటిని అచ్చు వేయించాడు. ప్రముఖ మరాఠీ రచయిత అమృతా ప్రీతమ్ రచనలకు కూడా గుల్జార్ అనువాదం చేశాడు. 'త్రివేణి' మూడు పంక్తుల కవిత్వాన్ని ఆవిష్కరించిన గుల్జార్ ఎన్నో అక్షర అద్భుతాలు సృజించారు.

2024లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ అవార్డును అందుకున్న గుల్జార్ 2013లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును, 2004లో పద్మభూషణ్ పురస్కారం, ఉర్దూ సాహిత్యంలో 2002 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, గ్రామీ అవార్డు 2010లో పొందారు.

ఆయన దాదాపు అన్ని ప్రక్రియల్లోను అనేక గ్రంథాలు రచించారు. ఆ రచనలు ఎంతో గొప్పగా సున్నితమైన భావోద్వేగాలు, ప్రకృతి మరింకా మానవ సంబంధాలను ప్రతిబింబిస్తాయి. ఆయన ప్రధాన రచనల్లో 'రావి పార్', 'పత్నికీ రాత్', 'త్రివేణి', 'సస్పెక్టెడ్ పోయెమ్స్', 'ఏ పొయెమ్ ఏ డే' (365 కవితలు), అలాగే మీర్జా గాలిబ్ జీవిత చరిత్రలు ముఖ్యమైనవి.



ప్రసిద్ధ తమిళ కవి వైరముత్తు తమిళ సాహిత్యంలోని మూడు తరాలను కలుపుతూ చేస్తున్న సాహిత్య ప్రయాణంలో ప్రధానంగా ఆయన ఒక సంగం కవి. తమిళ సాహిత్యం అతి పురాతనమైనది. అందులో సంగం కవులది విశిష్ట స్థానం. తొలి కవులు ప్రకృతిని ప్రేమిస్తే రెండో తరం కవులు దైవ పూజ, భక్తితో దేవుని కొలిచారు. ఇక ఆధునిక కవులు మనిషిని కేంద్రంగా మనసును, హృదయాన్ని పలికించారు. ఆయన కవిత్వమంతా సంగం వాసనల ప్రతీకలు, భక్తి ధార ఉపమానాలు కలిగి ఉంటుంది. అది నేటి సామాజిక బాధలు,కష్టాలు, కన్నీళ్లు, ప్రళయ ఘోష, పుష్పవిలాపం ధ్వని ప్రతిధ్వనులతో నిండి ఉంటది. తమిళనాడులోని వైగై నది ఆనపానుల్లోని ఆనాటి మధురైలో, నేటి తేని జిల్లాలో ఒక పేద రైతు కుటుంబంలో వైరముత్తు జూలై 13,1953న పల్లె నేపథ్యంలో పుట్టారు. ఆయన ఆయన సినీ గీతాలు మాత్రమే కాదు కవిత్వం, నవల ప్రక్రియలు కూడా రాసిన ప్రజా కవి. రైతుల వలసలు,బాధలు నేరుగా చూసి చలించిన రచయితగా, 'కల్లికాట్ట ఇతిహాసం' నవల పాఠకుల మదిని ఎంతగానో దోచిన గ్రంథం.

1980లో సినీ సినీరంగ ప్రవేశం చేసిన వైరముత్తు రామస్వామి రాసిన తొలి పాట 'పొన్ మలై పొజుత్తు'. ఆ తరువాత ఆయన దాదాపు 7500 కవితలు, పాటలు రాశాడు. వైరముత్తు సినిమా పరిశ్రమలో పూర్తి సమయం పనిచేయడానికి అనువాదకునిగా తన వృత్తిని వదిలేశాడు. నిజాల్గల్ తర్వాత, వైరముత్తు మరియు ఇళయ రాజా ద్వయం విజయవంతమైన సహకారాన్ని ప్రారంభించారు.

ఇది అర్ధ దశాబ్దం కంటే కొంచెం ఎక్కువే ఉంది. దర్శకుడు భారతీరాజాతో వైర ముత్తు ఉమ్మడి అనుబంధం, అలైగల్ ఒయివ తిల్లై, కాదల్ ఓవియం, మన్ వాసనై, పుధుమై పెన్, ఒరు కైధియిన్ డైరీ మరియు ముతల్ మరియాతై వంటి రచనలు విమర్శకుల ప్రశం సలు పొందినవి. ఇళయరాజాతో కలిసి పని చేస్తున్న కాలంలోనే వైరముత్తు మొదటిసారిగా దర్శకుడు మణిరత్నంతో కలిసి 1985లో ఇదయ కోవిల్లో 'నాన్ పదం మౌన రాగం' (రత్నం యొక్క పురోగతి మౌన రాగం టైటిల్‌ను ప్రేరేపించింది) పాటను రాశారు. వైరముత్తు ఎం.ఎస్. విశ్వనాథన్ తో కలిసి పనిచేశారు. భారతీయ సాహిత్య ఉన్నత గౌరవమైన జ్ఞానపీఠ పురస్కారం 2025కుగాను తమిళ కవి వైరముత్తుకు ప్రకటించారు. అఖిలన్ డి.జయకాంతన్ తరువాత పొందిన మూడవ తమిళ సృజనకారుడైతే, తమిళంలో తొలి కవి మాత్రం ఆయనే మరి. 'మండుతున్నంత వరకే నిప్పు నిప్పుగా ఉంటుంది, తిరుగుతున్నంత కాలమే భూమి భూమిగా ఉంటుంది, పోరాడు తున్నంత కాలమే మనిషి మనిషిగా ఉంటాడు' అనే మాటలు 'మూంద్రమ్ ఉలగ పోర్',అంటే 'మూడవ ప్రపంచ యుద్ధం' నవలలో వైరముత్తు రాసినవి. అది అప్పుడు భూతాపం చుట్టూ, రైతులు ఎదుర్కొనే పరిస్థితులను వివరిస్తుంది. తమిళ కవి చక్రవర్తిగా పిలుచుకునే వైరముత్తు పచ్చయ్యప్ప కళాశాల, చెన్నైలో చదివారు. డిగ్రీ పట్టా పొందారు.

1980 నుండి ఇప్పటిదాకా ఆయన క్రియాశీల సృజన కాలంలో రాసిన ప్రసిద్ధ రచనలు కల్లికాట్టు ఇతిహాసం, కరువాచి కవియం, మూంద్రం ఉలగపోర్. వైరముత్తు పలు చలన చిత్ర అవార్డులతోపాటు పౌర గౌరవాలు పద్మశ్రీ, పద్మ భూషణ్, కలైమామణి అవార్డు అందుకున్నారు.

**- డా.టి. రాధాకృష్ణమాచార్యులు**
9849305871

## మానేరు నది ఒడ్డున 'మానేరు తీరం' ఆవిష్కరణ

కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత వారాల ఆనంద్ తెలుగులో రచించి తానే స్వయంగా ఇంగ్లీష్ లోకి అనువదించిన 'మానేరు తీరం' ద్విభాషా కవితా సంకలనం ఆవిష్కరణ మార్చ్ 30 సోమవారం సాయంత్రం అయిదు గంటలకు జరుగుతుంది. కరీంనగర్ పట్టణ కంఠాభరణం అయిన మానేరు నది ఒడ్డున దిగువ మానేరు ఆనకట్టపై జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కరీంనగర్ కు చెందిన పలువురు సాహితీ వేత్తలు ఆత్మీయులు హాజరవుతారు. ఈ కవితలు సౌందర్యాన్ని అలంకరించవు సత్యాన్ని ఆవిష్కరిస్తాయి. వాటిలో ఆశ ఉంది, కానీ అది అలవోక ఆశ కాదు. అది పోరాటం మధ్యలో పుట్టిన ఆశ. తెలుగు-ఇంగ్లీష్ ద్విభాషా సంచికగా ఈ పుస్తకాన్ని అందించడంలో ఒక ఉద్దేశ్యం ఉంది. ఈ అనుభూతులు ఒక భాషకు మాత్రమే చెందినవి కావు. మనిషికి చెందినవే. అందరికీ ఇదే మా ఆహ్వానం.

**- వి. ఇందిరా రాణి**
పొయెట్రీ ఫోరం పబ్లికేషన్స్



## ఆయన....

ఆయన కంచు
కరిగే మంచు కూడా
ఆయన ఉరుము
చినుకయ్యే మేఘం కూడా
ఆయన శిల
ప్రవహించే అల కూడా
ఆయన ఖడ్గం
పరిమళించే పుష్పం కూడా
ఆయన ముక్కోపి
అన్నం పెట్టే ఋషి కూడా

**కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత నందిని సిధారెడ్డి కోసం**

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# ట్రిబుల్ ఆర్అలైన్మెంట్, అసైన్మెంట్ భూముల స్వాధీనంపై ఆందోళన

- **మంత్రి దృష్టికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి మార్చి 29 (మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల రైతుల భూములను ప్రభావితం చేస్తున్న రీజినల్ రింగ్ రోడ్ (ట్రిబుల్ ఆర్) ప్రాజెక్ట్ ప్రతిపాదిత అలైన్మెంట్పై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి కీలక లేఖ రాశారు. గిర్మాపూర్, తోగర్పల్లి, అలియాబాద్, మారేపల్లి, రాంపూర్ తండా, మాచేపల్లి, గోటిలగుట్ట తండా, గంగారం, శివన్నగూడెం తండా గ్రామాలకు చెందిన సుమారు 525 ఎకరాల వ్యవసాయ భూములు ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రభావితం అవుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఇందులో అధికంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులే ఉన్నారని తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఓ ఆర్ ఆర్ నుంచి 40 కి.మీ దూరంలో ఉండాల్సిన ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ప్రస్తుతం కేవలం 23 కి.మీ దూరంలో ప్రతిపాదించబడటం వల్ల గ్రామాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ భూములే రైతుల ప్రధాన జీవనోపాధి కాగా, సంవత్సరానికి రెండు పంటలు పండే సారవంతమైన భూమిని కోల్పోతే వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా విచారణలో ఎకరానిక్కి 2 కోట్లు పరిహారం ఇస్తామని చెప్పినా అమలు కాలేదని, వాస్తవానికి ఎన్ హెచ్ -65 సమీపంలోని ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానిక్కి 6-8 కోట్లు ఉందని రైతులు పేర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల, ప్రభుత్వం మొదట నిర్ణయించిన అలైన్మెంట్ను కొనసాగించాలి లేదా ప్రస్తుత అలైన్మెంట్ కొనసాగితే రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధరతో పరిహారం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**అసైన్మెంట్ భూముల స్వాధీనం ప్రతిపాదనపై ఆందోళన**

ఇదే సమయంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని అసైన్మెంట్ భూముల రక్షణపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి మరో లేఖ రాశారు. సదాశివపేట మండలం ఆరూర్, కంది మండలం చెరియాల, కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామాల్లోని సుమారు 593.655 ఎకరాల అసైన్మెంట్ భూములు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ వర్గాలకు చెందినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ భూముల్లో అధిక భాగం దళితులకు చెందినవిగా ఉండి, అవే వారి ప్రధాన జీవనాధారమని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కు అప్పగించే ప్రక్రియ గజిట్ నోటిఫికేషన్ ద్వారా వెలువడటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ భూములు 1997లో మరియు 2005లో భూమిలేని నిరుపేదలకు చట్టబద్ధంగా కేటాయించబడినవని గుర్తుచేశారు. ఈ భూములు కోల్పోతే బలహీన వర్గాల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని, వారి ఆర్థిక స్థితి క్షీణించే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల, అసైన్మెంట్ భూములను టీజీ ఐసీ.కు అప్పగించే ప్రతిపాదనను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ భూముల స్వాధీనం తప్పనిసరి అయితే, ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా న్యాయమైన పరిహారం ఇవ్వడమే కాకుండా, ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం మరియు ఒక నివాస ప్లాట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేస్తూ, బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , కోరారు.

## బొగ్గు కార్మి కుల ధర్నాను విజయవంతం చేయాలి




- **సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం పిలుపు**

**హనుమకొండ, మార్చి 29(మనం న్యూస్ ):** బొగ్గు పరిశ్ర మలల్లో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికులు తమ పెన్షన్ పెరుగుదల మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న ఢిల్లీలో తల పెట్టిన దర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధ్యక్షులు కాడర్ల ప్రకాష్ , ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. 1998 నుండి పెన్షన్ అమలు, వాస్తవంగా దాదాపు 20 సంవత్సరాల కాలము గడిచిన పెన్షన్లో ఎలాంటి పెరు గు దల లేదు, కావున కు పెంచాలి తక్షణమే కనీస పెన్షన్ 15,000 రూపాయలకు పెంచాలన్నారు. డీ.ఏ. కూడిన 50శాతం పెన్షను అమలు చేయడం డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమ విశ్రాంతి ఉద్యోగులు పిలుపు ఇచ్చిన సంఘము మాట్లాడుతూ సింగరేణిలో కూడా ఇప్పటివరకు నెలవారి పెన్షన్ 500 నుంచి రూ.1000 తీసుకున్న వారి సంఖ్య దాదాపు 10 వేల మంది ఉన్నారని అలాగే సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ 8 లక్షల నుండి 25 లక్షలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంకు నలబాల దామోదర్, ఎస్.కె హసన్ కూడా విశ్రాంతి సింగరేణి కార్మికులు ఈ ధర్నాకు సంఘీభావము తెలుపగలరని పిలుపునిచ్చారు.

## మంగపేటలో ఘనంగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం




**ములుగు, మార్చి 29(మనం న్యూస్):** మంగపేట ఏటూరు నాగారం తాడ్వాయి గోవిందరావు పేటలలో ఘనం గా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి నట్లు తెలుగు దేశం పార్టీ ములుగు జిల్లా నాయకులు దరావత్ దేవా నాయక్ తెలిపారు. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ లు విఫలమైనందున ములుగు జిల్లా ప్రజలు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. తెలుగు దేశం పార్టీ క్రమ శిక్షణ పార్టీ ప్రజలు మరల తెలుగు దేశం పార్టీ వైపు ఎదురుచూస్తున్నారు ప్రజల ఆలోచనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ములుగు జిల్లాల్లో తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు శ్రమించి పార్టీ నిర్మాణం చేసి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని అప్పుడే అవినీతి లేని ఆదర్శవంతమైన పాలన అందిస్తామని పేదలకు బడుగు బలహీనవర్గాలకు సముచిత న్యాయ జరుగు తుంది అని ములుగు జిల్లా తెలుగదేశం పార్టీ నాయకులు దేవా నాయక్ తెలిపారు పేదల పెన్నిధి పేదల కోసం పోరాటం చేసిన వారని నిరుపేదలను గెలిపిస్తే పోరాట పంథాను మార్చి ఇప్పుడు లాండ్ సాండ్ మణి మాఫియా గా మారి దోచుకోవడం లో వెనుకాడడం లేదని దేవా నాయక్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఎల్ వి జి. నాయుడు, సత్యనారాయణ, హరి ప్రసాద్, కృష్ణా రావు, నాగేశ్వర్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్-అదాలత్తో అపూర్వ స్పందన

- **4868 కేసుల్లో విజయవంతంగా రాజీ**
- **సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ: 1.42 కోట్లు తిరిగి బాధితులకు అందేలా కోర్ట్ ఆదేశాలు**
- **అద్భుత సమన్వయం, అంకితభావంతో లోక్-అదాలత్ను సక్సెస్ చేసిన జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందిపై ఎస్పీ ప్రశంసలు**




**సంగారెడ్డి, మార్చి 29 (మనం ప్రతినిధి):** జాతీయ మెగా లోక్-అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి 717 ఐపిసి కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందని,2722- ఇ-పెట్టి, 1429 - డిడి కేసులలో అడ్మిషన్/ జరిమాజన విధించడం జరిగింది. సైబర్ నేరాలకు సంభందించి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 73 సైబర్ క్రైమ్ కేసులలో రూ: 1.32 కోట్లు, ఎఫ్ఐఆర్ లేకుండా 88 కేసులలో 10.83 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ నుండి అనుమతి పొందడం జరిగిందని అన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు సమఉజ్జులు ఉంటారని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ప్రత్యేక ఘటన₹ : 2021లో సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి, ఐదేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు జాతీయ లోక్-అదాలత్ ద్వారా ముగింపు పలికారు. మురళి-శ్రీలేఖ దంపతులను మళ్లీ ఏకం చేసి కుటుంబాన్ని కలిపారు. ఈ సందర్భంగా వారు సంగారెడ్డి జిల్లా పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసుల అత్యుత్తమ పనితీరును కొనియాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో చూపిన కట్టుబాటు, సమన్వయం, సేవా భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని ఎస్పీ , గర్వంగా తెలిపారు.జ జాతీయ లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు పి.పి లు, వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, డి ఫోర్ సి - డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ ఎస్ఐ, కోర్ట్ డ్యూటీ అధికాలు, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## దేవుని ఎర్రవల్లిలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం



**చేవెళ్ల, మార్చి 29(మనం న్యూస్):** దేవుని ఎర్రవల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ప్రారంభించారు. స్థానిక నిరుపేద లబ్ధిదారుడు చాకలి శంకరయ్య నిర్మించుకున్న ఈ గృహాన్ని కౌన్సిలర్ కరికే మీనాక్షి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవానికీ సొంతింటి కల నెరవేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు అత్తెలి అనంత్ రెడ్డి, మాణిక్య రెడ్డి, మాజీ సర్పంచ్ కంకంటి శ్యామలయ్య, విట్టల్ రెడ్డి, రాందాస్, సాలి శేఖర్, గోపాల్, చీర శ్రీనివాస్, కరికే రవి, సుభాష్, రామకృష్ణారెడ్డి, ఎదిరే రాములు మరియు బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం




**ములుగు, మార్చి 29(మనంన్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామపంచాయతీ లో శంకర కంటి ఆసుపత్రి ఎన్ఎస్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం కార్యక్రమంలో ములుగు జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ ల ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి పరీక్ష నిర్వహించిన తర్వాత కంటి ఆపరేషన్ కోసం 59 మంది ఉచిత కంటి ఆపరేషన్ చేయుటకు హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయుటకు ఈరోజు హైదరాబాద్ కి తీసుకు వెళ్లడం జరుగుతుంది . ఆపరేషన్ 59 మంది కి కంటి ఆపరేషన్ ఉచితంగా చేసి ఎన్ ఎస్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆపరేషన్ మరియు అద్దాలు ఇచ్చి పంపించారు.




## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


**2000- 2001 ఎస్ ఎస్ సి బ్యాచ్ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ**

**మహర్షి గురుకుల విద్యాలయం పెద్దాపూర్ భూపాలపల్లి జిల్లా**

**వరంగల్, మార్చి 29 (మనం న్యూస్ ):** భూపాలపల్లి జిల్లా పెద్దాపూర్ విలేజ్ లో 2000-2001 ఎస్ ఎస్ సి బ్యాచ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మరియు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా వగ్లాపూర్ జి ఎస్ ఆర్ రిసార్ట్ లో నిర్వహించడం జరిగింది.జ ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బైరెడ్డి వెంకటరెడ్డి, రావుల వెంకట్ రెడ్డి, బి. దేవేందర్ రెడ్డి, ఎస్.కె అంజాద్, హరి ప్రసాద్, మరియు విద్యార్థులు అజ్మీర దల్ సింగ్, ఏ రఘుపతి, వెంకటేశ్వర్లు, సతీష్, కుమార్, రాము, వేణు, సాంబయ్య, సంపత్,సతీష్,అజ్మీర బాలు నాయక్, తిరుపతి, కిరణ్, పల్లవి రాజు నాయక్, రజిత, హారిక, మద్ది రజిత, మాధవి, రజిని అనిత స్వాతి మొదలైన వారు పదో తరగతి చదువుకున్న క్లాస్మేట్స్ అందరూ ఒకే చోట కలిసి సిల్వర్ జూబ్లీ నిర్వహించుకున్న సందర్భంగా మాట ముచ్చట్లతో ఆటపాటలతో నిర్వచించిన సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## మంజీరా, నక్క వాగును కాలుష్యం నుండి కాపాడాలి

- **కాలుష్య నివారణకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి**
- **మూసిలాగా మంజీరాను శుద్ధి చేయాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**
- **రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ**




**సంగారెడ్డి మార్చి 29 (మనంప్రతినిధి):** సంగారెడ్డి జిల్లాలో ఉన్న మంజీరా, నక్క వాగులను కాలుష్యం నుండి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సంగారెడ్డి జిల్లాలో ఉన్న మంజీరానదిని, నక్క వాగులను కాలుష్యం బారి నుంచి కాపాడాలని, అందుకు అవసరమైన నిధులు బడ్జెట్ లో కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం జరిగింది. నేడు కేవలం కిషన్ భవన్లో బహిరంగ లేఖను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీరా నది సంగారెడ్డి జిల్లాతో పాటు మెదక్, హైదరాబాదు, రంగారెడ్డి, నిజామాబాద్ కామారెడ్డి లకు తాగునీటిని అందిస్తూ జీవనాధారంగా ఉన్నదని అన్నారు. దీనిపై జిల్లాలో అనేకమంది రైతులు, మత్స్యకారులు, వృతిదారులు, ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.మంజీరా నది వెంట అనేక పట్టణాలు, గ్రామాలు, పరిశ్రమ లు విస్తరించి ఉన్నాయని అన్నారు.సంగారెడ్డి జిల్లాకు గుండెకాయ లాంటి మంజీరా జలాలను పరిశ్రమల వ్యర్థ కాలుష్య జలాలు వలన కాలుష్యమయమైపోతున్నాయని అన్నారు.మంజీరా నది వెనుక పక్కన ఉన్న అనేక గ్రామాల ప్రజలు ఈ కాలుష్యం తోటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నక్క వాగు కాలుష్యం వలన పటాన్చెరు సంగారెడ్డి, కంది మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంజీరను, నక్క వాగును కాలుష్యం నుంచి పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలుష్య జలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నివారణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాలుష్యమయం అవుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని కోరారు. మూసిలాగా మంజీరా ను శుద్ధి చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం

- **రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజల హక్కులను కాపాడే ప్రభుత్వాలే మనుగడ సాగిస్తాయి**
- **టి బి సి జాక్ రాష్ట్ర అధ్యక్షులు**
- **హరి అశోక్ కుమార్**



**జగిత్యాల మార్చి 29(మనం న్యూస్):** జగిత్యాల జిల్లాలో కేంద్రంలో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ కార్యవర్గసభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి హరి అశోక్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు, టీబీసీ జేఏసీ, స్టేట్ సెక్రటరీ, సీనియర్ సిటిజెన్ పెన్షనర్లు, జగిత్యాల జిల్లా పూల మాలతో నివాళ్లు అర్పించి సేవలను స్మరించారు. అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం, న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు, ఆశయాలను, ఆదర్శల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందటంతో పాటు స్మరించుకోవాలని కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామని నల్ల శ్యామ్ తెలిపారు. అంబేద్కర్ గురించి విస్తృతంగా తెలుసుకొనుటకు స్వచ్ఛందంగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఇట్టి కార్యక్రమం అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి మాట్లాడుతూ.... మహోన్నతమైన భారత రాజ్యాంగన్ని గౌరవిస్తూ ప్రజల హక్కులు, రక్షణలు కాపాడే ప్రభుత్వాలు మనుగడ సాగిస్తాయని అభిప్రాయపడ్డారు. పాలకులు తాత్కాలికం. వ్యవస్థలు శాశ్వతం. వాటిని నాయకులు స్వార్థనికి వాడుకొని ప్రజల హక్కులను హరిస్తామంటే రాజ్యాంగం రక్షణ కవచంగా ఉంటుందనే సత్యాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పౌర సంఘాలు జాగురుకతతో ఉండి ప్రతి చోట అంబేద్కర్ కల్పించిన హక్కులపై అవగాహణ కల్పించాలని కోరారు. గత ముఖ్యమంత్రి రాజ్యాంగం మార్చాలని ప్రకటనలు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు, సదస్సులు నిర్వహించడం మూలానా వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం మార్చే పరిణామాలు చేస్తుందని అది పేద బడుగు బలహీనలకు గొడ్డలి పెట్టు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్.బి.ఐ బాంక్ ఎర్పాటుకు ప్రధాన కారణం బాబా సాహెబ్ అంబేద్కర్ గారే. అలాంటి మహనీయుడి ఫోటో కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లు ఆమోదించాలని కోరారు. అంబేద్కర్ స్మరణం కార్యక్రమం నిర్వాహకులు నల్ల శ్యామ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కార్యక్రమాల్లో తప్పకుండా మహనీయుడు సేవలను గుర్తు చేసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మట్టిపూలు పత్రిక సంపాదకులు తక్కల్ల దేవయ్య తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బిసి జేఏసి కన్వీనర్ మానాల కిషన్, ముద్దమల్ల ఆనంద్, ప్ర అధ్యక్షులు జిల్లా దళిత క్రిస్టియన్ ప్రవీణ్ కుమార్, మొహమ్మద్ యాకుబ్ సీనియిర్ సిటిజెన్ జిల్లా ఉపాధ్యక్షులు,కొత్తకొండ బాలయ్య సీనియర్ సిటిజెన్, మొహమ్మద్ ఏక్బాల్ సీనియర్ సిటిజెన్ జాయింట్ సెక్రటరీ, యాకుబ్ హుస్సేన్ సీనియర్ సిటిజెన్, గంగం జలజ జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జగిత్యాల, బక్కశెట్టి లక్ష్మి కార్యదర్శి పట్టణ బిసి సంక్షేమ సంఘం, హన్మంతరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, గౌరీశెట్టి విశ్వనాథం జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ సిటిజెన్ అసోసియేషన్,సయ్యద్ యూసఫ్ రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్, వెల్మ ప్రకాశరావు జిల్లా సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, అశోక్ రావు జిల్లా రిటైర్డ్ జిల్లా ఫారెస్ట్ అధికారి, కంటె అంజయ్య ప్రధాన కార్యదర్శి పట్టణ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం, పులి గోవర్ధన్ బరిసే కళావేదిక జిల్లా అధ్యక్షులు,దాసరి లచ్చయ్య సిరికొండ మాజీ సర్పంచ్, రుద్ర మనోహర్, దుర్గం మోహన్, బొల్లం ప్రభాకర్, రాగం రమేష్ న్యాయవాది, సంకె మహేష్,సుంకరిపల్లి అశోక్, సుంకె కిష్టయ్య, దుమాల గంగాధర్ జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకులు,తదితర అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ నల్లమల్ల అమర్నాథ్ యాత్ర సలేశ్వరం జాతరకు అన్ని ఏర్పాట్లు

**అధికారికంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు జాతర ఉత్సవాలు**

**సలేశ్వరం జాతరలో ఆదివాసి చెంచు గిరిజనులే లింగమయ్య పూజారులు**

**వెయ్యి అడుగుల ఎత్తు నుంచి దూకే కనువిందు చేసే జలపాతం**

**వస్తున్నాం.... వెళ్ళొస్తాం లింగమయ్య స్వామి అంటూ భక్తుల పాదయాత్రలు**





(అచ్చంపేట) ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 29 (మనం బ్యూరో): నల్లమల్ల అటవీ ప్రాంతం అనేక శివాలయ క్షేత్రాలకు పుట్టినిల్లు. కొండల గుట్టల మధ్యన శివ క్షేత్రాలకు నిలయమై భక్తుల చేత ఆయా సందర్భాలలో పూజలు అందుకుంటున్న శైవ క్షేత్రాలు అనేకం. రాష్ట్రంలో అతిపెద్ద ఆదివాసీల జాతర సమ్మక్క సారక్క. సలేశ్వరం జాతర రెండోది అని చెప్పవచ్చు. సమ్మక్క సారలమ్మ జాతర రెండేళ్లకొకసారి జరిగితే.. సలేశ్వరం జాతర ప్రతి ఏడాది జరగడం విశేషం. రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం పరిధిలోని నల్లమల్ల లోతట్టు అటవీ ప్రాంతం లో కొండలు, కోనలు, రెండో ఎత్తయిన గుట్టల సరికల మధ్యన వెలిసిన సలేశ్వరం శివలింగయ్యను దర్శించుకోవాలంటే సాహసోపేతమైన యాత్ర చేయాల్సి ఉంటుంది. లింగమయ్య కింద సుమారు వెయ్యి అడుగుల ఎత్తు నుండి జలపాతాన్ని తాకిన భక్తులు, భక్తి పారవశ్యంతో గుండం వద్ద పూజలు చేస్తారు. దక్షిణ భారతదేశంలో తెలంగాణ అమర్నాథ్ యాత్రగా ప్రసిద్ధి చెందిన ఈ యాత్రను, వయస్సు లేదా లింగ భేదం లేకుండా, రాష్ట్రం నలుమూలల నుండి మరియు రెండు తెలుగు రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు, ప్రకృతి ప్రేమికులు సందర్శిస్తారు. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమి రోజున, లక్షకు పైగా భక్తులు శివనామ జపంతో ఈ యాత్రను సందర్శిస్తారు. శాలేశ్వరం జాతర ఉత్సవం ఏప్రిల్ 1 నుండి 3 వరకు జరుగుతుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఎక్కువ మంది భక్తులు శాలేశ్వరం జాతర ఉత్సవానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా ప్లాస్టిక్ను నియంత్రించడానికి అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

### సలేశ్వరం లింగమయ్య ఆలయ చరిత్ర..

నాగార్జున కొండలో బయటపడిన ఆధారాలను బట్టి ఇక్ష్వాకుల కాలం క్రీస్తు శకం 360 కాలపు నిర్మాణాలు లింగమయ్య గుడికి ఏర్పాటుచేసిన ఇటుకలను బట్టి అర్థమవుతుంది. అలాగే గర్భగుడి ముఖద్వారం నాటి విష్ణు కుండీల శిలాఫలకం ఉన్నది. ఆలయాన్ని ద్వారానికి కుడివైపున వీరభద్రుడు దక్షకుడి విగ్రహాలు, ఎడమవైపున రెండు సిద్ధ విగ్రహాలు ఉన్నాయి. ఆలయానికి ముందు భాగంలో 10 అడుగుల క్రింద సలేశ్వరం గుండం ఉన్నది.

వస్తున్నాం లింగమయ్య శివ నామాలతో స్వరముతో నల్లమల్ల దద్దరిల్లేలా యాత్రను ..

నల్లమల్ల కొండల్లో కోనల్ల మధ్యన వెలిసిన లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు కాలినడకన సుమారు 4 కి.మీ కొండలు గుట్టలను ఎక్కుతూ, దిగుతూ లోయల సరికలకుండా భక్తులు వస్తున్నాం.. వస్తున్నాం.. లింగమయ్య, హర హర శంభో శంకర అంటూ భక్తులు గొంతు ఎత్తుతూ కొండల మధ్యన శివనామ స్వరంతో దరులు దద్దరిల్లేలా యాత్రను కొనసాగిస్తారు.

### నల్లమల్ల అడవుల్లో సాహసం యాత్ర...


చైత్ర మాసం పౌర్ణమి సందర్భంగా నల్లమల్ల అడవుల్లో కొలువుదీరిన శివలింగయ్యను దర్శించుకునే యాత్ర అమరనాథ్ ను తలపించేలా ఈ యాత్ర ఉంటుంది. అమరనాథ్ యాత్ర మంచు కొండలలో కొనసాగితే ఈ యాత్ర మాత్రం అడవులు, కొండలు, గుట్టలు, లోయలు మార్గంలో కొనసాగుతది. స్వామిని దర్శించుకునే సమీప ప్రదేశంలో రెండు గుట్టల మధ్యన ఇరుకైన బాటలో భక్తులు సాహసోపేతంగా నడుస్తూ అలసిపోయిన భక్తులకు గుండం వద్దకు చేరుకోగానే సుమారు వెయ్యి అడుగుల ఎత్తు నుండి దూకే జలపాతాన్ని తాకగానే కాలినడకన వచ్చిన బాధను మరిచిపోయి మైమరసిపోతూ లింగమయ్య దర్శించుకుంటారు.

### నల్లమల్ల ఆదివాసి చెంచులే పూజారులు..

సమ్మక్క సారలమ్మ జాతర లో ఆదివాసులే పూజారులు ఎలా ఉత్సవాలను కొనసాగిస్తారో.. నల్లమల్ల అడవి ప్రాంతంలో కొండల మధ్యన వెలిసిన సలేశ్వరం లింగమయ్య జాతర వద్ద ఆదివాసి చెంచులే పూజారులుగా కొనసాగుతున్న ఆనవాయితీ.

### సలేశ్వరం యాత్ర ఎల్లాలంటే

సలేశ్వరం లింగమయ్యను దర్శించుకోవడానికి, నాగర్కర్నూలు జిల్లాలో ఒక మార్గం లింగాల మండలంలోని అప్పైపల్లి గ్రామం మీదుగా 30 కిలోమీటర్ల కాలినడకన వెళ్ళాలి. మరొక మార్గం శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గ్రామానికి చేరుకోవడం. అక్కడి నుండి, సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫరాహబాద్ కూడలి నుండి, 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంపూర్ పెంటాకు వాహనంలో చేరుకోవచ్చు. అక్కడి నుండి, లింగమయ్యను దర్శించుకోవడానికి కొండలు, గుట్టలు, లోయలను దాటుకుంటూ నాలుగు కిలోమీటర్ల సాహసోపేతమైన ప్రయాణం చేయాలి.





### సలేశ్వరం యాత్రకు ఆర్టిసి ప్రత్యేక బస్సులు..

సలేశ్వరం జాతర వేడుకలకు భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి కాకుండా నల్గొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడవనున్నాయి. ఈ బస్సులు రాంపూర్ పేట వద్దకు మాత్రమే చేరుకుంటాయి. అక్కడ నుండి భక్తులు కాలినడకతో 4 కి.మీ పాదయాత్ర చేసి.. అక్కడ అన్నదానంలో పాల్గొని గుట్టల్లో మరో నాలుగు కి.మీ వరకు వెళ్లి సలేశ్వరం లింగమయ్యను దర్శించుకుంటారు.

### నల్లమల్ల అడవుల్లో సలేశ్వరం జాతరకు భారీ బందోబస్తు..

సలేశ్వరం జాతర వేడుకలకు లక్షలాది భక్తులు వస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, అడవి శాఖ సమన్వయంతో పెద్ద మొత్తంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ శాఖ డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఇటీవల నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏర్పాట్లు చేయాలని.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, వైద్యం, శానిటేషన్ తదితర సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాతర ఏర్పాట్లకు రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# రికవరీ...రీఫండ్‌లో రికార్డు

- **53,434 మంది బాధితులకు రూ. 399.06 కోట్ల రీఫండ్**
- **గడచిన మూడు నెలల్లో రికార్డు స్థాయిలో రికవరీ**
- **లోక్అదాలత్‌లో రూ. 24.91 కోట్ల రీఫండ్**
- **సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి**



హైదరాబాద్, మార్చి 29 (మనం,ప్రత్యేక ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో చోటుచేసుకున్న సైబర్ నేరాలలో బాధితుల సొమ్ము రికవరీ..రీఫండ్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో రికార్డు సాధించిందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఇప్పటి వరకు 53,434 మంది బాధితులకు రూ. 399.06 కోట్ల రీఫండ్ చేశామని, గడచిన మూడు నెలల్లో రికార్డు స్థాయిలో రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు. తాజాగా జరిగిన లోక్‌అదాలత్‌లో రూ. 24.91 కోట్ల మొత్తాలను బాధితులకు రీఫండ్ చేశామని శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తెలంగాణ పోలీసులు భారీ ఊరటనిచ్చారని, ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 4,627 మంది బాధితులకు రూ. 24.91 కోట్ల నగదును రీఫండ్ చేసినట్లు వివరించారు. జాతీయ అదాలత్ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న బాధితులకు వారి సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఘన విజయం సాధించామన్నారు. ఈ మెగా తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, వివిధ బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుని, అన్ని కమిషనరేట్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌లతో కలిసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

### రికార్డు రికవరీ

2026 తొలి త్రైమాసికంలోనే రికార్డు స్థాయిలో రికవరీ సాధించామని, ముఖ్యంగా టీజీసీఎస్బీ ప్రధాన కార్యాలయం పరిధిలో 87 మంది బాధితులకు రూ. 5.64 కోట్లు తిరిగి ఇప్పించినట్లు శిఖా గోయల్ వివరించారు. అలాగే మల్కాజిగిరి విభాగం రూ. 4.79 కోట్లు (832 మంది బాధితులు), హైదరాబాద్ విభాగం రూ. 3.99 కోట్లు (553 మంది బాధితులు) రికవరీ చేసి అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. సైబరాబాద్, సంగారెడ్డి విభాగాలు చెరి రూ. 1.52 కోట్లను బాధితులకు చేరవేశాయని ఆమె వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే 2026లో సైబర్ నేరాల పట్ల స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని, లోక్ అదాలత్ వంటి వ్యవస్థీకృత మార్గాల ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

### రూ.399 కోట్ల రీఫండ్

తెలంగాణ రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 53,434 మంది బాధితులకు ఏకంగా రూ. 399.06 కోట్ల మొత్తాన్ని రీఫండ్ చేయించినట్లు డైరెక్టర్ వెల్లడించారు. 2023లో రూ. 8.3 కోట్లుగా ఉన్న రీఫండ్ విలువ, 2024లో రూ. 183.9 కోట్లకు, 2025లో రూ. 183 కోట్లకు పెరిగిందని, ప్రస్తుతం 2026లో కేవలం మూడు నెలల్లోనే రూ. 24.91 కోట్లు సాధించడం తమ నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. యూపీఐ మోసాలు, పెట్టుబడి పథకాల పేరుతో జరిగే స్కామ్‌లు, ఐడెంటిటీ ఫ్రాడ్స్ వంటి వాటిపై బ్యాంకులు, న్యాయవ్యవస్థతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రీఫండ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆమె వివరించారు. ఇదే క్రమంలో ప్రజలు సైబర్ జాగ్రత్తలు పాటించాలని శిఖా గోయల్ విజ్ఞప్తి చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, పిన్ నంబర్లు, బ్యాంకింగ్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారానే కస్టమర్ కేర్ నంబర్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఒకవేళ మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే '1930' నంబర్‌కు ఫోన్ చేయాలని వివరించారు.

# కొయ్యలగూడెంలో ఉద్రిక్తత

- **విగ్రహాల ఏర్పాటుపై వివాదం**
- **పోలవరం టిడిపి ఇన్చార్జి బొరగం శ్రీనివాస్ ముందే పెట్రోల్ ఒంటిపై పోసుకున్న యువకుడు**



కొయ్యలగూడెం,మార్చి 29 మనం ప్రతినిధి: యువకుడి ఆత్మహత్యాయత్నం కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామంలో ఆదివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తన సొంత స్థలం ఎదుట ఉన్న ఆర్ అండ్ బి (RB) స్థలంలో విగ్రహాల ఏర్పాటు ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన కరటూరి నవీన్ కుమార్ అనే వ్యక్తి మూడు సంవత్సరాల క్రితం సుమారు రూ.6 లక్షలతో మూడు సెంట్ల స్థలాన్ని రోడ్డు బైపాస్ సమీపంలో కొనుగోలు చేశాడు.ఆ స్థలంలో చిన్న దుకాణం నిర్మించి జీవనోపాధి కొనసాగించాలని భావించాడు.ఇటీవల తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా,ఆ స్థలం సమీపంలోని ఆర్ అండ్ బి భూమిలో నిమ్మగడ్డ అప్పారావు, ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక టీడీపీ నేతలు నిమ్మగడ్డ రాంబాబు,బోరగాం శీను తదితరులు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ విషయంపై నవీన్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేయగా, ఏం చేసుకుంటావో చేసుకోఅంటూ నిర్లక్ష్యంగా స్పందించారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన నవీన్ కుమార్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి దిగినట్లు తెలిపారు.నాకు న్యాయం జరగకపోతే చనిపోవడమే మార్గం అని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు,ఒక న్యాయవాది కలిసి రాజకీయ ప్రభావంతో తన జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానికులు వెంటనే స్పందించి నవీన్ కుమార్ ను ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

# తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం



పిఠాపురం మనం న్యూస్:పేదప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రజల అభ్యున్నతికోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో వాడవాడ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మతో పాటు ఆతయ సతీమణి లక్ష్మీదేవి, వారి తనయుడు గిరీష్ వర్మ పిఠాపురం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. వీరు గ్రామగ్రామాన తిరుగుతూ తెలుగుదేశం పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే వర్మ, లక్ష్మీదేవి, గిరీష్ వర్మ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వర్మ, లక్ష్మీదేవి, గిరీష్ వర్మ మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామగ్రామన భారీఎత్తున పాల్గొన్నారు.

# అనాతవరంలో రహదారులను ప్రారంభించిన విప్ దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, మార్చి 29, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదివారం సుమారు రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు రహదారులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుబ్బరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందన్నారు.


అనాతవరం గ్రామంలో రహదారి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అందుకు త్వరితగతిన నిర్మా ణాలు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చినట్టు శాసనసభ్యులు సుబ్బరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, అభిమానులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోడూరులో ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

- **ఎన్టీఆర్ ఆశయాలకు కట్టుబడి ముందుకు సాగుదాం**
- **ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి భావోద్వేగ నివాళులతో కదిలిన కార్యకర్తలు**
- **చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పదంలో రాష్ట్రం, లోకేష్ యువ శక్తి ప్రజలకు అండ**



పోడూరు మార్చి 29 మనం న్యూస్ : పోడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 వసంతాలు,(సంవత్సరాలు )పూర్తయిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు,పార్టీ శ్రేణుల్లో అపార ఉత్సాహం కనిపించింది.ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ప్రజల కోసం పుట్టిన నాయకుడు, స్వాభిమానానికి ప్రతీక అయిన మహానేత ఎన్టీఆర్ అంటూ కార్యకర్తలు భావోద్వేగంతో ఆయన సేవలను స్మరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు రవిరాజు, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి పురుషోత్తం, ఏఎంసీ డైరెక్టర్ బండి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కుసుమే మోసేను,మాట్లాడుతూ భావోద్వేగపూరితంగా ప్రసంగించారు.తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ ఆశయాలు ప్రతి కార్యకర్త గుండెల్లో నాటుకుపోయాయని.ఆయన తెలుగుదేశం కార్యకర్తలకు చూపిన మార్గం మాకు మార్గదర్శకం అని అన్నారు.అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతూ,చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అభివృద్ధి పట్ల అంకితభావం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో నిలుస్తోంది. ప్రజల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు, ఆయన వల్లే నేడు తెలుగుదేశం పార్టీ, ఏపార్టీ చేరుకోలేనంత ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లిందని కొనియాడారు. అదే విధంగా యువ నాయకుడు నారా లోకేష్ పై కూడా ప్రశంసలు కురిపిస్తూ,లోకేష్ యువతకు ఆశాకిరణం.ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకుని, పరిష్కారం కోసం పోరాడుతున్న యువ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం అని కొనియాడారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ గురించి కూడా రవిరాజు ప్రస్తావిస్తూ, పితాని సత్యనారాయణ ప్రజల మనసులు గెలుచుకున్న నాయకుడు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తున్నారు. ఆయన సేవలు పోడూరు ప్రాంతానికి ఒక బలమైన అండగా



నిలుస్తున్నాయి. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించే నాయకత్వం ఆయనది అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. పోడూరు గ్రామం మొత్తం పార్టీ జోష్తో నిండిపోగా, కార్యకర్తల నినాదాలు గాలిలో మారుమోగాయి.

# ఒంటిమిట్ట శ్రీ సీతా రాముల కల్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధం

- **85 వేల లడ్డూల ప్యాకింగ్లో పాల్గొన్న 300 మంది శ్రీవారి సేవకులు**

తిరుమల, మార్చి 29 మనం న్యూస్: ఏప్రిల్ 01వ తారీఖున ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ - 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్ను ఆదివారం టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి మరియు డిప్యూటీ ఈవో (పరకామణి ఇన్చార్జ్) శ్రీ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట వరకు నిరంతరాయంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్. నాయుడు, ఈవో శ్రీ ఎం. రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు సుమారు 200 మంది మహిళా సేవకులు, 100



మంది పురుష సేవకులు కలిసి ఐదు గంటలపాటు అంకితభావంతో సేవలందించారని తెలిపారు. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ శ్రీవారి సేవా సదన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# మటన్ లేదు...వంకాయ కూరే తిను

- నేను పెట్టిందే మెనూ...అదే తిను..
- గిరిజన సంక్షేమ వసతి గృహంలో అమలుకాని మెనూ
- వసతిగృహ వార్డెన్ తీరే వేరు
- సార్ పేరు చెబితే విద్యార్థుల పరుగులు
- పశ్నించిన వారిని వీడియోలతో బ్లాక్ మెయిల్



**చర్ల, మార్చి 29 (మనం న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వసతిగృహ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచడమే కాకుండా బలమైన ఆహారం అందించేందుకు ప్రతిరోజు గుడ్డుతో పాటు నెలకు ఆరు వారాలు మటన్, చికెన్ తో విద్యార్థులకు ఆహారం అందించాల్సి ఉంటుంది. కాని దీనికి బిన్నంగా చర్ల మండలం సత్యనారాయణపురం గిరిజన సంక్షేమ వసతి గృహంలో జరుగుతోంది. అక్కడ విదులు నిర్వహిస్తున్న వార్డెన్ ప్రభుత్వ మెనూను అమలు పరచకుండా తన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడు. తలబిరుసుతనంతో వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారిపై వీడియోలు తీస్తూ ఎదురుదాడికి దిగేయత్నం చేస్తున్నాడు. వార్డెన్ వ్యవహారశైలిపై విద్యార్థులు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇంత జరుగుతున్నా వసతిగృహంను పర్యవేక్షించాల్సిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామంలోని గిరిజన సంక్షేమ వసతిగృహంలో ప్రభుత్వం అందించిన మెనూ అమలు కావడం లేదు.ఐదవ ఆదివారం బగారరైస్, మటన్, సాంబారు, పెరుగు పెట్టాల్సి ఉండగా ఇవి ఏమి పెట్టకుండా వంకాయ కూర, నీల్ల సాంబారుతో అన్నంపెట్టి గిరిజన విద్యార్థుల పొట్టకొడుతున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా చపాతి లేదా పూరి కూరతో వడ్డించాల్సి ఉండగా బోండాలను పెట్టి చిన్నారుల కడుపు మార్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మొదటి, మూడవ, ఐదవ ఆదివారాలలో మటన్, రెండవ, నాలుగవ ఆదివారం మటన్, మొదటి, మూడవ బుధవారం చికెన్ తో భోజనం, బగారా రైస్ వడ్డించాల్సి ఉంటుంది. మాంసాహారం లేని ప్రతి రోజూ గుడ్డు పెట్టాల్సి ఉంటుంది. కాని ఈ వసతి గృహంలో ఇవి ఏమి పెట్టకుండా విద్యార్థుల కడుపులు మాడ్చుతున్నారు. సి ఆర్ పి ఎఫ్ క్యాంప్ ఆవరణలో వసతిగృహం ఉండటంతో మమ్మల్ని ఎవరూ ప్రశ్నించరన్న ధీమాతో వార్డెన్ వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఆదివారం ఐదవ వారం కావడంతో బగారరైస్, మటల్, సాంబారు, పెరుగు పెట్టాల్సి ఉండగా ఇవేమి వడ్డించకుండా వైట్ రైస్, నీల్ల సాంబారుతో మమ అనిపించారు. శనివారం వసతిగృహంలో జరిగిన ఒక వివాదం పోలీస్ స్టేషన్ కు చేరడంతో ఈ విషయమై ఆరా తీసేందుకు 'మనం' వసతి గృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించగా పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూసారు. గత కొన్నాల్లుగా చికెన్, మటన్, కోడిగుడ్లను సరిగా పెట్టడం లేదని, నెలకు ఒకటి రెండు సార్లు మాంసాహారం పెట్టి మిగిలిన రోజులు కూరగాయలతో సరిపెడుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు విలేఖరితో మాట్లాడేందుకు భయపడుతూ పారిపోయి గదులలో దాక్కొన్నారు. పేరు చెప్పటానికి ఇష్టపడని ఒక విద్యార్థి మాట్లాడుతూ మెనూ విషయం మాట్లాడితే వార్డెన్ సార్ కొడతారని, బయటివారికి చెప్పవద్దంటూ బెదిరిస్తుంటారని వాపోయారు. ఈలోగా వసతిగృహం వద్దకు చేరుకున్న వార్డెన్ విలేఖరులపై దురుసుగా ప్రవర్తించాడు. విలేఖరులను వీడియో తీయమని అక్కడ ఉన్న సిబ్బంది, విద్యార్థులను రెచ్చగొట్టాడు. ప్రభుత్వం గత నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించడంలేదు నేను ఎక్కడి నుండి తెచ్చిపెట్టాలంటూ చిందులేసాడు. మటన్, చికెన్ ధరలు పెరగడంతో సంబంధిత కాంట్రాక్టర్ సరఫరా చేయడం లేదని, అందుకే వంకాయకూర వండి విద్యార్థులకు పెట్టామని తెలిపాడు. వాస్తవానికి కాంట్రాక్టర్ సరఫరా చేయకపోయినప్పటికి వార్డెన్ చికెన్ లేదా మటన్, కోడి గుడ్లను కొనుగోలు చేసి మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సిఉంటుంది. చర్ల మండలంలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో ఆదివారం మటన్ కు బదుకు చికెన్ తో భోజనం వడ్డించగా సత్యనారాయణపురం విద్యార్థులు మాత్రం చికెన్ భోజనానికి నోచుకోలేదు. ప్రస్తుత వార్డెన్ విదులు చేపట్టిన దగ్గర నుండి ఇతరులు, విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రశ్నించిన వారిని వీడియోలు తీసి ఎదురుదాడి చేయడం ఇతని నైజమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై భద్రాచలం ఏటిడివో అశోక్ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి జోక్యం చేసుకొని గిరిజన సంక్షేమ వసతి గృహాలలో మెనూ అమలయ్యేలా చూసి పేద గిరిజన విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మొక్కజొన్న రైతు సమస్యలపై వినతి



- సూరంపల్లి రామారావు
- కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆదేశాలు

**కొణిజర్ల, మార్చి 29 (మనం న్యూస్):** కొణిజర్ల ప్రాంతానికి చెందిన మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే కు వినతి పత్రం సమర్పించిన మాజీ సర్పంచ్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు. మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో మార్క్ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొణిజర్ల మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొణిజర్ల పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న పంట విస్తారంగా పండుతున్నప్పటికీ, సరైన కొనుగోలు కేంద్రం లేక రైతులు తమ పంటను దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో రవాణా ఖర్చులు పెరగడంతో పాటు మధ్యవర్తుల చేతిలో రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలోనే మార్క్ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ కొణిజర్లలో తక్షణమే మార్క్ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొనిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నందుకు అభినందనలు తెలిపారు

## ఘనంగా దమ్మపేట మండలంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**దమ్మపేట,మార్చి 29 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మార్చి 29 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దమ్మపేట మండల కేంద్రంలో దివంగత నాయుడు చెన్నారావు ,ఇంటి వద్ద తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం తెలుగుదేశం పార్టీ అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు ఎండి వలీపాషా,సీనియర్ టీడీపీ నాయకులు.నాయుడు వీరస్వామి,బంధం శ్రీనివాసరావు, చిర్రా ధర్మారావు,భోగి సత్యం, వార్డు సభ్యులు ఉయ్యాల లక్ష్మీనారాయణ,సజ్జా అనంత, సయ్యద్ బాజీ, మల్లికార్జున రావు, ప్రసాదు, షేక్ మౌలాలి, నాయుడు సుబ్బారావు, కృష్ణ, చక్కరపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. మొద్దులగూడెం నాయుడుపేట రింగులో టిడిపి ఆవిర్భావ దినోత్సవంటీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.నాచారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మట్ట స్టాలిన్, దొండపాటి సుమన్, మాదాల శ్రీనివాసరావు, దొడ్డ రాజా, దొడ్డ విజయ్, పర్వతనేని సత్యనారాయణ, నారం సుబ్బారావు, సిద్దిన శ్రీనివాసరావు, రాజాబాబు, దొడ్డ చిన్నబ్బాయి,రాయల సూరిబాబు, చారి, వసంతరావు,చరమళ్ళ శ్రీను,రాయల పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయేల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలి

- ఏప్రిల్ 4 న జరిగే యుద్ధ వ్యతిరేక ప్రదర్శనను విజయవంతం చేయాలి
- మణుగూరు అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులు




**మణుగూరు, మార్చి 29(మనం న్యూస్):** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయేల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, ఇందుకోసం మణుగూరులో జరిగే యుద్ధ వ్యతిరేక ప్రదర్శనను ప్రజలు విజయవంతం చేయాలని మణుగూరు అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక స్నేహ గార్డెన్స్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ 4న సాయంత్రం 5 గంటల నుండి మణుగూరు సురక్ష బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఊ అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ప్రపంచంలోని వివిధ దేశాలపై ఆధిపత్యం కోసం యుద్ధాలు చేస్తున్నాయన్నారు. శిలాజ ఇందనాలు, ఖనిజాలతో పాటు జల, భూవనరులను కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేయాలని చూస్తున్నారన్నారు. ఫిబ్రవరి28 నుండి నిరవధికంగా బాంబుల వర్షం కురిపిస్తున్నాయని, ఈసారి ఇరాన్ ప్రతిఘటిస్తుందన్నారు. ఆయిల్ పరిశ్రమలు, వాటర్ ప్లాంట్లు, విమానాశ్రయాలు, నివాస స్థలాలు, హాస్పటల్స్ పైన చివరకు బడుల పైన బాంబులు వేస్తూ వేలాది మందిని హతమారుస్తున్నారన్నారు. ఈ యుద్ధం ప్రపంచంలోని 800కోట్ల మందికే కాకుండా పర్యావరణానికి చివరకి భూమండలానికే ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందన్నారు. కార్పోరేటర్ల, సామ్రాజ్య వాదుల అమానవీయ దాడులను వ్యతిరేకించాలన్నారు. తప్పనిసరి యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొని నిరసన తెలియజేయాలన్నారు. శిలాజ ఇంధన దహనాలను నిలిపివేయాలని, ఇంధన రవాణపై నియంత్రణ తొలగించాలని, ప్రపంచ ప్రజలను సంక్షోభాల నుండి కాపాడాలన్నారు. యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ పెట్రోల్, డీజిల్ బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మజూపే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొరతలను యుద్ధ ప్రాతిపాదికన నివారించాలని , నిత్యావసర వస్తువుల ధరలను కూడా నియంత్రణలో ఉంచాలన్నారు. ఐక్యరాజ్య సమితి నిబంధనలను ఉల్లంఘించి యుద్ధం చేస్తున్న ట్రంప్, బెంజ్ మెన్లను యుద్ధ నేరస్తులుగా ప్రకటించి శిక్షించాలన్నారు.

ప్రాంతీయ యుద్ధాలతో పాటు 4లేబర్కోట్లు, 3వ్యవసాయ నల్లచట్టాలు, వ్యవసాయ పంటల దిగుమతులపై జీరో టారీఫ్లు (పన్నులు) తదితర దుర్మార్గాలన్నీ అమెరికన్ కార్పోరేట్ల ఒత్తిడి ఫలితాలేనన్నారు. 3కోట్ల జనాభా కలిగిన అమెరికా, కోటిన్నర జనాభా గల ఇజ్రాయేల్, 9 కోట్ల జనాభా కలిగిన ఇరాన్ పై యుద్ధం చేసి 800 కోట్ల మందిని, ప్రపంచ సంపదను వారి ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలని చూస్తున్నారన్నారు. 150కోట్ల జనాభా కలిగిన మనదేశ పాలకులు (మోడీజి) యుద్ధ నియంత్రణకు చిత్తశుద్ధితో గట్టి కృషి చేయాలన్నారు. 2019-20 కోవిడ్ కాలం నాటి ఆర్థిక ఇబ్బందులు రానున్నాయని ప్రధానమంత్రి పార్లమెంట్లో ప్రకటించారని , ఇది ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపటానికేన్నారు. పేదలపైన, కార్మికులపైన ఆర్థికదాడి తీవ్రం కానుందని,బి కష్టాలు పెరగనున్నాయన్నారు. మానవతావాదులు, యుద్ధ వ్యతిరేకులు ఏప్రిల్ 4వ తేదిన జరిగే శాంతి ర్యాలీలో స్వచ్ఛందగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, నెల్లూరి నాగేశ్వరరావు, చంద్రారెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేకల మోహన్ రావు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, నాసర్ పాష, రఫీ, రాజేందర్, వెంకటరావు, రాజు, సుధాకర్ లు పాల్గొన్నారు.

# నగరం నడిబొడ్డున అంధకారం


- వెలగని హైమాస్ లైట్లు ప్రజలకు ఇబ్బందులు



**కొత్తగూడెం టౌన్, మార్చి 29 (మనం న్యూస్):** నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన రైల్వే స్టేషన్ మరియు సూపర్ బజార్ కూడలి పరిసరాలు రాత్రి వేళల్లో అంధకారంలో మునిగిపోవడం స్థానికులను, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా వందలాది మంది రోజూ రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో హైమాస్ లైట్లు పనిచేయకపోవడం శోచనీయంగా మారింది. కొత్తగూడెంకు ముఖ్య ద్వారంగా భావించే రైల్వే స్టేషన్ వద్ద రాత్రి సమయంలో సరైన వెలుతురు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. హైమాస్ లైట్లు వెలిగితే నగరానికి మరింత అందం చేకూరుతుందని, భద్రతా పరంగా కూడా ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. కానీ ప్రస్తుతం అవి అలంకారప్రాయంగా నిలిచిపోయాయి. ఇక సూపర్ బజార్ కూడలి విషయానికి వస్తే, ఇది నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ రాత్రి వేళల్లో హైమాస్ లైట్లు పనిచేయకపోవడంతో చీకటి రాజ్యమేలుతోంది. ప్రధాన రహదారిపై తిరిగే ఆటోలు, కార్లు, లారీల హెడ్లైట్లే ప్రయాణికులకు మార్గదర్శకంగా మారడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. స్థానిక ప్రజలు చెబుతున్నదేమిటంటే, ఈ సమస్య కారణంగా రాత్రి సమయంలో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని, మహిళలు, వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. అదేవిధంగా వ్యాపారులు కూడా తమ వ్యాపారాలకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడిన మున్సిపాలిటీ పాలకవర్గం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. మేయర్ గారు చొరవ తీసుకుని వెంటనే హైమాస్ లైట్లు మరమ్మతులు చేయించి తిరిగి వెలిగేలా చర్యలు చేపడితే, రైల్వే స్టేషన్ పరిసరాలు మరియు సూపర్ బజార్ కూడలి ప్రాంతం మళ్లీ ప్రకాశవంతంగా మారి ప్రజలకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నగరం నడిబొడ్డున నెలకొన్న ఈ అంధకారం సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం


### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన మధుయాష్కీ గౌడ్



**రంగారెడ్డి, మార్చి 29 (మనం న్యూస్):** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు తమ ఆర్థిక ఇబ్బందుల రిత్యా మధుయాష్కీ ని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. 23 మందికి మొత్తం రూ. 17,20,000 ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయించారు. ఆదివారం హయత్ నగర్ టీ నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, చెన్నగోని రవీందర్ గౌడ్, బుడ్డ సత్యనారాయణ, కుట్ల నర్సింహ యాదవ్, లింగాల కిషోర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ ఎల్బీనగర్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## సుక్మా జిల్లాలో ఎన్ కౌంటర్



- రూ. 5 లక్షల రివార్డు కలిగిన మావోయిస్టు మృతి

**చర్ల, మార్చి 29 (మనం న్యూస్) :** ఆపరేషన్ కగార్ ముగింపు దశకు చేరుకున్న వేల ఛత్తీస్గఢ్ అడవులు మరోమారు దద్దరిల్లాయి. సుక్మా జిల్లా పోలంపల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం అందడంతో భద్రతా బలగాలు కూంబింగ్ ప్రారంబించాయి. ఆదివారం ఉదయం ఇరు వర్గాలు తారసపడటంతో ఉదయం నుండి మద్యాహ్నం వరకు కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం గాలించగా మావోయిస్టు పార్టీ ప్లాటూన్ నెంబర్ 31 కమాండర్ ముచకి కైలాస్ మృతిచెందగా మృతదేహంతో పాటు ఆయుదాన్ని భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. మృతునిపై రూ. 5 లక్షల రివార్డు ఉన్నట్లు సుక్మా జిల్లా ఎస్ పి కిరణ్ చవాన్ తెలిపారు. ఎన్ కౌంటర్ విషయమై బస్తర్ ఐజి సుందర్ రాజ్ స్పందిస్తూ మావోయిజం చివరి దశలో ఉన్నందున పునరావాస పదకాన్ని సద్వినియోగం చేసుకొని లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# నిరాదరణకు గురై..అయిన వాళ్లకు దూరంగా

- ఇద్దరు కుమార్తెలతో మహిళ పోరాటం
- రెండు నెలలుగా కొత్తగూడెం బస్టాండ్ లో ఆశ్రయం
- సోషల్ మీడియా వేదికగా బయటపడ్డ ఒంటరి మహిళ దీనస్థితి
- స్పందించిన చైల్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సాధిక్ పాషా



**లక్ష్మీదేవిపల్లి మార్చి 29 (మనం న్యూస్):** అయిన వాళ్ళందరూ ఉన్నారు కానీ నిరాదరణకు గురై ఒంటరిగా పోరాడుతూ తన ఇద్దరు కుమార్తెలను సాదుకుంటుంది ఓ మహిళ ఆయన వాళ్ళను కాదని ఊరు కాని ఊరు వచ్చి రెండు నెలలుగా బస్టాండ్ పరిసరాలలో ఆశ్రయం పొందుతూ యాచకం చేసుకుంటూ వచ్చిన డబ్బులతో తన కుమార్తెల కడుపు నింపుతోంది ఆ తల్లి. అయిన వాళ్లందరూ కసాయి వాళ్ళయి తిరగబడితే చేసేదేమి లేక పొట్ట చేత పట్టుకొని తన కడుపున పుట్టిన పిల్లలను వెంట తోలుకొని ఆంధ్ర నుంచి తెలంగాణకు పయనమైంది ఆ తల్లి. రెండు నెలలుగా కొత్తగూడెం బస్టాండ్ పరిసరాల్లో ఆశ్రయం పొందుతున్న సదరు మహిళతో పాటు ఆమె ఇద్దరు మైనర్ బాలికల వివరాలను స్థానిక పత్రిక విలేకరులు 1098 కి పిర్యాదు చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో విషయం కాస్త బయటకు వచ్చింది వారి దీనస్థితిని చూసి చైల్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సాదిక్ పాషా స్పందించారు. వెంటనే బస్టాండ్ కి చేరుకుని వారికి ఓదార్పునిచ్చారు.

**స్పందించిన సాదిక్ పాషా..**

ఒంటరి మహిళగా బతుకు బండిని ఈడుస్తూ భారమైన కన్నీటి గాథతో సదరు మహిళ దీనస్థితిని చూసి చైల్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ మహమ్మద్ సాదిక్ పాషా స్పందించారు. ప్రస్తుత సమాజంలో నేను నా కుటుంబం బాగుంటే చాలు అని అనుకుంటున్నా ఈ తరుణంలో ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించి వారికి ఏదో ఒక న్యాయం చేయాలని ఉద్దేశంతో సాదిక్ పాషా ప్రత్యేక కృషి చేస్తున్నారు. తన వంతు సాయంగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న విషయాన్ని తెలుసుకుని చైల్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ భానోత్ సందీప్ తో కలిసి ఆదివారం కొత్తగూడెం బస్టాండ్ కు చేరుకున్నారు. బాధిత మహిళతో ఇద్దరు మైనర్ పిల్లలతో మాట్లాడి వారి వివరాలను సేకరించారు.

**సఖి కేంద్రానికి తరలింపు..**

కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో ఉన్న మహిళతోపాటు ఆమె ఇద్దరు పిల్లల గురించి తెలుసుకున్న సాధిక్ పాషా ఆమెను పరామర్శించారు. వారితో మాట్లాడి వెంటనే కొత్తగూడెం సఖీ షెల్టర్ హోమ్ కి తరలించారు. ఆమె ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరం ఆటోనగర్ నివాసులని కుటుంబ సభ్యులచే నిరాదరణకు గురై రెండు నెలల క్రితం బ్రతుకుతెరువు కోసం కొత్తగూడెం వచ్చినట్లు తెలిసింది. పూర్తి విచారణ జరిపేంత వరకు బాలికలను సఖి షెల్టర్ హోమ్ లో తాత్కాలిక వసతి కల్పించామని విచారణలో బాలికలు విజయవాడ నివాసులు అని తేలితే కేసును ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణ జిల్లా చైల్ వెల్ఫేర్ కమిటీకి బదిలీ చేస్తామని సాధిక్ పాషా స్పష్టం చేశారు.

## జగ్గంపేటలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జగ్గంపేట మార్చి 29(మనం న్యూస్)ః ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా జగ్గంపేట లో ఉన్న టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం నాయకులతో కలిసి టిడిపి జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. 44 సంవత్సరాలగా టిడిపిలో కొనసాగుతున్న ఎనిమిది మంది కార్యకర్తలను, నియోజవర్గంలో బెస్ట్ పర్ఫామెన్స్ ఇస్తున్న నాయకులను, నియోజవర్గంలోని 300 మంది టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు.. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం లోని 4 మండలాల నుంచి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లు అరెస్టు,6150/- రూపాయలు స్వాధీనం



జగ్గంపేట, మార్చి 29(మనం న్యూస్)ః కాకినాడ జిల్లా జగ్గంపేట శివారు రహస్యంగా ఆడుతున్న పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జగ్గంపేట శివారున రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు కి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు, ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి 6 వేల 150 రూపాయలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని,వీరిపై కేసు నమోదు చేసి రేపు కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

## సామాన్యుడుకి అధికారం... గ్రామ అభివృద్ధి..




శంఖవరం మార్చి 29 మనం ప్రతినిధిః శంఖవరం మండలం కత్తిపూడి మేజర్ పంచాయితీ అయిన సుమారు 20 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామం. సుమారు 9 వేలకు పైగా ఓటరులను కలిగిన మండలంలోనే అతిపెద్ద గ్రామం. అలాంటి గ్రామంలో గత పంచాయతీ ఎన్నికలలో బిసి రిజర్వేషన్ రావడంతో అప్పటి స్థానిక శాసనసభ్యులు పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ గారు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో పలుమార్లు సమావేశపరచి రాజకీయ అనుభవం లేకున్నయాదవ్ కుటంబం నుండి యువకుడు, సామాన్యుడు, సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టి గ్రామంలో అందరి ఆశీస్సులతో కొల్లు వెంకట సత్యనారాయణ సర్పంచ్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించడం జరిగింది. గ్రామంలో స్థానిక పెద్దలు, పంచాయతీ కార్యవర్గ సభ్యులతో కలిసి అప్పుడు శాసనసభ్యులు పర్వత ప్రసాద్ గారి సహకారంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, దశబ్దాలు కాలం నుండి కాకినాడ రోడ్డులో వర్షం వస్తే వీధులు, ఇల్లుఆ వర్షపు మురుగు నీటితో దర్శనం ఇచ్చేవి.రోజులు, తరబడి అనేక వ్యాధులు బారినపడుతూ ఉండటాన్ని గమనించిన సర్పంచ్ వారి ఇబ్బందులు శాసనసభ్యులు వారి దృష్టికి తీసుకువెళ్లి సుమారు 60 లక్షల రూపాయలతో గ్రామం చివరి వరకూ డ్రైను నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించడం జరిగింది. గ్రామంలో పంతం వారి మెట్టపై, దొరచెరువు పలు ప్రాంతాల్లో మంచినీటికి సమస్యను 1 కోటి 20 లక్షలతో కొత్త వాటర్ ట్యాంక్స్ నిర్మించి ఆ ప్రాంతంలో ప్రజలు దాహాన్ని తీర్చడం జరిగింది. ఇంటిఇంటికి కుళాయిలు కలెక్షన్ ఏర్పాటు చేసి ప్రజలకు మంచి చేయడం జరిగింది. నాడు నేడు ద్వారా గ్రామంలో ఉన్న మూడు స్కూల్స్ ని అభివృద్ధి చేసి విద్యార్థులు ఎదురుకొంటున్న పలు సమస్యలు పరిష్కరించారు. విద్యావవస్థపై ద్రుష్టి సారించి హైస్కూల్ కొత్తభవనం నిర్మాణానికి ముందడుగు వేసి అధికారులు, శాసనసభ్యులు వారికి విన్నవించి కొత్త భవన నిర్మాణానికి సుమారు 60 లక్షల రూపాయలు గ్రాంట్ ఇచ్చేందుకు ప్రభుత్వ అనుమతులు పొంది విద్యార్థులుకు అందుబాటులో ఉండేవిధంగా నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగింది. గ్రామంలో తమ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ గ్రామాన్ని శుభ్రంగా ఉండేటట్లు ప్రణాళికతో ముందుకు సాగరు. గ్రామంలో అవసరమైనా చోట డ్రైనేజీ, సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టి ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను తీర్చారు.

## ప్రయాణాలలో జాగ్రత్తలు పాటించాలి

**• ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు**



భీమవరం, మార్చి 29 మనం న్యూసః రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి బాధితులకు సహాయ సహకారాలను అందించడం గొప్ప విషయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఇటీవల భీమవరంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఆబోతుల యాశ్వంత్ కు సంస్కార్ స్కూల్ డైరెక్టర్ నందమూరి రాజేష్, ఆయన మిత్రులు కలిసి లక్ష 50 వేల రూపాయలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా యశ్వంత్ కుటుంబ సభ్యుల కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయని ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అతి వేగం ప్రమాదకరమని అన్నారు. ఇంటర్ చదువుతున్న యాశ్వంత్ రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలవడం బాధాకరమని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో దాత నందమూరి రాజేష్, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి, ఏపీఐఐసీ డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం



యు- కొత్తపల్లి మార్చి 29 ( మనం న్యూస్) తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ ఆదేశాలతో అనిశెట్టి సురేందర్ రెడ్డి ( సురేష్ రెడ్డి) ఆధ్వర్యంలో మండలంలోని కొత్త ఇసుకపల్లి గ్రామంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారూ రంభించారు. అనంతరం గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు భారీగా పాల్గొని కేకను కట్ చేసి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పెద్దలకు అల్పాహారం ఏర్పాటు చేయగా, విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు, పెన్సిల్లు పంపిణీ చేసి విద్యాపట్ల ప్రోత్సాహం కల్పించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, రాష్ట్ర అభివృద్ధిలో టిడిపి కీలక పాత్ర పోషించిందని తెలిపారు.భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు

## గొల్లప్రోలులో ఘనంగా టిడిపిపార్టీ ఆవిర్భావ దినోత్సవం



గొల్లప్రోలు, మార్చి 29 (మనం ప్రతినిధి)ః మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ పరిధి మెయిన్ రోడ్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు విగ్రహం వద్ద ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండ్రా సుబ్బారావు ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలలంకరించి నివాళులర్పించారు అనంతరం కొత్తపేట ఎస్సీ పేట కరణం గారి తోట వివిధప్రాంతాలలోగొల్లప్రోలు తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆ పార్టీఆవిర్భావవేడుకలను పురస్కరించుకొనిటపాసులు పేల్చి మిఠాయిలు.పంచుకున్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చేదులూరి మాణిక్యం తాపీ మేస్త్రి సత్యనారాయణ బస సత్యనారాయణ గండే నాగేశ్వరావు యాళ్ల నాగు సిద్ధ సూరిబాబు మనోహర్ ఉమ్మడి భూషణం గుండ్ర జగ్గారావు అనిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే చరిత్ర సృష్టించిన పార్టీ తెదేపా



**• జిల్లా పార్టీ అధ్యక్షుడు రామరాజు**

భీమవరం, మార్చి 29 (మనం న్యూస్)ః తెలుగుదేశంపార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఆదివారం స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్, ప.గో.జిల్లా తెదేపా అధ్యక్షుడు మంతెన రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ 44 సంవత్సరాలుగా పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా జెండా వదలకుండా పోరాటాలు చేసిన కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని మోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సాపురం పార్లమెంటులోని అన్ని గ్రామాలు, వార్డులలో పార్టీ జెండాలను స్థానిక కమిటీల నాయకులు ఆవిష్కరించి ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నా మని తెలిపారు.నరసాపురం పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాలలో పార్టీకి అంకితభావంతో పనిచేసిన 96 మంది కార్యకర్తలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తెదేపా కార్యవర్గ సభ్యులు, నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర ప్రగతి

**• తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు**



నరసాపురం, మార్చి 29 (మనం న్యూస్)ః తెలుగుదేశం పార్టీ కేవలం ఒక రాజకీయ వేదిక మాత్రమే కాదని ఇది కోట్ల మంది తెలుగు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని ఈ పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని ప్రజల కోసం నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తుందని నరసాపురం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం స్థానిక నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని తెదేపా వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లని నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ తెలుగు దేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరి బాబ్జి, పార్టీ మండల అధ్యక్షుడు వాతాడి ఉమామహేశ్వరరావు, నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, గుబ్బల నాగరాజు, అందే రామకృష్ణ, సంకు భాస్కర నాయుడు, సత్తినేని బాబ్జి, భూపతి నరేష్, సంకరపు వెంకటేశ్వర్లు, పాలా రాంబాబు, దొంగ పద్మారావు, మావూరి ఆనంద్ కుమార్, నక్క ఆనంద బాబు, యర్రంశెట్టి నాగేశ్వరావు, ఎండి మౌలాలి ఖాన్, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికుడి కుటుంబానికి జనసేన పార్టీ రూ.లక్ష ఆర్థిక సహాయం



గండేపల్లి , మార్చి 29 (మనం న్యూస్)ః జగ్గంపేట కదా 15రోజుల క్రితం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రీమియర్ షోకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామానికి చెందిన జనసైనికుడు కాపు శెట్టి షణ్ముఖ చంద్రశేఖర్ దుర్మరణం చెందారు.ఈ సందర్భంగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ,షణ్ముఖ చంద్రశేఖర్ లాంటి అంకితభావం కలిగిన జనసైనికుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. వారి బాధలో భాగస్వాములమై, అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటాం అని తెలిపారు.అలాగే మృతుడి తల్లిదండ్రులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు జనసేన పార్టీ తరఫున రూ.1,00,000 నగదును తుమ్మలపల్లి రమేష్ స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సూరంపాలెం బాలు, మేడిబోయిన శ్రీను, గోన శివ, గవర సుధాకర్, రామకుర్తి నరసింహ,రామకుర్తి బ్రహ్మాజీ,గంధం ప్రభాకర్, ఎలుబండి శివ, మరిసే రామకృష్ణ,గొల్లవిల్లి వీరబాబు,మాదారపు వీరబాబు,గొల్లవిల్లి శ్రీదేవి,స్వామి, గుంటముక్కల చిన్న,గోకేడ రమణ, శ్రీను స్థానిక జనసేన నాయకులు, జనసైనికులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని షణ్ముఖ చంద్రశేఖర్కు ఘనంగా నివాళులు అర్పించారు.

## అనుమతి లేకుండా వేప చెట్టు నరికివేతపై ప్రజలు ఆగ్రహం



అమలాపురం మనం న్యూస్ మార్చి 29ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలోని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డీఏ భవనం వద్ద ఉన్న పురాతన వేప చెట్టును అనుమతులు లేకుండా నరికివేయడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానికుల కథనం ప్రకారం, ఇరిగేషన్ విభాగానికి చెందిన డీఈ ఆధ్వర్యంలో ఎలాంటి ముందస్తుఅనుమతులు లేకుండానే ఈ చెట్టును నరికివేశారని ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై స్థానిక ఎమ్మార్వోను సంప్ర దించగా, తమ దృష్టికి ఈ విషయం రాలేదని తెలిపారు, అయితే ఈ విషయంపై పత్రిక ప్రతినిధులు ఇరిగేషన్ డీఈను ప్రశ్నించగా, ఎవరిని అడగాల్సిన అవసరం లేదు, నా పరిధిలోనే ఉండటంతో నేనే నరికించాను అన్నట్లుగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అనుమతి లేకుండా చెట్లు నరికివేయడం చట్ట విరుద్ధమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికే ఈ ఘటనపై పత్రికల్లో కథనాలు వెలువ డుతుండగా,సంబంధిత అధికారులు స్పందించి పూర్తి వివరాలు వెల్ల డించాలని ప్రజలు కోరుతున్నారు.

## మట్టలతో ముస్తాబైన నతానియేలు దేవాలయం

**• గుమ్ములూరు చినపేటలో ఆధ్యాత్మిక సందడి**



పోడూరు, మార్చి 29 మనం న్యూసః పోడూరు మండలంలోని గుమ్ములూరు గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నపేటలో మట్టల ఆదివారం సందర్భంగా పరిశుద్ధ నతానియేలు దేవాలయం ఆధ్యాత్మిక కాంతితో మెరిసింది. పరిశుద్ధ నతానియేలు లూథరన్ దేవాలయాన్ని పచ్చని మట్టలతో అద్భుతంగా అలంకరించడంతో భక్తులందరి దృష్టిని ఆకర్షించింది. ఈ అలంకరణ గ్రామానికి ప్రత్యేక శోభను తెచ్చింది. అలాగే మట్టల ఆదివారం సందర్భంగా సండే స్కూల్ పిల్లలు, స్త్రీల సమాజం, సంఘ పెద్దలు కలిసి మట్టలు చేతబట్టి గ్రామ వీధుల్లో ఘనంగా సహభరితంగా ఊరేగారు. కీర్తనలు, ప్రార్థనలు మధ్య సాగిన ఈ ఊరేగింపు గ్రామమంతా భక్తి భావాన్ని నింపింది.చిన్నపిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. యేసుక్రీస్తు సందేశం - యెరూషలేము సంఘటన. మట్టల ఆదివారం క్రైస్తవులకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజు.ఈ రోజు యేసుక్రీస్తు యెరూషలేము నగరంలో గాడిదపై ప్రవేశించిన సంఘటనను స్మరించుకుంటారు. ఆయన రాకను ఆనందంగా స్వాగతించిన ప్రజలు మట్టలు ఊపుతూ హోషన్నా జయము, జయము అంటూ ఘనంగా ఆహ్వానించారు. ఈ సంఘటన వినయం, ప్రేమ, శాంతి సందేశాలకు ప్రతీకగా నిలిచింది. యేసుక్రీస్తు తన జీవితం ద్వారా క్షమ, దయ, సేవ అనే విలువలను మానవాళికి బోధించారు. అదే సందర్భాన్ని పురస్కరించుకుని గుమ్ములూరు గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న పేట లో మట్టల ఆదివారం వేడుకలు భక్తి, ఐక్యత, ఆనందంతో ఘనంగా నిర్వహించబడి విజయవంతంగా ముగిశాయి.

## శ్రీ పార్వతీ పరమేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా జక్కంపూడి కుమార్



పాలకొల్లు, మార్చి 29,మనంప్రతినిధిః పాలకొల్లుకు చెందిన బిజెపి జిల్లా నాయకులు జక్కంపూడి లక్ష్మీ నరసింహ నాగేంద్ర కుమార్( కుమార్ ) బెంగళూరుకు చెందిన శ్రీ పార్వతి పరమేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ రావెళ్ల రామకృష్ణ నియామక ఉత్తర్వులు పంపారు. ఆధ్యాత్మిక , సేవా, కళ, రాజకీయ రంగాలతో పాటు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి కుమార్. ఆయన విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డి ఆర్ యు సి సి మెంబర్ గా, పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గా, పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కన్స్ట్రక్షన్ కమిటీ చైర్మన్ గా, భారతీయ జనతా పార్టీ పోడూరు మండలం ఇంచార్జ్ గా యునైటెడ్ క్లబ్ ఫౌండర్ గా,మానవత క్షీరా రామ సేవాసమితి ధర్మ పరిరక్షణ సమితి, రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు, ఘంటసాల కళాపరిషత్ వంటి అనేక సంస్థల్లో ముఖ్య పదవులు నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ పాక సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి, అల్లు వెంకట సత్యనారాయణ, పాలకొల్లు చాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహమూర్తి, అయినంపూడి శ్రీదేవి, నారిన తాతాజీ, కొల్లి కొండ ప్రసాద్, కెవి కృష్ణ వర్మ,మేడికొండ శ్రీనివాస్ చౌదరి, గాది వెంకన్న, సీరం ఆనంద్ కృష్ణ తదితరులు అభినందనలు తెలియజేశారు.









## మళ్లీ రింగ్‌లోకి మేరీ కోమ్..

భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ మళ్లీ రింగ్ లో అడుగుపెట్టనుంది. వీడ్కోలు పలికిన మణిపూర్ మణిపూస ఇకపై ప్రొఫెషనల్ బాక్సింగ్ లో చెలరేగాలని భావిస్తోంది. వయోపరిమితి కారణంగా అమెచ్చూర్ బాక్సింగ్ లో పోటీ పడేందుకు అవకాశం లేనందున ప్రొషెషన్ బాక్సింగ్ మీద కన్నేసినట్టు ఆమె తెలిపింది. ఆదివారం ఫిట్ ఇండియా 67వ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ విషయాన్ని ధ్రువీకరించింది.

మహిళా బాక్సింగ్ లో లెజెండ్ గా పేరొందిన మేరీ కోమ్ కొత్త ఇన్నింగ్స్ ఆరంభించనుంది. కొన్నాళ్లుగా బాక్సింగ్ కు దూరమైన ఆమె త్వరలోనే ప్రొఫెషనల్ బాక్సింగ్ లో మెరవాలని భావిస్తోందీ ఒలింపిక్ కాంస్య పతక విజేత. 'ఆరుసార్లు వరల్ ఛాంపియన్ షిప్ గెలుపొందడం చాలా గొప్ప విషయం. వయోపరిమితి కారణంగా దేశం తరపున అమెచ్యూర్ బాక్సింగ్ ఆడే అవకాశం లేని పరిస్థితి.

ఈ సమయంలో నాముందున్న ఆప్షన్ ప్రొఫెషనల్ బాక్సింగ్. ప్రస్తుతం ఈ ఆట గురించి ఆలోచిస్తున్నా. ఈ వయసులోనూ నాలో చేవ తగ్గలేదని ప్రపంచానికి చాటాలనుకుంటున్నా. వయసుతో సంబంధం లేకుండా సాధ్యమైనన్ని రోజులు ఫిట్ గా ఉండాలని అనకుంటున్నా అని 43 ఏళ్ల మేరీకోమ్ వెల్లడించింది.

# రెచ్చిపోయిన రహానే..



### • కేకేఆర్ భారీ స్కోర్

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్ పై కేకేఆర్ భారీ స్కోర్ చేసింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరుగిన ఈ మ్యాచ్లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

**రెచ్చిపోయిన రహానే**

కేకేఆర్ కెప్టెన్ రహానే లేటు వయసులో రెచ్చిపోయి, కేకేఆర్ కు మెరుపు ఆరంభాన్ని అందించాడు. కేవంల 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అతను.. మొత్తంగా 40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు చేశాడు. రహానేకు జతగా ఓపెనింగ్ చేసిన ఫిన్ అలెన్ కూడా చెలరేగిపోయాడు. కేవలం 17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు చేశాడు.

## విజయాల బాటలో కేరళ, సి.ఐ.ఎస్.ఎఫ్ జట్లు



హైదరాబాద్‌లో కొనసాగుతున్న 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో ఆదివారం గోల్స్ సునామీ నమోదైంది. అఖిల భారత స్థాయి పోలీస్ క్రీడాకారుల మధ్య జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో మహిళల విభాగంలో సి.ఐ.ఎస్.ఎఫ్. జట్టు రికార్డు స్థాయి ప్రదర్శనతో అదరగొట్టింది. జార్ఖండ్‌తో జరిగిన ఏకపక్ష పోరులో సి.ఐ.ఎస్.ఎఫ్ ఏకంగా 20-0 గోల్స్ తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించి అజేయంగా నిలిచింది. ఇదే విభాగంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఒడిశా జట్టు 6-1తో మణిపూర్‌పై ఘన విజయం సాధించింది.పురుషుల విభాగంలోనూ జట్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. జాతీయ స్థాయిలో బలమైన జట్టుగా పేరున్న కేరళ, కర్ణాటకను 7-0 గోల్స్ తేడాతో చిత్తు చేసి తన సత్తా చాటింది. మహారాష్ట్ర జట్టు సైతం జార్ఖండ్‌పై 6-1తో స్పష్టమైన విజయాన్ని అందుకుంది. అలాగే మిజోరం 2-0తో ఎస్.ఎస్.బి పై గెలవగా, త్రిపుర జట్టు 2-0తో ఉత్తరాఖండ్‌ను ఓడించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మణిపూర్ 2-1తో బి.ఎస్.ఎఫ్ పై పైచేయి సాధించింది. కాగా, సి.ఐ.ఎస్.ఎఫ్, సిక్కిం జట్ల మధ్య జరిగిన పోరులో ఇరు జట్లు గోల్స్ చేయలేకపోవడంతో మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది.



## ఐపీఎల్ చరిత్రలో.. తొలి బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ రికార్డు

ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్ లోనే విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ సాధించాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. 202 పరుగుల లక్ష్య ఛేదనలో 69 రన్స్ చేసి నాటౌట్ గా నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే తొలి బ్యాటర్ గా అవతరించాడు. ఛేదనలో 4వేలకుపైగా పరుగులు చేసిన బ్యాటర్ గా నిలిచాడు. ఇక టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆరో బ్యాటర్ గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆటగాడు షోయబ్ మాలిక్ ను కోహ్లీ అధిగమించాడు. మాలిక్ 557 మ్యాచుల్లో 13,571 పరుగులు చేయగా.. విరాట్ 415 మ్యాచుల్లోనే 13,612 పరుగులు సాధించాడు.

## మాఫియా నేపథ్యంలో చిరంజీవి పాత్ర?



మెగాస్టార్ చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్ లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా పై ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా సెకండ్ హాఫ్ లో ఓ యాక్షన్ ఫ్లాష్ బ్యాక్ ను డిజైన్ చేశారని.. ఈ ఫ్లాష్ బ్యాక్ లో భారీ మాస్ సీక్వెన్స్ ఉంటాయని.. అందుకు తగ్గట్టు.. చిరు పాత్ర పై చుట్టూ ఓ బలమైన డ్రామాను కూడా ప్లాన్ చేశారని తెలుస్తోంది. అన్నట్టు ఈ ఫ్లాష్ బ్యాక్ లో మెగాస్టార్ పాత్ర మాఫియా నేపథ్యంలో ఉంటుందట.

మొత్తానికి ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవిని పూర్తిస్థాయి మాస్ అవతార్ లో చూపించనున్నారు. పైగా ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని ఓగ్రా ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్ లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.

## సింగర్ నుంచి ఐటమ్ డ్యాన్సర్‌గా..

పాటలు పాడే సింగర్స్ మహా అయితే మ్యూజిక్ డైరెక్టర్స్ అవుతారు. కొన్నిసార్లు మాత్రం ఊహంచని సర్ ప్రైజ్ ఇస్తుంటారు. లేటెస్ట్ గా ఓ తెలుగు గాయని.. ఐటమ్ సాంగ్ లో గ్లామరస్ డ్యాన్స్ చేసి అదరగొట్టింది. ఆమెనే జోనితా గాంధీ. తెలుగు ప్రేక్షకుల్లో కొందరికి ఈమె గురించి తెలుసు. అయితే ఈమె నుంచి అదిరిపోయే డ్యాన్స్ చూసి మాత్రం ఆశ్చర్యపోయారు. ఇంతకీ ఈమె ఎవరు? డీటైల్స్ ఏంటి? జోనితా గాంధీ ఢిల్లీలో పుట్టింది. ఈమెకు 9 నెలల వయసున్నప్పుడే కుటుంబమంతా కెనడా వెళ్లిపోయింది. తర్వాత అక్కడే సెటిలైపోయారు. దీంతో చదువంతా అక్కడే పూర్తి చేసింది. ఏడేళ్లు ఉన్నప్పుడే పాటలు పాడటం లాంటివి చేసింది. తర్వాత కొన్నేళ్లకు తన పాడిన పాటల్ని యూట్యూబ్ లో అప్ లోడ్ చేసేది. వాటికి మంచి రెస్పాన్స్ వస్తుండేసరికి పాడటాన్ని కెరీర్ గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. కొన్నాళ్లకు భారత్ కి తిరిగొచ్చింది. జోనితాలోని ప్రతిభని గుర్తించిన బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్-శేఖర్.. షారూఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్ ప్రెస్' టైటిల్ సాంగ్ పాడే అవకాశం కల్పించారు. తొలి పాటే ఎస్పీ బాలసుబ్రమణ్యం లాంటి ప్రసిద్ధ గాయకుడితో కలిసి పాడేసరికి జోనితాకు ఫేమ్ వచ్చింది. తర్వాత ఏఆర్ రెహమాన్, ప్రీతమ్, అమిత్ త్రివేది తదితర సంగీత దర్శకులు కంపోజ్ చేసిన సాంగ్స్ పాడింది.






అనిరుధ్ తో కలిసి ఈమె పాడిన కావాలయ్యా, అరబిక్ కుతు లాంటి పాటలు సెన్సేషన్ సృష్టించాయి. 'కిక్ 2' మూవీలోని నువ్వే నువ్వే ప్రాణం పాటతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. లవ్ స్టోరి, సర్కారు వారి పాట తదితర చిత్రాల్లో సాంగ్స్ పాడింది. ఓవరాల్ గా చూస్తే తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్ లో పాటలు పాడి మెప్పించింది. ఇన్ స్టాలో 28 లక్షల ఫాలోవర్స్ ఉన్న ఈమె.. లైవ్ కన్సరట్స్ తోనూ సంగీత ప్రియుల్ని ఎంటర్ టైన్ చేస్తూనే ఉంది. ఇన్నాళ్లు సింగర్ గా అందరికీ తెలిసిన జోనితా గాంధీ.. అడివి శేష్ 'డకాయిట్' కోసం తొలిసారి ఐటమ్ సాంగ్ లో డ్యాన్స్ చేసింది. అందచందాలతో ఆశ్చర్యపరిచింది. చూస్తుంటే సింగర్ గా ఏమో గానీ డ్యాన్సర్ గా మాత్రం మరింత బిజీ అవుతుందేమో అనిపిస్తుంది. ఈమె నటించిన తమిళ సినిమా 'వాకింగ్ టాకింగ్ స్ట్రాబెర్రీ ఐస్ క్రీమ్' విడుదల కావాల్సి ఉంది.

# ధురంధర్

## ఆదాయంలో మాకూ కొంత ఇవ్వాలి: ల్యారీ ప్రజల డిమాండ్



ఆదిత్యధర్ దర్శకత్వంలో రణ్ వీర్ సింగ్ కథానాయకుడిగా నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్'. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. కరాచీలోని ల్యారీ నగరం నేపథ్యంగా దీన్ని తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. అక్కడి ఉగ్ర మూలాలను పెకలించడానికి భారత్ చేపట్టిన 'ఆపరేషన్ ధురంధర్'లో భాగంగా కథానాయకుడు చేసిన సాహసాలే ఈ చిత్ర కథ.

'ధురంధర్' చిత్రాలు విజయవంతమైన నేపథ్యంలో ల్యారీ వాసులు సరికొత్త డిమాండ్ ను తెరపైకి తీసుకొచ్చారు. 'ధురంధర్2' ఆదాయంలో కొంత మొత్తం ల్యారీ అభివృద్ధికి కేటాయించాలని కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ల్యారీ పేరును వాడుకొన్నందుకు ఆ ప్రాంతానికి కూడా ఆర్థికంగా ప్రయోజనం ఉండాలని వారు కోరుతున్నారు. ఈ చిత్రం వసూలు చేస్తున్న వందల కోట్లలో కొంత మొత్తాన్ని ప్రజా సంక్షేమానికి మళ్లించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది.

## బాలయ్య సినిమాలో బోల్డ్ బ్యూటీ?



బాలయ్య బాబు - గోపీచంద్ మలినేని కలయికలో రాబోతున్న సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఐతే, ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో బోల్ బ్యూటీ లక్ష్మీ రాయ్ కీలక పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్ గా నయనతార నటిస్తోంది. మరి లక్ష్మీ రాయ్ పాత్ర ఏమిటో చూడాలి. ఆమె పాత్ర సెకండ్ హాఫ్ లో వస్తోందని.. ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యత ఉంటుందని టాక్ నడుస్తోంది. అన్నట్టు గతంలో లక్ష్మీ రాయ్ - బాలయ్య కలిసి అధినాయకుడు అనే సినిమాలో కలిసి నటించారు. కాగా సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పీరియాడిక్ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమా గురించి గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా ఆ మధ్య స్పందిస్తూ.. ''గాడ్ ఆఫ్ మాసెస్ ఈజ్ బ్యాక్.. ఈసారి మా గర్జన మరింత గట్టిగా ఉండనుంది. బాలకృష్ణతో కలిసి మరోసారి వర్క్ చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది చరిత్రలో నిలిచిపోయే చిత్రం కానుంది'' అని తన పోస్ట్ లో పేర్కొన్నారు. నందమూరి బాలకృష్ణ నటించనున్న 111 ప్రాజెక్ట్ ఇది.

## టీజర్‌తో ఆకట్టుకుంటున్న 'అనకాపల్లి'!

విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'అనకాపల్లి'. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కాగా తాజాగా ఈ సినిమా టీజర్ విడుదల అయింది. ఈ టీజర్ చాలా బాగా ఆకట్టుకుంది. ఒక ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాను ఈ టీజర్ లో బాగా ఎస్టాబ్లిష్ చేశారు. విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్ మరియు పవర్ ఫుల్ యాక్టింగ్ తో మెప్పించాడు. అలాగే, విక్రమ్ తో పాటు సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప కీలక పాత్రల్లో కనిపించారు. దర్శకుడు త్రినాథరావు నక్కిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే అందించగా, ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. నక్కిన నరేటివ్స్ మరియు భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాంట్రేగుల సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ టీజర్ కి డావ్ జాండ్ సంగీతాన్ని అందించారు. టీజర్ చివర్లో మేకర్స్ ప్రకటించినట్లుగా ఈ మూవీని 'సమ్మర్ 2026' కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరి ఈ సినిమా ఎలా ఉండబోతుందో చూడాలి.





## 'కల్కి 2' సెట్స్‌లో భైరవ జాయినింగ్ పై లేటెస్ట్ బజ్!

ప్రస్తుతం పాన్ ఇండియా ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పలు క్రేజీ సీక్వెల్ సినిమాల్లో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా చేయనున్న సీక్వెల్ చిత్రాల్లో ఒకటి కల్కి 2 కూడా ఉంది. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ భారీ సినిమా సీక్వెల్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. దిగ్గజ నటులు కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లు షూట్ లో పాల్గొన్నారు. అయితే వీరి తర్వాత ఫైనల్ గా భైరవ సెట్స్ లో ఎపుడు అడుగు పెడతాడు అనేది తెలుస్తోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఈ ఏప్రిల్ 10 నుంచి డార్లింగ్ హీరో జాయిన్ కాబోతున్నట్టు తెలుస్తోంది. మరి అక్కడ నుంచి ఎన్ని రోజులు ఈ షూట్ ఉంటుంది అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం అయితే హను రాఘవపూడి, సందీప్ రెడ్డి వంగాల సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక కల్కి 2 ప్రభాస్ ఎప్పటికి పూర్తి చేస్తాడో చూడాలి.

# పార్టీ కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా మారాలి


- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి
- మండల కేంద్రం లో ధనియాకుల గురువయ్య స్మారక భవన నిర్మాణానికి శంకుస్థాపన



**పెన్ పహాడ్, మార్చి 29 (మనం న్యూస్):** పార్టీ కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా మారాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు ఆదివారం అమరజీవి కామ్రేడ్ ధనియాకుల గురువయ్య స్మారకార్థం మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన భవనానికి శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు కామ్రేడ్ దన్యాకుల గురువయ్య సాధారణ కార్యకర్త స్థాయి నుండి ఉమ్మడి సూర్యాపేట, తుంగతుర్తి పార్టీకార్యదర్శిగా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేసి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాంతం త్యాగం చేసిన మహానేత అన్నారు ఉమ్మడి నల్గొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో తనదైన శైలితో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాడన్నారు పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు పంచారని, భూస్వాములకు దొరలకు వ్యతిరేకంగా అనేక పోరాటాల ఉద్యమాలు నిర్వహించాడన్నారు మండలంలో సిపిఎం ప్రజాప్రతినిధులను గెలుచుకోవడంలో క్రియాశీల పాత్ర పోషించాడని గురవయ్య నాయకత్వంలో పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేని నాటి కాంగ్రెస్ నరహంతక ముఠా ప్రజా సమస్యపై సూర్యాపేటలో విద్యుత్ అధికారి ఇంటికి వెళ్లి వస్తున్న క్రమంలో దారి కాచి అత్యంత కిరాతకంగా 1999 ఫిబ్రవరి 11న హతమార్చారన్నారు గురువయ్యను హతమార్చినంత మాత్రాన ప్రజా పోరాటాలు ఆగలేదని ఆయన త్యాగస్ఫూర్తితో ఇప్పటికీ సిపిఎం ప్రజా సమస్యలపై అనేక పోరాట ఉద్యమాలునిర్వహిస్తుందన్నారు తన పేరు మీద మండల కేంద్రంలో నిర్మించే భవనాన్ని పోరాట కేంద్రాంగా మార్చి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నాయని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. బిజెపి దేశంలో మతోన్మాద రాజకీయాలకు పూనుకొని ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రెండున్నర సంవత్సరాల పాలన ప్రజా సమస్యలను పరిష్కరించ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర లేదన్నారు.

రైతులకు యూరియా కరెంటు కష్టాలు తీవ్రమయాయని రైతు భరోసా సకాలంలో అందలేదన్నారు. ఇంకా నిరుపేదలకు ఇల్లు లేవని ఇండ్లను నిర్మించాలన్నారు ఎన్నికల ముందు పెన్షన్ పెంచుతామని , మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసారన్నారు విద్యా వైద్య రంగాలుభ్రష్టుపట్టిపోయాయన్నారు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, మండల కమిటీ సభ్యులు గుర్రం గోపాల్ రెడ్డి, నెమ్మాది అడివయ్యా, మడ్డి అంజిబాబు, నెమ్మాది లక్ష్మమ్మ, పీరయ్య,ఇరుగు రమేష్, బోగరాజ్ శ్రీకాంత్ , చిన పంగి నరసయ్య జానయ్య చారి , నకిరే కంటి నరసయ్య సత్యం వీరస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు...

# టిఆర్పిలో చేరికలు




**సూర్యాపేట టౌన్, మార్చి 29, మనం న్యూస్:** తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రోజురోజుకీ బలపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు టీఆర్పీ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... టీఆర్పీ సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీ అని, ప్రతి కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రైతులు, నిరుద్యోగులు, బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించడంలో టీఆర్పీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. రైతులు, నిరుద్యోగులు, బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించడంలోనూ తమ పార్టీలో చేరికలతో మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో పార్టీ తెలంగాణ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నే మంజుల గౌడ్, బెల్లి అశోక్ యాదవ్, కలింగం యాదవ్, శ్రీను యాదవ్, అనంత చారి, గౌతమ్ గౌడ్ ఉన్నారు.

# లోక్ అదాలత్తో 3890 కేసుల పరిష్కారం

- ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లక్ష్యం



**సూర్యాపేట, మార్చి 29 (మనం ప్రతినిధి):** ఈ నెల 28-03-2026 న జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం మరియు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడినవి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందిని ఆదివారం జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 3890 కేసులు పరిష్కరించబడినవి. ఇందులో యువి. యాక్ట్, డి డి కేసులు : 1845, ఈ-పిఈటిటివై. కేసులు 1463, ఐపిసిసి.కేసులు 498, భి.యస్ ఎల్ కేసులు 84 పరిష్కరించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా ప్రజల సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. అదేవిధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాలు కూడా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని ఎస్పీ అభినందించారు.

# ఉచిత గర్భాశయ కాన్సర్ గుర్తింపు చికిత్స శిబిరం

**అనంతగిరి మార్చి 29 (మనం న్యూస్):** మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో మాజీ సర్పంచ్ కీర్తిశేషులు గద్దె రామారావు జ్ఞాపకార్థం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గర్భాశయ కాన్సర్ గుర్తింపు చికిత్స శిభిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ ఎస్ వి విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దే రఘు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ అనేది అనేక రకాలుగా ఉంటుందని గర్భాశయ క్యాన్సర్ అనేది మహిళలు మాత్రమే వస్తుంది కనుక ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.ఈశిబిరంలో 150 మందికి ఉచితకాన్సర్ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు స్వర్ణభారతి చారిటబుల్



ట్రస్టు అధ్యక్షులు చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్ ను గ్రామ ప్రజలు అభినందించారు ఇట్టి కార్యక్రమంలో డాక్టర్లు ఉష మాధవి విజయలక్ష్మి ఓరుగంటి కిట్టు ఉప సర్పంచ్ కంటు రమాదేవి వార్డు సభ్యులు తమలపాకుల వెంకటేష్ దేవులపల్లి నాగరాజు మాజీ (అఇఖి చైర్మన్ బుర్రావెంకటేశ్వర్లు కొల్లు స్వప్న సుబ్బారావు మురళి రామారావు మురళి నాగేశ్వరరావు వెంకన్న నాగమల్లేశ్వరరావు బిక్షం సుధీర్ అంగన్వాడీ టీచర్ సుజాత నాగేంద్ర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జాన్ పహాడ్ దర్గాలో ఆదివాసి నేషనల్ కోఆర్డినేటర్ పూజలు



**పాలకీడు,మనం న్యూస్ మార్చ్ 29:** మండల పరిధిలోని జాన్ పాడు సైదన్న దర్గాను ఆదివాసి నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహన్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమద ఉత్తంకుమార్ రెడ్డి చేస్తున్న కృషిని మరొకసారి గుర్తు చేశారు ఇప్పటికే ఎన్నో నిధులను కేటాయించి హుజూర్నగర్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని జాన్ పాడ్ సైదన్న దర్గా అభివృద్ధి విషయంలో మరింత నిధులు సమకూర్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మధు నాయక్ ,నాగరాజు, శ్రీమాన్ నాయక్, సాయిరాం ,శంకర్ నాయక్ ,శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రంగారెడ్డి మార్చి 29 (మనం న్యూస్)** సరూర్ నగర్, ఆర్కె పురం , డాక్టర్స్ కాలనీ,, ఎన్టీఆర్ నగర్ డివిజన్ లలో టీడీపీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరూర్నగర్ డివిజన్ హుడా కాలనీ లో పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేతి జగదీష్ రెడ్డి , జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి యాంద్ర లోకేశ్వరరావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పార్టీ బడుగు బలహీనవర్గాల కు ఎన్నో పదవులు ఇచ్చిందని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర టిఎన్టియుసి కార్యదర్శి ఎం వి పి రమేష్ బాబు, మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్య పోగురాజశేఖర్, డివిజన్ సీనియర్ నాయకులు ఆకారం విజేందర్,సుంకరి సత్తయ్యగౌడ్, స్వాతి , యాంద్ర కల్పన,దామోదర్ రావు,బోయపాటి వెంకటేష్ గౌడ్,మహేశ్వర్ రెడ్డి,రాములు,ఠాగూర్, ఈశ్వరమ్మ.పాల్గొన్నారు

# జిలుగుమాడులో కొలువై ఉన్న శ్రీ రాముల వారి 'పట్టాభిషేకం'

- మహా అన్నదాన కార్యక్రమం
- అలరించిన చిన్నారుల కళా నృత్య ప్రదర్శన కార్యక్రమాలు
- చిన్నారులకు బహుమతుల ప్రధానం

**మధిర,మార్చి29(మనం న్యూస్):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు లో శ్రీ హనుమాన్ కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముల వారి పట్టాభిషేకము మరియు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కల్యాణాన్ని వేద పండితులు అనంత ఆచార్యులు అంగరంగ వైభవంగా నిర్వహించి తదుపరి రోజు అనగా ఆదివారం సీతారాముల స్వామివారి పూజా పట్టాభిషేక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టాభిషేకం కార్యక్రమం సందర్భంగా కొఠారి శ్రీను బాబు సహకారంతో డాన్స్ మాస్టర్ నాగరాజు కళాబృందంకి కళానాట్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి, కళానాట్య ప్రదర్శన చిన్నారులకు జిలుగుమాడు సభ్యులు గ్రామ పెద్దలు కొటారి రాఘువ , శ్రీ హనుమాన్ కోదండరామ దేవాలయ కమిటీ వారు ,మధిర ప్రెస్ క్లబ్ వారి మీదుగా



బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళా నాట్య పెద్దలు పుతుంబాక కృష్ణ ప్రసాద్ , గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాములవారి పట్టాభిషేకాన్ని తిలకించి అన్నప్రసాదాలను సేకరించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జిలుగుమాడు శ్రీ హనుమాన్ కోదండ రామాలయం నందు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయని ప్రజలు కొనియాడుతున్నారు. శ్రీ హనుమాన్ కోదండ రామస్వామి వారి ఆలయ కమిటీ వారికి , పెద్దలు కొఠారి రాఘువరావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# నేడు జరిగే తెలంగాణ లేబర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి




**రంగారెడ్డి మార్చి 29 (మనం న్యూస్):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి అని కోరుతూ ఈ నెల 30న జరిగే తెలంగాణ లేబర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి అని సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. సిఐటియు ఎల్బీనగర్ అడ్డా కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం వెంకటరమణ కాలనీలో చలో లేబర్ బోర్డు ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా సహకార దర్శి పొట్టిపాకు రామస్వామి అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా సహా కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధులు పథకాలు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈనెల 30వ తేదిన సోమవారం లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు తెలియజేశారు కార్మికుల పక్షాన ఎర్రజెండా సంఘాలు దశబ్దాలుగా పోరాడగా ఓంపక్షాల మద్దతు దేవ గౌడ్ ప్రధానిగా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాన్ని తీసుకొచ్చిందని తెలియజేశారు మన రాష్ట్రంలో అమలుకు పోరాటంగా 2009 సంవత్సరంలో సాధించుకున్న ఈ పథకాన్ని లేబర్ కోడ్ పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా లేబర్ బోర్డు అధికారులు స్పందించి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు కొత్త లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ చేసుకున్న రోజు నుంచే పథకాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షులు ఎల్ లక్ష్మణ్, గంగరాజు, లచ్చయ్య మున్నా,లక్ష్మయ్య, గంగరాజు, రమేష్ , ఏ లచ్చయ్య, ఎం మల్లయ్య, ఎన్ వెంకన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వర స్వామి దేవాలయంలో అర్చకుల కొరత

- ప్రైవేట్ పూజలపై ప్రజల ఆగ్రహం

**సుజాతనగర్, మార్చి 29 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం 22వ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు లేకపోవడంతో పూజా కార్యక్రమాలు ప్రైవేట్ పూజారులతో నిర్వహిస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిర్వహించాల్సిన నిత్యపూజలు ప్రభుత్వ నియామక అర్చకులు లేకపోవడంతో తాత్కాలికంగా ప్రైవేట్ అర్చకుల చేత కొనసాగుతున్నాయని సమాచారం. ఈ వ్యవహారంపై స్థానిక భక్తులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయం ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, ఎండోమెంట్స్ శాఖ పర్యవేక్షణలో పూజలు సక్రమంగా జరగాల్సి ఉండగా, ఇలాంటి పరిస్థితులు రావడం అన్యాయం అని అభిప్రాయపడుతున్నారు. గతంలో పనిచేసిన అర్చకుడు పదవీ విరమణ చేసినప్పటి నుండి ఇప్పటివరకు కొత్త అర్చకుడిని నియమించకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులను అడగగా, ఇప్పటివరకు సరైన అర్హతలు కలిగిన ప్రధాన అర్చకుడు దొరకలేదు అని వివరణ ఇచ్చినట్లు



తెలుస్తోంది. అయితే, నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో భక్తులలో అసంతృప్తి పెరుగుతోంది. ఎండోమెంట్స్ దేవాలయాల గురించి: ప్రభుత్వ ఎండోమెంట్స్ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయాలు ప్రజల విశ్వాసాలకు ప్రతీకలు. వీటి నిర్వహణ, పూజా విధానాలు, ఆర్థిక వ్యవహారాలు అన్నీ ప్రభుత్వ నియంత్రణలో జరుగుతాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించడం, నిత్యపూజలు నిరంతరంగా నిర్వహించడం, అర్చకుల నియామకం వంటి బాధ్యతలు ఎండోమెంట్స్ శాఖపైనే ఉంటాయి. స్థానికులు వెంటనే పూర్తి స్థాయి ప్రధాన అర్చకుడిని నియమించి, దేవాలయంలో పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కోరుతున్నారు. అవసరమైతే తాత్కాలిక ఏర్పాట్లకు బదులుగా శాశ్వత పరిష్కారం చూపాలని, భక్తుల విశ్వాసాలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి మహిళకు విద్య ఆవశ్యకం



**భీమదేవరపల్లి మార్చి 29 మనం న్యూస్:** ప్రతి మహిళకు విద్య ఆవశ్యకమైందని డిపిఎం పద్మప్రియ అన్నారు. ఆదివారం రోజున అమ్మ అమృత అక్షరమాల కార్యక్రమంలో భాగంగా వయోజన విద్య లో విద్య నేర్చుకున్న మహిళలకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా డిపిఎం పద్మప్రియ పర్యవేక్షణ చేసి అనంతరం వారు మాట్లాడుతూ భీమదేవరపల్లి మండలం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో 19 సెంటర్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 1500 మహిళలు పరీక్షకు హాజరయ్యారని, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 12960 మంది మహిళలు 239 సెంటర్లలో పరీక్షకు హాజరయ్యారని అభ్యసించి మహిళలు పరీక్షలకు హాజరయ్యారు తెలిపారు. మహిళలు తమ సమస్యల పరిష్కారానికి విద్య తోడ్పడుతుందని ఎలుకతుర్తి మార్కెట్ చైర్మన్ బొక్కల స్రవంతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వేణు, సిసి సదానందం, సిఐలు, మహిళా సంఘాల్లో ఉన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి శిబిరం




**ములుగు జిల్లా మార్చ్ 29 న్యూస్:** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం లో ఎన్ ఎస్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు అందులో 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు అందులో 57 మందికి ఆపరేషన్ అవసరం అని నిర్ధారించి వారిని సమస్త వారు ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన బస్సులో హైదరాబాదు శంకర ఆసుపత్రికి తీసుకువెళ్లారు అక్కడ వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి మరియు అద్దాలు సమకూర్చి మరియు ఉండడానికి భోజనం అన్నియు సమస్త వారు సమకూర్చుతారు మరియు ఆపరేషన్ అయిపోయిన తరువాత ప్రత్యేకమైన బస్సులో తిరుగు ప్రయాణం కూడా కల్పిస్తున్నాము ఇటువంటి మంచి కార్యక్రమానికి సహకరించిన ప్రజలందరికీ మరియు ఇంత మంచి సిబిరాన్ని అందించిన శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ యాజమాన్యానికి ట్రస్ట్ చైర్మన్ మహేష్ నాయక్ పత్తిపల్లి ధన్యవాదాలు తెలిపారు

## నారా లోకేష్‌తో సహపంక్తి భోజనంలో
# పాల్గొన్న పొన్నమండ రామలక్ష్మి



ముమ్మిడివరం, మార్చి 29, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్ళరేవు మండలం కోరంగి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మికి అరుదైన గౌరవం దక్కింది. తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యువనేత నారా లోకేష్ తో ఆత్మీయ సమావేశం మరియు సహ పంక్తి భోజనాలలో పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నమండ రామలక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తలకు సైతం అత్యున్నత స్థాయిలో గౌరవం దక్కుతుందన్న విషయాన్ని ఈ సంఘటన తెలియజేస్తుందన్నారు.


# కుక్కునూరులో ఘనంగా 44వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహా, పార్టీ దిమ్మలు ఆవిష్కరణ.

కుక్కునూరు, మార్చి 29 ( మనం న్యూస్ ): మండలంలో టిడిపి 44 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఒక ఉత్సవంలా నిర్వహించారు. వందలసంఖ్యలో టిడిపి,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు.బెస్తగూడెంలో దివంగత ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు.విగ్రహావిష్కరణ సందర్భంగా 'జై ఎన్టీఆర్,జైజై తెలుగుదేశం,జై చంద్రబాబు,జైజై లోకేష్ బాబు అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

**ప్రాణమున్నంతవరకు టిడిపి తోనే : ములిశెట్టి నాగు**

టిడిపి ఆవిర్భావంనుంచి నందమూరి తారక రామారావు వెంట ఉన్నానని,ఆ తర్వాత చంద్రన్న వెంట ఉంటున్నానని, పార్టీ కష్టకాలంలోనూ ప్రతీ కార్యకర్త నా కుటుంబానికి చెందిన వాడిగా కాపాడుకున్నానని,ప్రస్తుతం లోకేష్ బాబు



అడుగుజాడల్లో నడుస్తున్నానని చివరి రక్తపు బొట్టు టిడిపి కోసమే ధారపోస్తానని,ప్రాణమున్నంతవరకు తెలుగుదేశం జెండా వీడనని ములిశెట్టి నాగు ప్రమాణం చేశారు.

**ఎన్టీఆర్ నేర్పిన క్రమశిక్షణనే పాటిస్తున్నాం : సీనియర్ నేత కోటగిరి సత్యనారాయణ**

44ఏళ్లుగా ఎన్టీఆర్ నేర్పిన క్రమశిక్షణ వల్లే టిడిపిలో ఉన్నామని,ఆ మహానుభావుడి అడుగుజాడల్లో నడుస్తూ,ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా, ప్రభుత్వంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా, చంద్రబాబు నేర్పిన ఓపిక, లోకేష్ బాబు నేర్పిన ధైర్యం, ఉత్సాహంతోనే పార్టీలో ముందుకు నడుస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ తెలిపారు.

**అందరికీ అన్నదాన కార్యక్రమం: ఉపసర్పంచ్ పిచ్చుక రాజు**

టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుక్కునూరు లోని ములిశెట్టి నాగు ఇంటివద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అన్నదానకార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరైన నాయకులు,కార్యకర్తలకు ఎలాంటి లోటు లేకుండా కుక్కునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు,యూత్ నాయకులు నరేశ్ కుమార్ చూసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాచర్ల గంగరాజు, మాజీ వైస్ ఎంపిపి బొల్లు కృష్ణార్జునరావు,మాజీ సర్పంచ్ మడకం సుజాత, బిజెపి ధార్మిక శాఖ జిల్లా కో కన్వీనర్ వాడపల్లి లక్షణాచార్యులు, మణికంత,దాచారం సర్పంచ్ రామకృష్ణ,జనసేన మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్,నరుకుళ్ల సత్యనారాయణ,మడకం నాగేశ్వరరావు,సీనియర్ నాయకులు సరిహద్దు సత్యనారాయణ, శీలం లక్ష్మయ్య,కరేటి అప్పారావు,పులి శ్రీనివాసరావు,చుంచు సత్యనారాయణ,కుచ్చర్లపాటి రమణరాజు,నరేంద్ర రాజు, ఓలేటి వెంకటేశ్వరరావు,వాసు,రాంబాబు బాపిరాజు,మాచర్ల రమణయ్య,ధూల్ పేట శ్రీను,మేడి పల్లి వీరబాబు, శేఖర్, రాంబాబు, బాలాజీ,నాయకురాలు వెంకటరమణ, రమాదేవి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామ దేవత సంబురాలు

కుక్కునూరు, మార్చి 29 ( మనం న్యూస్ ): మండలంలోని కివ్వక గ్రామంలో గ్రామదేవత మా లక్ష్మమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామ దేవతలు గ్రామస్తులు మొక్కులతో ప్రారంభం అవ్వగా తదనంతరం అమ్మవారి ఊరేగింపు డప్పు వాయిధ్యాలతో విధి విధి తిరిగి అమ్మవారు భక్తులుకు దర్శనం ఇస్తూ పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న కొంతమంది భక్తులకు అమ్మవార్లు పూని నృత్యాల కోలాటం మధ్య అమ్మ వారి ఊరేగింపు మరింత ఉత్సాహంగా ముందుకు సాగింది. అనంతరం సాయంత్రం అమ్మవారికి గ్రామ ప్రజలు, భక్తులందరూ ప్రత్యేక పూజలు నిర్వహించి పూలు, ఫలహారాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.జ అనంతరం ఆదివారం రాత్రి 8



గంటల నుంచి తెల్లవారుజామున వరకు అమ్మవారిని ప్రత్యేకంగా కొలుసుకొని గ్రామానికి సంబంధించిన పొలిమేరలలో ప్రత్యేక తోరణాలు ఏర్పాటు చేసి అమ్మవారిని యధావిధిగా మరల గర్భగుడిలో కొలువుదీరి పూజలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కులాల అతీతంగా భక్తి సామరస్యంతో గ్రామస్తులు అందరూ పాల్గొన్నారు.

## హరి నామ జపం కార్యక్రమం



ముమ్మిడివరం మార్చి 29 మనం న్యూస్: చిన్నకొత్త లంక గ్రామం లొ వెలసిన పట్టాభి రామ స్వామి వారి ఆలయంలో సీతా రామ స్వామి వారి కళ్యాణ మహోత్సవం భాగంలో 3వ రోజు ఆదివారం తోటకూర రామకృష్ణం రాజు,సూర్యావతి సమరస త సేవా పౌండేషన్ వారి ఆధ్వర్యంలో అఖండ హరి నామ జపం కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభవం అయినది.సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా హరి నామ జపం కార్యక్రమం జరిగింది . ఈ హరి నామ జపం కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం,మార్చి 29, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐపోలవరం మండలంలోని మురమళ్ళ గ్రామంలో ఆదివారం 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాసనసభ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పార్టీ జెండాను ఎగురవేసి, ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తరువాత ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం అవతరించిన తెలుగుదేశం పార్టీ, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే మహోన్నత నినాదాన్ని ఇచ్చిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచిందన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాతే అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు



లభించిందని సుబ్బరాజు తెలిపారు. దేశంలో సంక్షేమ పథకాల పునాది వేసిన పార్టీగా టీడీపీ ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. ప్రపంచంలో తెలుగువారిని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ మహోన్నత పార్టీకి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం దినోత్సవ వేడుకలు



కిర్లంపూడి, మార్చి 29:( మనం న్యూస్ ): కిర్లంపూడి మండలం శృంగారాయునిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ స్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలవమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గోడే బాల, గరగ గోవింద్, తిరుమల సత్యానందం, బొజ్జపు నాగేశ్వరరావు, అల్లు మల్ల వెంకటేశ్వరరావు, గుడే బాసు తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోరుగా జనసేన సభ్యత్వం నమోదు కార్యక్రమం

- ఆర్థిక సాయం చేసిన జనసేన నాయకులు

కాట్రేనికోన మార్చి 29 మనం ప్రతినిధి: ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం మండల అధ్యక్షులు మోకా బాల ప్రసాద్ అధ్యక్షతన త్రీ మ్యాన్ కమిటీ సభ్యులు కల్వ కొలను తాతాజీ , వాసంశెట్టి కుమార్, ఆకుల ప్రవీణ్ మరియు ముమ్మిడివరం ఏఎంసి చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ , ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించి సభ్యత్వ నమోదు ఇంటింటికి వెళ్లి వారిచే జనసేన పార్టీ సభ్యత్వం చేయించడం జరిగింది. చెయ్యేరు, పల్లం, మరియు దొంతికూరు , కాట్రేని కోన పంచాయితీ చెంచులగరువు గ్రామాలలో జనసేన పార్టీ సభ్యత్వం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చెంచులు గురువు లో చెంచుల సామాజిక వర్గానికి చెందిన నక్క ఏసమ్మ అల్లుడు అతి చిన్న వయసులో గుండునొప్పి తో మృతి చెందగా ఆ కుటుంబానికి జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గం సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి, గుద్దటి విజయ్ ద్వారా



వారి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు అలాగే అదే గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న కాశీ నిర్మలమ్మ కి వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుద్ధటి విజయ్ 5000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు.

ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి , గుద్ధటి విజయ్, ముమ్మిడివరం హాస్పిటల్ డైరెక్టర్ బద్రి రమా, జనసేన ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోర్డినేటర్ ముత్యాల జయ లక్ష్మి , సీనియర్ నాయకులు నూకల దుర్గబాబు,గాలిదేవరా మూర్తి, సొసైటీ డైరెక్టర్స్ గోదాసి పుండరీస్, నూకల మూర్తి, మండల అధ్యక్షులు దూడల స్వామి నాయుడు , ఎంపిటిసి లంకలపల్లి రాణి, కాయల బలరాం, మణికుమార్,వంగ సీతారాం,విత్తనాల రవితేజ,నారాయణమూర్తి, వనచర్ల నాని, సూరంపూడి కుమార్,సలాది రాజా, మాగపు మల్లేష్, గాలి దేవర గణేష్,గిడ్డి రత్నశ్రీ ,భీమల సూరినాయుడు, మగాపు పట్టాభి,రాగుర్తి యేసోబ్ మరియు జనసేన నాయుకులు వీర మహిళలు పాల్గొన్నారు.



## వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో
# టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం, మార్చి 29, మనం న్యూస్: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్లరేవు మండల పరిధిలోని గ్రామాల్లో ఘనంగా 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు నిర్వహించారు .తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా 10వ క్లస్టర్ లో ఉన్న ఉప్పంగల, లచ్చిపాలెం, సుంకరపాలెం మరియు పిల్లంక గ్రామాలలో క్లస్టర్ ఇంచార్జ్ డాక్టర్ మోపూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యూనిట్ మరియు బూత్ ఇంచార్జిలు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిత్ర కారుడు అంజికి
# ఘన సత్కారం



కాట్రేనికోన మార్చి 29 మనం ప్రతినిధి: కాట్రేనికోన కి చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి కి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులు మీదుగా అవార్డు ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా ఆదివారం బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఆకెళ్ల నారాయణ మూర్తి (బుజ్జి), అమలాపురం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రాణి శ్రీనివాస్, ముమ్మిడివరం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, కాట్రేనికోన మండల జనసేన అధ్యక్షులు మోక బాల ప్రసాద్, ముమ్మిడివరం ప్రాధమిక హాస్పిటల్ డైరెక్టర్ బద్రి రమ, మత్రిప్రగడ సత్రం చైర్మన్ గొర్తి పవన్, జనసేన నాయకులు భీమాల సూర్యనాయుడు, చిత్రకారులు ధర్మాడి అంజి తదితరులు ఆకొండి అంజి స్వగృహానికి విచ్చేసి క్రియేటివ్ హార్ట్స్ ఆర్ట్ గ్యాలరీని సందర్శించి, ఆకొండి అంజి ని దుశ్శాలువతో పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆకొండి మహేష్, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు


# ఉత్సాహభరితంగా ఎడ్ల పరుగు పోటీలు



పిఠాపురం మనం న్యూస్ : సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలని పిఠాపురం ఎమ్మెల్యే,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఇచ్చిన స్ఫూర్తితో పిఠాపురం మండలం బీ.ప్రత్తిపాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహభరితంగా,ఉత్కంఠగా జరిగాయి. ,జూనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 35 జతల ఎడ్లు పాల్గొన్నాయి.ఎంతో ఉత్సాహంగా,ఉత్కంఠగా సాగిన ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గుమ్మిలేరు గ్రామస్తుడు కోరా తేజాచౌదరికి చెందిన ఎడ్లజత,రెండు,మూడు బహుమతులు జీ.మేడపాడు మలిరెడ్డి అన్నపూర్ణ,మండపేట వేగుళ్ళ తేజాబాబుకు చెందిన ఎడ్లజత పొందాయి. అలాగే.,జూనియర్ విభాగంలో మొదటి బహుమతి కాపవరం గ్రామస్తుడు కుంచం మనోజ్ కు చెందిన ఎడ్లజత,రెండు,మూడు బహుమతులు తిరుమాలి గ్రామస్తుడు మాగాపు రాంబాబు,వన్నెపూడి గ్రామస్తుడు బవిరిశెట్టి మణికి చెందిన ఎడ్లజత పొందాయి.నిర్వాహకులు ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఏలేరు ప్రాజెక్ట్ వైస్ ఛైర్మన్ ఊటా నానిబాబు,కీర్తి బుచ్చిబాబు,బీ.ప్రత్తిపాడు సర్పంచ్ ఊటా రామకృష్ణ మీడియాతో మాట్లాడారు.


# సర్వేశ్వరరావుకు పలువురి అభినందనలు

నరసాపురం, మార్చి 29 (మనం న్యూస్) : ఆర్యవైశ్య సంఘానికి అందించిన అత్యుత్తమ సేవలకు గాను నరసాపురం పట్టణానికి చెందిన అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఉచిత వధూవరుల కమిటీ చైర్మన్ సమయ మంతుల సర్వేశ్వరరావుకు శనివారం భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు వబిలిశెట్టి కనకరాజు త్రిశూల్ మాట్రిమోని అధినేతలు ఓలేటి శ్రీనివాస్ గుప్తా, గూడూరి బాల మురళీకృష్ణ తటవర్తి కిరణ్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమయ మంతుల సర్వేశ్వరరావుకు ఐవిఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, ఏపీఐసీసీ మాజీ అధ్యక్షుడు



శ్రీఘాకోలపు శివరామ సుబ్రహ్మణ్యం, నరసాపురం పట్టణ ఆర్యవైశ్యులు, వాసవి క్లబ్ గోల్ కుటుంబ సభ్యులు, రేషన్ డీలర్ల అధ్యక్షుడు అధికారి వీర వెంకట సత్యనారాయణ, మండల రేషన్ డీలర్లు, ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ నాయకులు నందిపాటి రామ కృష్ణ, నూలి దుర్గాప్రసాద్, శిరం రామకృష్ణమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

# వాడపల్లి వెంకన్న కళ్యాణం అంగరంగ వైభవం



- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు
- గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

ఆత్రేయపురం, మార్చి 29: (మనం ప్రతినిధి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు హాజరై స్వామివారి దివ్య కళ్యాణాన్ని కనులారా తిలకించి పరవశించారు. గ్రామమంతా గోవింద గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. ఏడు శనివారాలు వెంకన్నను దర్శిస్తే ఏడేడు జన్మల పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసంతో ఈ ఆలయానికి విశేష ఆదరణ ఉంది. ఆ విశ్వాసానికే నిదర్శనంగా ఆదివారం ఉదయం నుంచే భక్తుల రద్దీ పెరిగి, సాయంత్రానికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విద్యుత్ దీపాల అలంకరణతో ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా మెరిసిపోగా, కళ్యాణ వేదికను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రముఖ వేదపండితులు ఖండవల్లి రాజేశ్వరవర ప్రసాద్ ఆచార్యులు బ్రహ్మత్వంలో, ఆలయ అర్చక వర్గం శాస్త్రోక్తంగా కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించింది. ముందుగా స్వామి, అమ్మవార్లను సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పల్లకిలో స్వామి వారిని కళ్యాణ వేదిక వద్దకు ఘనంగా తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఆసీనులను చేశారు.

## జే సి నిశాంతికి కలెక్టర్‌గా పదోన్నతి



అమలాపురం మార్చి 29 మనం న్యూస్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ గా పనిచేస్తున్న టి నిశాంతి కి పదోన్నతి లభించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది 2024 జులై 24 నుండి జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. జే సీ బదిలీతో ప్రస్తుత కలెక్టర్ మహేష్ కుమార్ జే సి భాధ్యతలు సైతం నిర్వహించనున్నారు.

# టిడిపిలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్తలు మద్దుల రాంబాబు,ఏలూరు ఫణి కుమార్‌లు


జంగారెడ్డిగూడెం,మార్చి 29 మనం ప్రతినిధి: జంగారెడ్డిగూడెం లోని సింహాద్రి మొబైల్స్ అధినేత మద్దుల రాంబాబు,ఏలూరి ఫణి కుమార్ స్వాతి ట్రేడర్స్ అధినేతలు జంగారెడ్డిగూడెం టౌన్ ప్రెసిడెంట్ కొండ్రెడ్డి కిషోర్ కుమార్,సెక్రటరీ కోనేటి చంటి ఆధ్వర్యంలో 44వ పార్టీ ఆవిర్భావం దినోత్సవం రోజున అధికారికంగా తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు.పార్టీలో చేరిన అనంతరం ముద్దుల రాంబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆశయాలు మరియు ప్రజలకు అందిస్తున్న సేవలు తనను ఎంతో ప్రభావితం చేశాయని తెలిపారు.



భవిష్యత్తులో ఆయన ప్రతిభను గుర్తించి బాధ్యతాయుతమైన పదవులు ఇస్తే,ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పరిమి సత్తిపండు, రాజాన పండు,ముస్తఫా మండవ లక్ష్మణరావు,తూటి రాము,దాకారపు కృష్ణ మహంకాళి రాంబాబు,గుమ్మడి ప్రసాద్ చెరుకూరి శ్రీధర్ మరియు కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇల్లు ఒక చాకిరేవేనా?!

## ఇంకా ఇంటిపనులకు దూరంగా పురుషులు...?



వీక్షణం

'నా భార్య ఇంటి పనులు చేయకుండా, నా పట్ల క్రూరంగా ప్రవర్తిస్తోంది, తనతో నాకు విడాకులు ఇప్పించండి'... అంటూ ఒక భర్త కోర్టు మెట్లు ఎక్కాడు. ఇది కాసింత సంచలనాన్ని సృష్టించింది. అభివృద్ధి చెందిన సమాజంగా ఎదగాల్సిన భారతీయ సమాజాన్ని ఛాందసవాద, తిరోగమన భావజాలం ఎంతగా క్రుంగదీస్తోందో ఈ సంఘటన చెబుతోంది. స్థూలదృష్టికి ఇది చాలా చిన్న సమస్యగా కనిపించినప్పటికీ, సమాజంలో సగభాగమైన మహిళలు నిత్యం ఎదుర్కొంటున్న వివక్షకు ఇది అద్దం పడుతోంది. ఇంటి పనులు చేయడమన్నది కేవలం మహిళల బాధ్యతేనా, పురుషులకు ఇందులో ఎలాంటి భాగస్వామ్యం ఉండదా? పురుషులు ఇంటిపనులు చేయడాన్ని ఏ చట్టమైనా నిషేధించిందా? చట్టపరంగా ఇలాంటి నిషేధాలేమీ లేవు. 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్', 'మిసెస్' వంటి సినిమాలు కూడా ఇవాళ ఈ అంశాన్నే సమాజం దృష్టికి తెచ్చాయి. మారిన కాలంతోపాటు మనుషులు మారాల్సిన అవసరం ఉందని, 'ఇంటిపని' కేవలం మహిళల బాధ్యతగానే చూడకూడదని, ఇంటిపని చేయనంత మాత్రాన విడాకులు కోరడానికి అవకాశం లేదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

**ప్రభుత్వం తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలో, 'మహిళలు ఇళ్లలో ఇంటిపనులు, పోషణ బాధ్యతల కోసం గంటలు గంటలు గడిపేస్తున్నారు. కుటుంబ పోషణ కోసం పురుషులు చేసే పని కన్నా, మహిళలు ఈ బాధ్యతల కోసం చేసే పనులే ఎక్కువ శ్రమతో కూడుకుని ఉన్నాయి. ఒక రోజులో మహిళ 289 నిమిషాలు ఇంటిపనుల కోసం, మరో 137 నిమిషాలు సంరక్షణా బాధ్యతల కోసం వెచ్చిస్తోంది, ఇవేవీ ఆర్థిక పారితోషికాన్ని సృష్టించడం లేదు. అదే సమయంలో ఒక పురుషుడు ఒక రోజులో ఇంటి పనుల కోసం 88 నిమిషాలు, సంరక్షణా బాధ్యతల కోసం 75 నిమిషాలు మాత్రమే ఖర్చు పెడుతున్నాడు. ఆర్థిక ప్రతిఫలాన్నిచ్చే పనుల కోసం మహిళలు చాలా తక్కువ సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది' అని తేలింది.**

భారతదేశం తరతరాలుగా ప్రధానంగా పితృస్వామిక భావజాలంతో నిండిన సమాజం. పురుషాధిక్యతే ప్రధానాంశంగా ఈ సమాజంలో కుటుంబ సంబంధాలు ఉంటాయి. ఈ హెచ్చుతగ్గుల వైరుధ్యం ముఖ్యంగా వైవాహిక సంబంధాల్లో పాతుకుపోయింది. అయితే మారుతున్న కాలంతో పాటు సమాజం కూడా కొన్ని మార్పులకు తలవొగ్గి తీరాలి. ఇవాళ పురుషులతో సమానంగా మహిళలు కూడా ఉన్నత విద్యల్ని అభ్యసిస్తున్నారు, వృత్తి ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. అయినప్పటికీ, ఇంటి పనులు, పిల్లల పెంపకం వంటి బాధ్యతల్లో మాత్రం పాతకాలపు విలువలే చెలామణిలో ఉన్నాయి. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడమన్నది స్త్రీల బాధ్యతగానే ఉంటోంది. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, వంట చేయడం, పిల్లల్ని పెంచడం వంటి బాధ్యతల్లో పురుషులు భాగస్వాములవడం చాలా చాలా అరుదుగా ఉంటోంది. మన సమాజంలో 'హౌస్‌వైఫ్' అనే పదానికి చాలా అవమానకరమైన నిర్వచనం ఉంటోంది. బయటి సమాజంలోకి వెళ్ళి, వృత్తిఉద్యోగాల్లో తమదైన సంపాదనను ఆర్జించి, కుటుంబ పోషణలో ప్రధాన పాత్ర వహించేది పురుషులే, అంటే సాధారణంగా 'భర్తలే' అనే భావన వ్రేళ్ళూనికుని ఉంది. ఈ భావన ప్రకారం మహిళలు ముఖ్యంగా భార్యలు ఇంటిపట్టునే ఉంటూ, ఆర్థిక విలువ లేని పనులు చేస్తుంటారు. వారు చేసే పనులు స్త్రీగా వారి ప్రాథమిక బాధ్యతే తప్ప, దాని వల్ల కుటుంబానికి పెద్దగా ఒరిగేదేమీ ఉండదన్న ఉదాసీనత మన సమాజంలో ఉంటోంది. ఇంటి పనులకు, పిల్లల పెంపకానికి ఎలాంటి ఆర్థిక విలువ ఉండదు, ఈ పనులు చేసినందుకు మహిళలకు ఆర్థికపరంగా ఎలాంటి వేతనాలు లభించవు. తత్ఫలితంగా 'హౌస్‌వైఫ్' అనే పదాన్ని చులకన భావంతో ఉచ్ఛరించడాన్ని మనం వింటూనే ఉంటాం.



### పనిమనిషి కాదు..,

అయితే సమకాలీన సామాజిక దృష్టితో, విశాల భావనలతో, వివక్షారహితంగా చూసినపుడు ఈ 'హౌస్‌వైవ్స్' చేసే పనులు ఎంతో విలువైనవి. అవి వ్యక్తులుగా, కుటుంబాలుగా, సమాజాలుగా మానవజాతి సజావైన అభివృద్ధిని సాధించడానికి కీలకమైన పనులు. 'ఎన్ని చదువులు చదివి, ఎంత విన్నను గానీ...,' పురుషుడు మాత్రం ఈ సత్యాన్ని అంగీకరించడానికి ఇంకా సిద్ధపడడం లేదు. సుప్రీంకోర్టులో తాజాగా విచారణకు వచ్చిన ఒక కేసు ఇలాంటి విషాదసత్యాన్నే మన కళ్ళకు కడుతోంది. ఇంటిపనులు చేయకుండా భార్య తన పట్ల 'క్రూరంగా' వ్యవహరిస్తోంది, కాబట్టి తనకు ఆమెతో విడాకుల్ని ఇప్పించాల్సిందిగా ఒక భర్త న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ కేసు విచారణలో 'నువ్వు పెళ్ళి చేసుకున్నది పనిమనిషిని కాదు, జీవిత భాగస్వామిని...' అంటూ న్యాయమూర్తి ఆ భర్తకు చీవాట్లు పెట్టారు. ఇది స్థూలదృష్టికి చాలా చిన్నవిషయంగాను, నాలుగు గోడల మధ్య మణిగిపోవలసిన విషయంగాను కనిపిస్తుంది. అయితే, ఇది కనిపించినంత చిన్నవిషయం కాదు, ఒక మహిళ పెళ్ళయిన నాటి నుంచి అంతవరకు ఒక యువతిగా తాను గడిపిన జీవితానికి స్వస్తి చెప్పి, కొత్తబాధ్యతల్ని భుజాల మీదికి ఎత్తుకోవలసి వస్తుంది. ఆ బాధ్యతలు ఇంటిపనులు చేయడం, వంట, పిల్లల పోషణ, భర్త, అత్తమామలు, బంధువుల అవసరాలకే పెద్ద పీట వేసేవిగా ఉంటాయి. ఈ బాధ్యతల నిర్వహణలో సామాన్య మహిళలు తమ ఆరోగ్యాల్ని నిర్లక్ష్యం చేయడం, ప్రాణాంతక వ్యాధుల బారిన పడి, చివరిక్షణంలో వైద్యసహాయం కోసం పరుగులు పెట్టడం, కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడడం కూడా జరుగుతుంటుంది. ఇలాంటి దుష్పరిణామాలన్నీ 'సహజ పరిణామాలు'గా కనిపించడమే దురదృష్టకరం! దీని వెనుక పితృస్వామిక భావజాలం పెద్దపాత్ర పోషిస్తుంటుంది.

### నేతి బీరకాయ...

స్త్రీల సాధికారత అనేది ఇవాల్టికీ 'నేతిబీరకాయ' చందంగానే ఉంది. ఇవాళ స్త్రీ, పురుషులిద్దరూ చదువుకుంటూ, పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తూ, నగరాల్లో, పట్టణాల్లో వ్యష్టి కుటుంబాలుగా జీవిస్తున్నారు. ఇది ఉపరితల దృశ్యం మాత్రమే! ఉమ్మడి కుటుంబాల్లో పాత తరం మహిళలు పోషించిన బాధ్యతలు, ఇవాళ కాస్త రూపం మార్చుకున్నాయంతే! ఇవాళ ఇంటి పనులు చేయడానికి మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మెషీన్లు వంటి యంత్రాల సహాయం ఉండగా, మహిళలు తీరిగ్గా తిని కూర్చుని, టెలివిజన్ సీరియల్స్, ఇన్‌స్టా రీల్స్ చూస్తూ జీవితాల్ని ఉల్లాసంగా గడిపేస్తున్నారన్న అపోహ ఉంది. ఇది పూర్తిగా వాస్తవం కాదు, చాలా అరుదైన వాస్తవం. నూటికి తొంభై తొమ్మిది శాతం మంది మహిళలు తమ ఆర్థిక, సామాజిక, కౌటుంబిక స్థాయిలను అనుసరించి, రోజులో అవసరమైన దానికంటే ఎక్కువ గంటల్ని గృహబాధ్యతలు నిర్వర్తించడంలోనే గడిపేస్తుంటారు. పాతతరం మహిళలకు లేని ఆర్థిక విజయాన్ని నేటి మహిళలు సాధిస్తున్నారని మనకు అనిపిస్తుంటుంది. కానీ ఇది 'గోడ దెబ్బ, చెంపదెబ్బ లాంటిదే!' ఒకవైపు 'ఆడవాళ్ళ బాధ్యతలు..., పనుల' పేరుతో పాతతరం మహిళలు చేసిన పనుల్నే ఇవాల్టి ఆధునిక మహిళ కూడా చేయాల్సి వస్తోంది, దీనికితోడు ఈ ఆధునిక మహిళకు వృత్తి ఉద్యోగాల ద్వారా డబ్బును సంపాదించి, కుటుంబానికి చేదోడుగా ఉండాల్సిన అగత్యం కూడా ఏర్పడింది. ఇన్నింటి మధ్య ఇళ్ళలో 'మగవారి' స్వభావంలో వచ్చిన మార్పులు మాత్రం పెద్ద ఆశావహంగా లేవు. ఒకవేళ ఇంటిపనుల్లో పురుషులు భాగస్వామ్యం పంచుకున్నప్పటికీ, 'అదేదో మహా ఘనకీర్తి'గా చెప్పుకోవలసిన స్థితే కొనసాగుతోంది. ఇంటిపనులు చేసే మగవారి గురించి, 'త్యాగధనుల'న్న భావనతో మాట్లాడుతుంటారు. అదే పనిని ఏళ్ళూపూళ్ళుగా మహిళలు చేస్తుంటే, వారికి ఎలాంటి గుర్తింపు ఉండదు. పైగా 'హౌస్‌వైఫ్' అనే చులకన భావాన్ని కూడా మోయాల్సి ఉంటుంది.

### ప్రేమకు కొలమానమేది?

'నాకు నీ కౌగిలింతలు, ముద్దులు, నా పట్ల నువ్వు చూపించే శ్రద్ధాసక్తులు చాలా ఇష్టం. కానీ వంటింటి సింక్‌లో అంట్లను తోమడం నీ ప్రేమకు సిసలైన కొలమానం' అని ఇవాళ మహిళలు భావిస్తున్నారు. పొద్దుటే అందరికన్నా ముందుగా నిద్రలేవడం, ఇల్లు, వాకిలీ చిమ్మడం, అంట్లు తోమడం, ఇంట్లో వారి కోసం కాఫీ కలపడం, టిఫన్లు చేయడం, లంచ్‌బాక్స్‌లు సర్దడం, బట్టలుతకడం, బూజులు దులపడం, ఇంటిని అద్దంలా తుడవడం, పెద్దవాళ్ళకు మందులివ్వడం, వారితో సహా పిల్లల ఆలనాపాలనా చూడడం, పిల్లల చదువులో సహాయపడడం, మళ్ళీ రేపు ఉదయానికి కావలసిన సన్నాహాల్ని రాత్రే ముగించడం, బజారుకెళ్ళి వెచ్చాలు తేవడం, బంధువులు, పండుగలు సరేసరి... ఈ జాబితాకు అంతూ పొంతూ ఉండదు. నడుం విరిగిపోయే చాకిరీ! ఎంత చేసినా, ఇంకా ఏదో చేయలేదన్న దిగులు, భార్యగా సమాజం, కుటుంబం తన మీద విధించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నానేమోనన్న సంశయం.., దీంతో మహిళకు తన అవసరాల గురించి, ఆరోగ్యం గురించి పట్టించుకునే సమయం దొరకదు. ఇదంతా సహజం కాదు, మహిళ తన సంక్షేమం గురించి, స్వీయ భద్రత గురించి, జీవితానందం గురించి పూర్తిగా మరచిపోవాల్సి రావడం సహజం కాదు, వల్లమాలిన పనిభారంతో తనను ప్రతిక్షణం కరగదీసుకున్నా ఎలాంటి గుర్తింపు లేకపోవడం సహజం కానేకాదు! అది మహిళలతో కలిసి జీవిస్తున్న తోటిమనుషుల అకృత్యం.

### 289 నిమిషాలు...

ప్రభుత్వం తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలో, 'మహిళలు ఇళ్లలో ఇంటిపనులు, పోషణ బాధ్యతల కోసం గంటలు గంటలు గడిపేస్తున్నారు. కుటుంబ పోషణ కోసం పురుషులు చేసే పని కన్నా, మహిళలు ఈ బాధ్యతల కోసం చేసే పనులే ఎక్కువ శ్రమతో కూడుకుని ఉన్నాయి. ఒక రోజులో మహిళ 289 నిమిషాలు ఇంటి పనుల కోసం, మరో 137 నిమిషాలు సంరక్షణా బాధ్యతల కోసం వెచ్చిస్తోంది, ఇవేవీ ఆర్థిక పారితోషికాన్ని సృష్టించడం లేదు. అదే సమయంలో ఒక పురుషుడు ఒక రోజులో ఇంటి పనుల కోసం 88 నిమిషాలు, సంరక్షణా బాధ్యతల కోసం 75 నిమిషాలు మాత్రమే ఖర్చు పెడుతున్నాడు. ఆర్థిక ప్రతిఫలాన్నిచ్చే పనుల కోసం మహిళలు చాలా తక్కువ సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది' అని తేలింది. విషాదమేమిటంటే, మహిళాసాధికారత దిశగా ప్రభుత్వం గతంలో చేసిన అధ్యయనాలు కూడా ఇలాంటి చేదునిజాల్నే వెల్లడించాయి. మనదేశంలో 'కాలవినిమయ సర్వేలు' (టియుఎస్)లు వ్యక్తులు భిన్న కార్యకలాపాల్లో తమ సమయాన్ని ఎలా వెచ్చిస్తుంటారన్న అంశాన్ని పరిశీలిస్తుంటాయి. ఇలాంటి సర్వే మొదటగా 2019లో జరిగింది, తరువాత 2023లో జరిగింది. కాగా మొదటి సర్వేకి, రెండో సర్వేకి స్వల్పతేడా కనిపించింది. మొదటి సర్వే కంటే, రెండో సర్వేలో మహిళలు ఆర్థిక ప్రతిఫలాన్ని అందించే పని కోసం పదినిమిషాలు ఎక్కువగా వెచ్చించారు. అంతమాత్రం చేత మహిళలు జీతభత్యాలు లేని ఇంటిపనుల బారి నుంచి తప్పించుకున్నారని చెప్పడానికి వీల్లేదని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అశోకా విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ అయిన అశ్విని దేశ్‌పాండే, మహిళలు తమ సమయాన్ని ఎలా గడుపుతున్నారనే దానిపై లోతైన అవగాహన కోసం టియుఎస్ డేటాను భారతదేశ 'మహిళా కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఎఫ్ఎల్ఎఫ్‌పిఆర్)'తో పాటు విశ్లేషించాలని అంటున్నారు. ఎఫ్ఎల్ఎఫ్‌పిఆర్ అనేది కార్మిక శక్తిలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళల శాతాన్ని సూచిస్తుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఎఫ్ఎల్ఎఫ్‌పిఆర్ 2017-2018లో సుమారు 23% నుండి 2022-2023లో 37%కి పెరిగింది. ఈ పెరుగుదల కేవలం మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల మాత్రమే కాదని, ఆర్థిక ఇబ్బందులు కూడా దీనికి దోహదపడ్డాయని ప్రొఫెసర్ దేశ్‌పాండే అభిప్రాయపడ్డారు. 'మహిళలు ఇంటి పనులకు వెచ్చించే సమయం తగ్గే వరకు, ఉద్యోగాల్ని చేపట్టడానికి వేచి ఉండడం లేదు. కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడానికి మహిళలు పని చేయాలని కోరుకుంటున్నారని, అందుకే వారు ఇంటి బయట జీతంతో కూడిన పని, ఇంట్లో వేతనం లేని పని చేస్తూ 'డబుల్ షిఫ్టులు' చేస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి కారణం భారతదేశంలోని ప్రగాఢ పితృస్వామ్య సమాజమేనని, అది లైంగిక వివక్షతో కూడిన కఠిన నియమాలను అమలు చేస్తూనే ఉందని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్త్రీలు కూడా పురుషుల్ని ఇంటిపనులకు దూరంగానే ఉంచే ధోరణిని కలిగి ఉండడం పితృస్వామిక భావజాలం ప్రభావమే!

ఇంటిపనులు, సంరక్షణ బాధ్యతల్ని మోయడంలో మహిళలే ఎక్కువగా సతమతమవుతుండడమన్నది భారతీయ మహిళలకు మాత్రమే పరిమితం కాదు, ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, పురుషుల కంటే, గృహ, సంరక్షణ పనులపై సుమారు 2.8 గంటలు ఎక్కువ గడుపుతుండగా, భారతీయ మహిళల విషయంలో ఈ వ్యత్యాసం నాలుగు గంటలకు దగ్గరగా ఉంది. విద్యావంతులైన ఉన్నత వర్గాలలో కూడా, పురుషులు మాత్రమే కాకుండా, స్త్రీలు కూడా ఈ భావజాలాన్నే సమర్థించి, కొనసాగించే పాత్రలకే పరిమితమై ఉండడం శోచనీయం.

**- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)**

---

# అతను+ఆమె= బాధ్యత!

## గృహబాధ్యతల్ని స్వీకరించిన భర్త



మోతిహారికి చెందిన ఒక మెకానికల్ ఇంజనీర్ తన భార్య కెరీర్‌కు మద్దతునిస్తూ, బీహార్‌లోని సంప్రదాయ లైంగికపరమైన వివక్షను నిశ్శబ్దంగా సవాలు చేస్తూ, గర్వించదగిన గృహస్థునిగా మారాడు.

మోతిహారిలోని ఇరుకైన సందుల్లో ఉన్న ఒక సాదాసీదా రెండు గదుల ఇంట్లో ప్రతిరోజూ ఉదయం అమిత్ కుమార్ దూబే ఒక పొయ్యి మీద పెనాన్ని వేడిచేస్తూ, మరో పొయ్యి మీద బాణలిలో నూనె పోసి, ఉల్లిపాయల్ని, పచ్చి మిరపకాయల్ని చిటపటలాడిస్తూ, చపాతీలను గుండ్రంగా ఒత్తుతుంటాడు. డిగ్రీ రీత్యా మెకానికల్ ఇంజనీర్, ఇష్టపూర్వకంగా గృహస్థుడైన అమిత్ కుమార్ దుబే పదేళ్ళుగా తన ప్రతి ఉదయాన్నీ ఇలాగే ప్రారంభిస్తాడు. అదే సమయంలో పరిసరాల్లోని చాలా మంది పురుషులు పొలాలకు, టీ దుకాణాలకు లేదా చిన్న దుకాణాలకు వెళ్ళడానికి తమ చెప్పులు సర్దుకుంటూ ఉంటారు, కానీ అమిత్ అప్పటికే, రెండు స్కూల్ టిఫిన్లు సర్దేస్తాడు.., తన భార్య అధికారిక పర్యటన కోసం ఆమె కుర్తాను ఇస్త్రీ చేసి సిద్ధం చేసేస్తాడు.., కోల్‌కతాకు వెళ్లే ఆమె రైలు సమయాలను చూసి, ఆమెను హెచ్చరిస్తాడు.., తరువాత సంతలో కొనవలసిన కూరగాయల జాబితాను మనసులోనే రాసుకుంటాడు.

బయటివారికి ఇది, తీరిక లేని భారతీయ తల్లిదండ్రుల ఉదయంలా అయినా కనిపించవచ్చు. కానీ బీహార్‌లోని గ్రామీణ-పట్టణ ప్రాంతాల నడిబొడ్డున ఉన్న మోతిహారిలో, ఈ దృశ్యం ఒక విప్లవాత్మకమైంది. దాదాపు ఒక దశాబ్ద కాలంగా అమిత్ వంట చేయడం, శుభ్రపరచడం, పిల్లలను పెంచడం, ఇంటిని చక్కబెట్టడం వంటి ప్రధాన గృహ బాధ్యతలను నిర్వర్తిస్తుండగా, అతని భార్య ప్రీతి తన ఉద్యోగ బాధ్యతల కోసం పలు రాష్ట్రాల్లో పర్యటిస్తుంటుంది. 'పురుషులు సంపాదించాలి, స్త్రీలు ఇంటిని నిర్వహించాలి' అనే అతని చుట్టూ ఉన్న చాలా మంది నమ్మకాలకు ఈ ఎంపిక పూర్తిగా విరుద్ధం. ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన దేశవ్యాప్త సర్వేల ప్రకారం, ముఖ్యంగా మరింత సంప్రదాయబద్ధమైన, గ్రామీణ ప్రాంతాలలో అధిక శాతం భారతీయులు ఇప్పటికీ పురుషులే ప్రధాన సంపాదనపరులుగా ఉండాలని నమ్ముతున్నారు. అయినా ఇక్కడ అతను, వంటగదిలో వంటపనిలో ఆప్రాన్ ధరించి, కథను పూర్తిగా తిరగరాస్తున్నాడు.

అమిత్ కథను నిజంగా అర్థం చేసుకోవాలంటే, రెండు దశాబ్దాల వెనక్కి వెళ్లాలి. అతను చంపారన్‌లో చదువుకు అపారమైన ప్రాధాన్యతనిచ్చే కుటుంబంలో పెరిగాడు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో అతను అంచెలంచెలుగా ప్రవేశించాడు. కాలేజీలో ఉన్నప్పుడు, అతను ఫ్యాక్టరీలలో పనిచేయడం, డిజైన్ ప్రాజెక్టులు చేయడం వంటి చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. కానీ అవేవీ స్థిరమైనవి కావు. అమిత్, ప్రీతి కుటుంబ సంబంధాల ద్వారా కలుసుకున్నారు, తరువాత వారి పరిచయం పెళ్ళికి దారితీసింది. అమిత్ స్థిరమైన ఇంజనీరింగ్ ఉద్యోగాల కోసం వెతుకుతుండగా, ప్రీతి బ్యాంకింగ్, శిక్షణా కార్యక్రమాలు, కార్పొరేట్ సహాయక ఉద్యోగాల వంటి పోటీ పరీక్షలకు, ఇంటర్వ్యూలకు సిద్ధమైంది. ఆమె ఒకదాని తర్వాత మరొకటి సాధించింది. చివరికి, ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసిన ఒక ఉద్యోగాన్ని సంపాదించింది. కోల్‌కతా, భువనేశ్వర్ వంటి నగరాల్లో ప్రయాణ సౌకర్యం, స్థిరమైన జీతం, ఇంకా అభివృద్ధికి ఆస్కారం ఉన్న ఒక ఉద్యోగం అది. అమిత్ తాను ఇంటిపట్టున ఉండి, గృహబాధ్యతల్ని నిర్వర్తించడాన్ని ఎంచుకున్నాడు. ఈ నిర్ణయాన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా ఎగతాళి చేశారు. ఒక రోజు ఒక బంధువు, ఆపై ఒక స్థానిక విలేకరి చిత్రీకరించిన ఒక చిన్న రీల్ అన్నీ మార్చేసింది. ఆన్‌లైన్‌లో అతనికి సానుకూల ప్రతిస్పందన లభించింది. అమిత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని కూడా తెరిచాడు. అతను తనను తాను బాధితుడిగా గానీ, అమరవీరుడిగా గానీ భావించుకోడు. అతను పౌరుషాన్ని వదులుకోలేదు, దానికి తనదైన శైలిలో కొత్త నిర్వచనం ఇచ్చాడు.

కిటికీ



**- కల్కి**

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.